Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం, ఏప్రిల్ 07, 2025 | సంపుటి - 20 | సంచిక 185 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## దేశంలో మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే బ్రిడ్జ్ ప్రారంభం



చెన్నై : దేశంలోనే తొలి వర్టికల్ రైల్వే లిఫ్ట్ బ్రిడ్జ్‌ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. తమిళనాడులోని రామనాథపురంలో రూ.535 కోట్లతో దీనిని నిర్మించారు. పంబన్ బ్రిడ్జ్‌గా పిలిచే ఈ వంతెనను ప్రధాని జాతికి అంకితం చేశారు. సముద్రమట్టానికి 22 మీటర్ల ఎత్తులో నిర్మించిన ఈ వంతెన పొడవు 2.2 కిలోమీటర్లు. ఈ వంతెన కింద ఓడల రాకపోకలు జరిగే విధంగా వర్టికల్ లిఫ్ట్ ఉంటుంది. 2019 మార్చి 1న మోడీ ఈ ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేయగా..

2

# కళ్యాణం కమనీయం

### కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం..



### కల్యాణం తిలకించేందుకు లక్షలాది భక్తులు

### పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు

**భద్రాద్రి సీతారాముల కల్యాణం తిలకించేందుకు లక్షలాది భక్తులు దక్షిణ అయోధ్య బాట పట్టారు. శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో సీతారాముల కల్యాణం.. అంగరంగ వైభవంగా జరిగింది. ఇందుకోసం మిధిలా స్టేడియం అందంగా ముస్తాబైంది. సీఎం రేవంత్ రెడ్డి దంపతులు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.**

భద్రాద్రి కొత్తగూడెం:

భద్రాచల పుణ్య క్షేత్రంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మిథిలా స్టేడియం లోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం అనంతరం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అభిజిత్ లగ్నం లో సీతారాముల కల్యాణం జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో దేవస్థానం అధికారులు భక్తుల కోసం 2 లక్షల లడ్డూలు, 200 క్వింటాళ్ల తలంబ్రాలను పంపిణీకి సిద్ధం చేశారు. ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో భద్రాచలానికి 197



ప్రత్యేక బస్సులను నడుపుతోంది. సోమవారం నిర్వహించే పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విచ్చేయనున్నారు. భద్రాద్రి సీతారాముల కల్యాణం తిలకించేందుకు లక్షలాది భక్తులు దక్షిణ అయోధ్య బాట పట్టారు. 2లో




## ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికన్ల నిరసన

### వాషింగ్టన్ డిసిలో రోడ్లపైకి వేలాదిగా జనం

### మొత్తం 50 రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అమెరికన్లు

### ట్రంప్ నిర్ణయాలతో దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతాయని ఆందోళన

వాషింగ్టన్ :

అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. ట్రంప్, ఎలాన్ మస్క్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు, దాదాపు 50 రాష్ట్రాల నుంచి ప్రజలు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. ట్రంప్ రెండవ సారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తరువాత జరిగిన అతిపెద్ద నిరసన కార్యక్రమం ఇదేనని అక్కడి రాజకీయ వర్గాలు తెలియజేశాయి. ముందు చూపు లేకుండా ట్రంప్, మస్క్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల వాణిజ్య యుద్ధాలు జరుగుతాయని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను తొలగిస్తూ మస్క్ తీసుకున్న నిర్ణయంపైనా వారు నిరసన వ్యక్తం చేశారు. 'హ్యాండ్స్ ఆఫ్!' పేరుతో జనం దేశవ్యాప్తంగా 1200 పైచిలుకు ప్రదేశాల్లో నిరసన ర్యాలీలు నిర్వహి స్తున్నారు. 'ట్రంప్ గో బ్యాక్', 'హ్యాండ్స్ ఆఫ్ డెమోక్రసీ', 'మస్క్ వాజ్ నాట్ ఎలెక్టెడ్' వంటి నినాదాలతో వాషింగ్టన్ డిసి, న్యూయార్క్, షికాగో, మయామీ వంటి నగరాల్లో నిస్టేట్ క్యాపిటల్ భవ నాలు, ఫెడరల్ కార్యాలయాల వద్ద వారు ఆందోళనలు చేస్తున్నారు. 2లో



## రేవంత్ రెడ్డి రబ్బర్ స్టాంప్ సీఎం

### తెలంగాణ సొమ్మును దోచుకుని ఢిల్లీకి కప్పం కడుతున్నారు

### కాంగ్రెస్ సర్కార్ పై నిప్పులు చెరిగిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ :

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రబ్బర్ స్టాంప్‌లా మారారని మండిపడ్డారు. సచివాలయం నుండి ఏఐసీసీ ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్ మంత్రుల కమిటీతో రివ్యూ చేయడమేందని ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణ విషయంలో ఏఐసీసీ అధిష్టానానిదే తుది నిర్ణయమని పీసీసీ అధ్యక్షులు చెప్పడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరుండాలి ఎవరు వద్దు ఎవరికి చోటు కల్పించాలనేది ముఖ్యమంత్రి విచక్షణాధికారం. కానీ ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించడమేంది? సచివాలయంలో కాంగ్రెస్ నేత రివ్యూ చేయడమేంది తెలంగాణలో పాలన భ్రష్టు పట్టిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి మండిపడ్డారు.బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బండి సంజయ్ తొలుత తన నివాసంలో, ఆ తరువాత కరీంనగర్ లోని జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు తదితరులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. దేశ ప్రజలకు, కార్యకర్తలందరికీ బీజేపీ ఆవిర్భావ దినోత్సవ శు భాకాంక్షలు. 45 ఏళ్లుగా బీజేపీ అనేక ఒడిదొడుకులు, అవమానాలను అధిగమించిన పార్టీ బీజేపీ. వేలాది మంది కార్యకర్తల బలిదానాలు, లక్షలాది మంది పోరాటాలతో అధికారంలోకి వచ్చిన పార్టీ బీజేపీ. జాతీయ భావజాలం, సిద్ధాంత బలమే 2లో

## పార్టీలో గుర్తింపు కోసం బండి ఆరాటపడుతున్నారు

హైదరాబాద్:
కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై టిపిసిసి అధ్యక్షుడు మహేశ కుమార్ గౌడ్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వమే తెలంగాణలో సన్నబియ్యం ఇస్తే.. మరి దేశమంతా ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. సొంత పార్టీలో గుర్తింపు కోసం, పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బండి ఆరాటపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి బండి సంజయ్‌కి కనిపించడం లేదా అని అడిగారు. రేవంత్ రెడ్డికి పాలనపై పట్టు ఉండటం వల్లే బిసి రిజర్వేషన్, ఎస్సి వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని అన్నారు. హెచ్‌సియూ అంశాన్ని రాజకీయ అవసరాల కోసం మాట్లాడటం సరైంది కాదని స్పష్టం చేశారు. బండి సంజయ్‌కి రోజురోజుకీ అభద్రత భావం పెరిగిపోతోందని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేస్తే.. సహించేది లేదని హెచ్చరించారు.





## వక్ఫ్ చట్టంలో మార్పులకు రాష్ట్రపతి ఆమోదం

### స్వాతంత్ర్యం పూర్వపు ముసల్మాన్ వక్ఫ్ చట్టం రద్దు

న్యూఢిల్లీ : పార్లమెంట్ ఉభయ సభల్లో వాడిగా వేడిగా చర్చ అనంతరం ఇంతకు ముందు పార్లమెంట్ ఆమోదించిన వక్ఫ్ (సవరణ) బిల్లు 2025కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ముర్ము ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లు 2025ను కూడా ఆమోదించారు. 'పార్లమెంట్ ఆమోదించిన ఈ దిగువ చట్టానికి శనివారం (5న) రాష్ట్రపతి అంగీకారం లభించింది. ఇందుమూలంగా సాధారణ సమాచారం కోసం ప్రచురించడమైంది: ది వక్ఫ్ (సవరణ) చట్టం 2025' అని ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో తెలియజేసింది. 13 గంటలకు పైగా చర్చ అనంతరం రాజ్యసభ వివాదాస్పద శాసనానికి సమ్మతి తెలిపిన అనంతరం బిల్లును పార్లమెంట్ శుక్రవారం తెల్లవారు జామున ఆమోదించిన విషయం విదితమే. బిల్లుపై చర్చలో ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం చేశాయి.

మిగతా 2లో

## డిలిమిటేషన్‌పై మా భయాలను పరిహరించాలి



ప్రతిపాదిత డిలిమిటేషన ప్రక్రియకు సంబంధించిన తమిళనాడు ప్రజల భయాలను ప్రధాని నరేంద్ర మోడీ పరిహరించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆదివారం కోరారు. ఉదకమండలంలో ఒక అధికారిక కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ, తమిళనాడు హక్కులను ఏమాత్రం నియంత్రించరన్న హామీతా పార్లమెంట్‌లో ఒక తీర్మానాన్ని ఆమోదించేలా మోడీ చూడాలని అన్నారు.

### తమిళనాడు హక్కుల రక్షణకు పార్లమెంట్‌లో తీర్మానం ఆమోదించాలి

### ప్రధాని మోడీకి ఊటీ సభలో స్టాలిన్ డిమాండ్

ఉదకమండలం :
ఉదకమండలంలో కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించి, కొత్త పథకాలను ప్రకటించిన తరువాత స్టాలిన్ ప్రసంగిస్తూ, ప్రతిపాదిత డిలిమిటేషన్‌కు సంబంధించిన ఆందోళనలతో ఒక వినతిపత్రం సమర్పణకు ప్రధానితో భేటీకి సమయం కోరానని తెలియజేశారు. 'డిలిమిటేషన్‌పై వినతిపత్రం సమర్పణకు ఒక అపాయింట్ మెంట్ కోరాం నేను ఈ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటున్నందున ప్రధానితో సమావేశంలో పాల్గొనలేని నా అశక్తత గురించి ఆయనకు తెలియజేసి, మా మంత్రులు తంగం తెన్నరసు, రాజా కన్నప్పన్‌లను పంపాను. ఈ సమావేశం ద్వారాను, మీ ద్వారాను డిలిమిటేషన్ భయాలను పరిహరించ వలసిందిగా ప్రధానికి ఇందు మూలంగా విజ్ఞప్తి చేస్తున్నాను' అని స్టాలిన్ సభికులతో చెప్పారు. 'ఈ విషయమై పార్లమెంట్‌లో ఒక తీర్మానం ఆమోదించేలా కూడా మీరు (మోడీ) చూడాలి. ఇది (డిలిమిటేషన్) పార్లమెంటరీ సీట్ల తగ్గింపునకు దారి తీయ డమే కాకుండా మా భవిష్యత్తు గురించి కూడా ఇది ఆందోళన కరం అవుతోంది' అని ఆయన చెప్పారు. 'పుదుచ్చేరి సహా 40 పార్లమెంటరీ సీట్లు ఉంటాయి. కానీ అధికార బిజెపి ప్రభుత్వం డిలిమిటేషన్

## రేవంత్ రెడ్డి రబ్బర్ స్టాంప్ సీఎం

బీజేపీ ఈ స్థాయికి చేరింది. 2019లోనే బీజేపీ 18 కోట్ల సభ్యత్వంతో ప్రపంచంలోనే నెంబర్ వన్ పార్టీగా అవతరించింది. 16 రాష్ట్రాల్లో సొంతంగా, 6 రాష్ట్రాల్లో కూటమి ద్వారా ప్రభుత్వాలను కొనసాగిస్తున్నం.వాజ్ పేయి ఆధ్వర్యంలో ప్రోక్రాన్ అణుపరీక్షలతో దేశ సత్తా చాటినం.స్వర్ణ చతుర్భుజీ పేరుతో జాతీయ రహదారులను విస్తరించిన ఘనత బీజేపీదే. చిట్టచివరి వ్యక్తులకు సంక్షేమ ఫలాలు అందించాలన్న దీన్ దయాళ్ ఆశయాలను కొనసాగిస్తున్నాం.మోదీ పాలనలో భారత్ ఆర్థిక ప్రగతిలో అద్భుత ఫలితాలను కనబరుస్తోంది. అభివృద్ధి, సంక్షేమంలో దేశం దూసుకుపోతోంది. కేంద్ర సంక్షేమ పథకాలను పూర్తిగా తెలంగాణలో అమలు చేయడం లేదు.అన్ని రాష్ట్రాలను సమాన ధృక్పథంతో చూస్తూ అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం మోదీదే. కారణం. కాంగ్రెస్ అవినీతి పాలనను అంతం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై మజ్లిస్ ను గెలిపించాలను కుంటన్నయ్. హైదరాబాద్ ను మజ్లిస్ కు అప్పగించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడుతున్నాయి. దేశ ద్రోహ పార్టీ మజ్లిస్ దేశభక్తి పార్టీ బీజేపీ. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దేశద్రోహ పార్టీకి, దేశభక్తి పార్టీకి మధ్య జరుగుతున్న ఎన్నికలివి. ఎవరి పక్షాన నిలబడి ఓటేస్తారో. హైదరాబాద్ కార్పొరేటర్లు, ఓటర్లు ఆలోచించాలి. సిద్ధాంతం కోసం పనిచేసే బీజేపీ అభ్యర్థి గౌతంరావు గెలుస్తారనే నమ్మకం ఉంది. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్నడో కుమ్మక్కైనయ్. చెన్నయ్ లో డీలిమిటేషన్ మీటింగ్ కు రెండు పార్టీలు కలిసే హాజరైనయ్. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రెండు పార్టీలు కలిసే ఓటేసినయ్.అన్నారు.

## వక్ఫ్ చట్టంలో మార్పులకు రాష్ట్రపతి ఆమోదం

అవి బిల్లును 'ముస్లిం వ్యతిరేకం'గాను, 'రాజ్యాంగ విరుద్ధం'గాను అభివర్ణించాయి. కాగా, ప్రభుత్వం ఈ 'చరిత్రాత్మక సంస్కరణ' మైనారిటీ సమాజానికి ప్రయోజనం కలిగిస్తుందని స్పష్టం చేసింది. రాజ్యసభలో బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది వోటు వేయగా, బిల్లుకు సభ ఆమోదం లభించింది. బిల్లును లోక్‌సభ గురువారం తెల్లవారు జామున ఆమోదించింది. సభలో బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది వోటు వేశారు. కాగా, రాజ్యసభ తన సమ్మతి తెలియజేయడంతో పార్లమెంట్ ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లును ఆమోదించింది. లోక్‌సభ ఇదివరకే బిల్లుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసిన తరువాత ముసల్మాన్ వక్ఫ్ చట్టం 1923 రద్దు అయింది.

## కంచె గచ్చిబౌలిని శాశ్వతంగా కాపాడుకుందాం


### పర్యావరణ కార్యకర్తలకు, వివిధ రంగాల ప్రముఖులు, మీడియాకు కెటిఆర్ ధన్యవాదాలు

హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విద్యార్థులకు, పర్యావరణ కార్యకర్తలకు, ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. భవిష్యత్ తరాల కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేసిన అద్భుతమైన పోరాటంపై కాంగ్రెస్ ప్రభుత్వం అపవాదులు వేస్తూ, బెదిరింపులకు దిగుతున్నదని ఆరోపించారు. హెచ్‌సియు విద్యార్థులు 400 ఎకరాల కంచె గచ్చిబౌలి అడవిని కాపాడేందుకు నిస్వార్థంగా, ఉదాత్తమైన లక్ష్యాలతో చేపట్టిన ఆందోళన అద్భుతం అని కొనియాడారు. పర్యావరణం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటానికి కలిసి వచ్చిన ప్రతి ఒక్కరికీ కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల పోరాటాన్ని తక్కువ చేసి చూపాలన్న కుట్రతో అనేక అపవాదులు వేస్తున్నదని పేర్కొన్నారు. నిస్వార్థమైన విద్యార్థి-ప్రజా పోరాటాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయని కెటిఆర్ తన లేఖలో పేర్కొన్నారు. వందల రకాల జంతుజాలం, వృక్షజాతులతో ఉన్న ప్రాంతాన్ని కాపాడేందుకు, భవిష్యత్ తరాలకు అందించేందుకు విద్యార్థులు చేసిన పోరాటానికి దేశంలోని వివిధ రంగాల ప్రముఖులు కలిసి రావడం దీనికి నిదర్శనం అని వ్యాఖ్యానించారు.400 ఎకరాల పర్యావరణం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 734 జాతుల మొక్కలు, 220 పక్షులు, 15 సరీసృపాలు, 10 క్షీరదాల ఆవాసం నాశనం కాకుండా ఆపుదాం అని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఒక రియల్ ఎస్టేట్ దళారి మాదిరి ఆర్థిక ప్రయోజనాల కోసం ఆలోచించకుండా, భవిష్యత్ ప్రయోజనాల కోసం కంచె గచ్చిబౌలి వేలాన్ని పూర్తిగా విరమించుకోవాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. పోరాటం ఇంకా మిగిలే ఉంది.. అందరూ కలిసి రావాలి

రాష్ట్ర ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ కోసం, బెదిరింపు ధోరణిలో ఏకో పార్క్ ఏర్పాటు అంటూ, ఫోర్త్ సిటీకి సెంట్రల్ యూనివర్సిటీ తరలింపు అంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మొదలుకొని ప్రతి కాంగ్రెస్ నాయకుడి వరకూ పక్కా కుట్రతో మాట్లాడుతున్న మాటలను కెటిఆర్ తన లేఖలో ఎండగట్టారు. 50 సంవత్సరాలకు పైగా సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణకు, విజ్ఞానానికి కేంద్రంగా నిలిచిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రాపగండ చేస్తున్న ఏకో పార్క్ కన్నా గొప్పగా పర్యావరణ సమతుల్యత కలిగిన క్యాంపస్‌గా నిలిచిందని అన్నారు. విద్యార్థుల పోరాటం ఫలించి సుప్రీంకోర్టు ప్రభుత్వం చేసిన పర్యావరణ హత్యను అడ్డుకున్నదని చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రల నేపథ్యంలో ఈ పోరాటం పూర్తిగా అయిపోలేదని తెలిపారు. 400 ఎకరాల పర్యావరణాన్ని కాపాడేందుకు పోరాటం ఇంకా మిగిలి ఉందని అన్నారు. ప్రభుత్వ కుట్రలను, బెదిరింపులను, దుష్ప్రచారాన్ని దాటుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ పోరాటానికి విద్యార్థులు, పర్యావరణవేత్తలు, ప్రముఖులు, తెలంగాణ ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు బిఆర్ఎస్ అండగా ఉంటుంది

ఇప్పటికే తమ పార్టీ తరఫున 400 ఎకరాల పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించామని కెటిఆర్ తెలిపారు. ప్రకృతికి విఘాతం కలగకుండా, యూనివర్సిటీకి ప్రమాదం రాకుండా బిఆర్ఎస్ పార్టీ విద్యార్థులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల స్ఫూర్తిని, విద్యార్థుల ఆందోళనను దృష్టిలో ఉంచుకొని, పర్యావరణం కోసం 400 ఎకరాలను వేలం వేసే ప్రయత్నాన్ని పూర్తిగా విరమించుకుంటున్నట్లు ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పటిదాకా ప్రస్తుత పోరాటాన్ని కొనసాగిద్దామని కెటిఆర్ పిలుపునిచ్చారు.



# కళ్యాణం కమనీయం




శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో సీతారాముల కళ్యాణం.. అంగరంగ వైభవంగా జరిగింది. ఇందుకోసం మిథిలా స్టేడియం అందంగా ముస్తాబైంది. సీతారాముల కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ దంపతులు, డిప్యూటీ సీఎం దంపతులు, మంత్రి పొంగులేటి దంపతులు, ముఖ్యనేతలు, స్థానిక నేతలు, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. భద్రాచలం చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులకు రామాలయంలో అర్చకులు, అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీతారామ చంద్ర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దంపతులు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అధికారులు మిథిలా స్టేడియం ప్రాంగణాన్ని 24 సెక్టార్లుగా విభజించారు. శ్రీరాముని కల్యాణోత్సవాన్ని అందరూ వీక్షించేందుకు అన్ని సెక్టార్లలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కాగా సోమవారం శ్రీరామ పట్టాభిషేకం జరగనుంది. వేసవి కావడంతో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. కాగా కల్యాణం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన బూరం శ్రీనివాసరావు అనే సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సన్న బియ్యం పంపిణీని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన నేపథ్యంలో సన్న బియ్యం అందుకున్న లబ్ధిదారుల ఇళ్లలో ప్రజాప్రతినిధులు భోజనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆదివారం భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామ కల్యాణానికి విచ్చేసిన సీఎం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేయనున్నట్లు

## డిలిమిటేషన్‌పై మా భయాలను పరిహరించాలి

మా గొంతు నొక్కాలని చూస్తోంది' అని ఆయన అన్నారు. నిష్పాక్షిక డిలిమిటేషన్‌పై సంయుక్త కార్యాచరణ కమిటీ (జెఎసి) సమావేశాన్ని మార్చి 22న నిర్వహించాం. దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తూ ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ నాయకులు సమావేశానికి హాజరయ్యారు' అని ఆయన తెలిపారు. జనాభా వృద్ధిని సమర్థంగా నియంత్రించిన ఇతర రాష్ట్రాలతో పాటు తమిళనాడును రానున్న డిలిమిటేషన్ ప్రక్రియలో శిక్షించడం జరగదని ప్రధాని మోడీ విస్పష్ట హామీ ఇవ్వాలని స్టాలిన్ సభలో ఉద్ఘాటించారు. డిలిమిటేషన్ ప్రక్రియను వ్యతిరేకించిన ఏకైక రాష్ట్రం తమిళనాడు అని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తగ్గించేందుకు కేంద్రం కుట్ర పన్నిందని ఆయన ఆరోపించారు. '(ప్రస్తుత రూపంలో డిలిమిటేషన్)ను సాగించినట్లయితే, రాష్ట్రానికి పార్లమెంట్‌లో భారీ నష్టం వాటిల్లుతుంది' అని స్టాలిన్ హెచ్చరించారు. స్టాలిన్ అంతకుముందు రూ. 143.69 కోట్ల పెట్టుబడితో జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో నిర్మించిన కొత్త 700 పడకల ఆరోగ్య సేవ కేంద్రాన్ని ప్రారంభించి, తనిఖీ చేశారు.

## పంజాబ్ రైతు నేత దల్లెవాల్ నిరశన దీక్ష విరమణ

### 130 రోజుల పాటు సాగిన నిరాహార దీక్ష
### తమ పోరు కొనసాగుతుందన్న రైతు నేత



చండీగఢ్ : పంటలకు కనీస మద్దతు ధరపై చట్టబద్ధమైన గ్యారంటీతో సహా ఉద్యమ రైతుల వివిధ కోర్కెలకు మద్దతుగా నిరుడు నవంబర్ 26న ప్రారంభించిన తన నిరశన దీక్షను పంజాబ్ రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లెవాల్ ఆదివారం విరమించారు. తన ఆమరణ నిరాహార దీక్షను విరమించవలసిందిగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టూ విజ్ఞప్తి చేసిన మరునాడు దల్లెవాల్ ఈ ప్రకటన చేశారు. పంజాబ్ ఫతేగఢ్ సాహిబ్ జిల్లా సిర్‌హింద్‌లో ధాన్యం మార్కెట్‌లో నిర్వహించిన 'కిసాన్ మహాపంచాయత్'లో తన నిరవధిక నిరశన దీక్ష విరమిస్తున్నట్లుగా దల్లెవాల్ ప్రకటించారు. పంటలకు ఎంఎస్‌పికి చట్టబద్ధమైన గ్యారంటీ. తదితర డిమాండ్లపై తమ పోరు కొనసాగుతుందని అదే సమయంలో ఆయన స్పష్టం చేశారు. దల్లెవాల్ ఒక స్ట్రెచర్‌పై నుంచి సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, 'ఆమరణ నిరాహార దీక్ష విరమించవలసిందని మీరంతా కోరారు. నాకుప్రజలు దైవ స్వరూపులు. నేనే ప్రకటించిన రూపంలో ఉద్యమాన్ని మీరు పరికించిన తీరుకు నేను మీకు రుణపడ్డాను. మీ మనోభావాలను మన్నిస్తాను' అని చెప్పారు. 'మోర్చా (ఆందోళన) కొనసాగుతుంది. ఇప్పటికీ నిరవధిక నిరశన విరమించాలని నేను కోరుకోవడం లేదు. కానీ (దీక్ష విరమించాలని) మీరు నన్ను పదే పదే కోరారు. నేను దానిని మన్నిస్తాను' అని దల్లెవాల్ చెప్పారు. ఆందోళనకు మద్దతు సూచనగా చేతులు ఎత్తవలసిందిగా సభికులను దల్లెవాల్ కోరారు. నిరాహార దీక్ష విరమించవలసిందిగా దల్లెవాల్‌కు కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్ శనివారం విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి బిట్టూ కూడా దల్లెవాల్‌కు అదే విధమైన విజ్ఞప్తిని శనివారం చేశారు.

## జల వివాదాలపై గట్టి వాదనలు ఉండాలి

### ఈనెల 15,16 తేదీలలో ట్రిబ్యునల్ ఎదుట వాదనలు
### లీగల్ టీమ్‌కు ప్రభుత్వ సంపూర్ణ సహకారం
### అధికారులు, న్యాయవాదులు సమన్వయంతో ఉండాలి
### సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




హైదరాబాద్: కృష్ణా నదీజలాశయాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై కృష్ణా ట్రిబ్యునల్ 2 ముందు తెలంగాణ తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాదుల బృందానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఆదివారం నీటిపారుదల శాఖ కార్యాలయం జలసౌధలో నీటిపారుదల ఉన్నతాధికారులు, న్యాయవాదుల ప్రతినిధుల బృందంతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్షసమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల సలహాదారు ఆదిత్యానాథ్‌దాస్, ఇంజినీరింగ్ ఇన్ చీఫ్(ఇఎన్‌సి)లు అనిల్ కుమార్, విజయ భాస్కర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది సి.ఎస్.వైద్య నాథన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అంతర్ రాష్ట్ర జల వివాదాలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతుందని తెలిపారు. ఈనెల 15,16న వాదనలు ఇప్పటి వరకు కృష్ణా ట్రిబ్యునల్ -2 ఎదుట జరిగిన వాదనలను వారు సమీక్షించారు. తిరిగి ఈనెల ఏప్రిల్ 15,16 తేదీలలో ట్రిబ్యునల్ ముందు జరిగే వాదనల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రస్తావించాల్సిన అంశాలను సమగ్రంగా చర్చించి ముందస్తు వ్యూహాన్ని ఈ సమావేశంలో రూపొందించుకున్నారు. నీటివాటాలపై గట్టిపట్టు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తదుపరి కృష్ణా నదీ జలాల విషయంలో ఏపి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, న్యాయబద్ధంగా తెలంగాణకు రావాల్సిన నీటి కేటాయింపులు వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అధికారులు, న్యాయవాదులకు వివరించారు. రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన కృష్ణా నదీ నీటి కేటాయింపులపై బలమైన వాదనలు వినిపించేందుకు మంత్రి వారికి మార్గనిర్దేశం చేశారు. రైతుకు నీటి కొరత రానీయం దశాబ్దాలుగా సాగునీటి మీద ఆధారపడి సేద్యం చేస్తున్న రైతాంగం నీటి కొరతతో ఆందోళనకు గురవుతున్నారని, ఏపి సర్కారు చేస్తున్న అన్యాయలను ఎదురించి న్యాయమైన హక్కులను కాపాడుకునేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. సమన్వయంతో సాగాలి కృష్ణా ట్రిబ్యునల్ -2 ముందు వాదనల సమయంలో కావాల్సిన సమగ్ర సమాచారాన్ని అందించడంతో పాటు ఢిల్లీలో ఉన్న లీగల్ టీమ్‌తో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయ్యాలని మంత్రి ఉత్తమ్ నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ న్యాయ స్థానాలలో పెండింగ్ లో ఉన్న కేసులు, అప్పీల్స్ వాటి ప్రస్తుత పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

## ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికన్ల నిరసన

అధ్యక్షుడు ట్రంప్ అమలు చేస్తున్న వలస వ్యతిరేక విధానాలు, టారిఫ్‌లు విధింపు, మస్క్ చేతిలో ప్రభుత్వ డేటా గోప్యతపై ప్రజలు తమ ఆందోళనలను కేంద్రీకరించారు.

## దేశంలో మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే బ్రిడ్జ్ ప్రారంభం

2020లో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ పనులు చేపట్టి నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేసింది. భారీ పడవలు వెళ్లడానికి వంతెనలోని 73 మీటర్ల పొడవు, 660 టన్నుల బరువున్న భాగం 17 మీటర్ల ఎత్తుకు లేవటం దీని ప్రత్యేకత. దీంతో పాటు రామేశ్వరం-తాంబారం మధ్య నడిచే ప్రత్యేక రైలును, అదే విధంగా వంతెన కిందగా వెళ్లే కోస్ట్ గార్డ్ నౌకను మోడీ ప్రారంభించారు. కొత్త రైలులో విద్యార్థులు, ఇతర ప్రయాణికులు సందడి చేశారు.

## ఏ పార్టీకి మద్దతు తెలపం : పొన్నం

హైదరాబాద్: బిజెపి, బిఆర్ఎస్ ఒప్పందంలో భాగంగానే.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి పోటీలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలపై పొన్నం స్పందించారు. బిజెపి, బిఆర్ ఎస్ ఒప్పందంలో భాగంగానే బిజెపి నామినేషన్ జరిగిందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము తటస్థమని ఏ పార్టీకి మద్దతు తెలపమని చెప్పారు. తమకు బలం లేకపోవడం వల్లే బరిలో నిలవలేదని పొన్నం తెలియజేశారు. బలం లేని చోట బిజెపి ఎలా గెలుస్తుందని ప్రశ్నించారు. గ్రాడ్యుయేషన్ ఎన్నికల్లోనూ బిజెపికి బిఆర్ఎస్ సహకరించిందని మండిపడ్డారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బిఆర్ఎస్ నేతకు బినామీగా వ్యవహరిస్తున్నారని మంత్రి పొన్నం విమర్శించారు.

## ట్రంప్ 10 శాతం కొత్త టారిఫ్ వసూలు ప్రారంభం

### ప్రపంచ వర్తక నిబంధనల ఛేదన

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా అనేక దేశాల నుంచి దిగుమతులపై విధించిన పది శాతం టారిఫ్ వసూలును యుఎస్ కస్టమ్స్ ఏజెంట్లు శనివారం ప్రారంభించారు. 57 పెద్ద వాణిజ్య భాగస్వాముల నుంచి సరకులపై అధిక సుంకాల విధింపు వచ్చే వారం మొదలు కానున్నది. యుఎస్ దిగుమతిదారులు చెల్లించిన తొలి పది శాతం 'బేస్‌లైన్' టారిఫ్ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత అంటే 12.01 (ఇటి స్థానిక కాలమానం) గంటలకు యుఎస్ రేవులు, విమానాశ్రయాలు, కస్టమ్స్ గిడ్డంగులలో అమలులోకి వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం పరస్పరం అంగీకరించిన టారిఫ్ రేట్ల వ్యవస్థను ట్రంప్ పూర్తిగా తిరస్కరించినట్లు అయింది. 'మా జీవిత కాలంలో ఇదే ఏకైక అతిపెద్ద వర్తక కార్యాచరణ' అని హొగన్ లోవెల్స్‌లో వర్తక న్యాయవాది, ట్రంప్ మొదటి విడతలో వైట్ హౌస్ మాజీ వాణిజ్య సలహాదారు కెల్లీ ఆన్ షా తెలిపారు. దేశాలు తక్కువ రేట్ల గురించి సంప్రదింపులన కోరుతున్నందున టారిఫ్‌లు క్రమంగా ఒక రూపు సంతరించుకుంటాయని తాను ఊహిస్తున్నట్లు షా గురువారం ఒక బ్రూకింగ్స్ సంస్థ కార్యక్రమంలో చెప్పారు. 'భూమిపై ప్రతి దేశంతో మేము వాణిజ్యం సాగించే తీరులో ఇది ప్రధాన మార్పు' అని ఆమె అన్నారు. కాగా, ట్రంప్ బుధవారం చేసిన టారిఫ్‌ల ప్రకటన ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపివేసింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి ఎస్ అండ్ పి సూచి సంస్థలకు 5 ట్రిలియన్ డాలర్ల మేరకు విలువను తుడిచిపెట్టింది. అది రెండు రోజుల్లో రికార్డు స్థాయిలో పతనం. మాంద్యం భయాలు రేగుతుండగా, చమురు, సరకుల ధరల పతనమయ్యాయి, మదుపరులు సురక్షితమైన ప్రభుత్వ బాండ్ల వైపు మరలారు. నిరుడు యుఎస్‌తో సరకుల వాణిజ్య లోటులు ఉన్నప్పటికీ ఆస్ట్రేలియా, బ్రిటన్, బ్రెజిల్, కొలంబియా, అర్జెంటీనా, సౌదీ అరేబియా ముందుగా పది శాతం టారిఫ్ దెబ్బ తిన్న దేశాలు. అనేక దేశాల విధానాలు న్యాయమైనవి అయినట్లయితే యుఎస్‌తో భారీ లోటు ఎదుర్కొని ఉండేవని వైట్ హౌస్ అధికారులు చెప్పారు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత 12.01 గంటలకు (ఇటి) యుఎస్‌కులోడ్ చేసిన లేదా రవాణాలో ఉన్న సరకుల కోసం 51 రోజుల గ్రేస్ వ్యవధిని యుఎస్ కస్టమ్స్, సరిహద్దు రక్షణ విభాగం బులెటిన్ సూచించింది. ఆ సరకులు పది శాతం సుంకాన్ని తప్పించుకోవడానికి మే 27 నాటికి యుఎస్ చేరుకోవలసి ఉంటుంది. 11 శాతం నుంచి 50 శాతానికి ట్రంప్ అధిక 'ప్రతీకార' టారిఫ్ రేట్లు బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత 12.01 గంటలకు (ఇటి) అమలులోకి రావలసి ఉంది. యూరోపియన్ యూనియన్ దిగుమతులు 20 శాతం టారిఫ్‌ను, చైనీస్ సరకులు 34 శాతం టారిఫ్‌ను ఎదుర్కొంటాయి. చైనాపై ట్రంప్ విధించిన మొత్తం కొత్త సుంకాలు 54 శాతానికి చేరుకుంటాయి. ట్రంప్ టారిఫ్‌లను తిరస్కరిస్తూ మార్కెట్ స్పందించిందని చైనా శనివారం వెల్లడించింది. కొన్ని రేర్ ఎర్త్ ఖనిజాలపై ఎగుమతి ఆంక్షలను, అన్ని యుఎస్ సరకులపై 34 శాతం అదనపు సుంకాలను చైనా ప్రకటించింది.

# ఊపందుకోనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

## ఈనెలాఖరులోగా లబ్ధిదారులను ప్రకటించనున్న ప్రభుత్వం



హైదరాబాద్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఊపందుకోనుంది. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్లకు పెద్దపీట వేసి ఈ పథకానికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇచ్చింది. కాంగ్రెస్ పేర్కొన్న ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్లను ఎక్కువగా నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో కొత్త ఇళ్లను నిర్మించడమే కాకుండా గత ప్రభుత్వ హయాంలో వివిధ దశల్లో నిలిచిపోయిన రెండు పడక గదుల ఇళ్లను కూడా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.12,571 కోట్లను కేటాయించింది. లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో శుభవార్త చెప్పనుంది. మొదటి విడతలో ఇళ్లు మంజూరు కానీ వారి కోసం మరో జాబితా తయారు చేస్తోంది. రెండో విడతలో 30 వేల మందికి ఇళ్లు ఇవ్వనుండగా వారి జాబితాను ఈ నెలాఖరులోగా విడుదల చేయనుంది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి ఇందిరమ్మ ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12,571 కోట్లను కేటాయించింది. గత బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.8,424.06 కోట్లను కేటాయించగా ఈసారి ఆ నిధులను రూ.4,147 కోట్లకు పెంచింది. ఏటా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో గరిష్ఠంగా 4.50 లక్షల ఇళ్లను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున కేటాయిస్తోంది. కానీ ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం చూస్తే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏటా రూ.22,500 కోట్లు అవసరమవుతాయి. ఇందులో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను కేటాయించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేల రూపాయలను అందిస్తోంది. కేంద్ర వాటాగా రాష్ట్రానికి మరో రూ.1000 కోట్లు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటివరకు రాష్ట్రంలో 80.54 లక్షల దరఖాస్తులు రాగా అధికారులు వాటిని ఇందిరమ్మ ఇళ్ల యాప్‌తో సర్వే జరిపి ఎల్- 1,2,3 విభాగాలుగా వర్గీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై దృష్టి : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ప్రతి నియోజక వర్గానికి 3500 ఇళ్ల చొప్పున, ప్రతి గ్రామంలో లబ్ధిదారుల ఎంపిక ఉండేలా జాబితాను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మొదటి విడతలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి 72 వేల లబ్ధిదారులతో జాబితాను రూపొందించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ గ్రామాన్ని వదిలేసి మిగతా గ్రామాల నుంచి ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాయి. పలు నియోజకవర్గాల్లో సంబంధిత జాబితాలు ఎమ్మెల్యేల చేతికి వెళ్లాయి. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల సూచనలను కూడా అధికారులు పరిగణనలోకి తీసుకుంటూ, మొత్తంగా రెండు విడతల్లో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందితో జాబితా రూపొదించారు. దాన్ని ఈ నెలాఖరులోగా లబ్ధిదారులను ప్రకటించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జూన్ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో అప్పటిలోగా కనీసం పునాది, పిల్లర్ల వరకు నిర్మాణాలు పూర్తి చేయనున్నారు. అలాగే లబ్ధిదారుల ఖాతాలో సంబంధిత సొమ్ము జమచేసేందుకు సర్కారు సిద్ధమవుతోంది. అందుకు అనుగుణంగా అధికారులు కూడా ఆ ప్రక్రియను వేగవంతం చేశారు. మొదటి విడతలో మండలానికి ఒక గ్రామం చొప్పున 72 వేల మంది లబ్ధిదారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో చాలా మంది అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో 72 వేల మందికి గాను 42 వేల మందికే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మంజూరు పత్రాలను ప్రభుత్వం జారీ చేసినట్లు సమాచారం. మిగతా 30 వేల మంది లబ్ధిదారులపై మళ్లీ విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రెండో జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో జల్లెడ పట్టాలని జిల్లా అధికారులకు గృహ నిర్మాణశాఖ నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఇటీవల జరిగిన సమావేశంలోనూ ఈ మేరకు గృహ నిర్మాణశాఖ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి మార్గదర్శకం చేసి ఆ విధంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే : నిరుపేదలకు ఆవాస సదుపాయం కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ' పేరిట ఇళ్లు నిర్మించనున్న విషయం తెలిసిందే. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది. పథకం లబ్ధిదారులు అందుబాటులో ఉన్న స్థలంలోనే రూ.5 లక్షలతో అందంగా ఎలా ఇంటిని కట్టుకోవాలో అధికారులు సుదీర్ఘ కసరత్తు చేశారు. ఇందుకు సంబంధించి 2 నమూనాలు రూపొందించారు. ఆయా నమూనాల్లో ఇళ్లను నిర్మించుకునేందుకు వీలుగా లబ్ధిదారులకు అవగాహన కోసం అక్కడక్కడ ఓ మోడల్ గృహం నిర్మించారు. ఈ పద్ధతుల్లో ఇంటి పనులు చేపడితే రూ.5 లక్షలతోనే పూర్తి చేయొచ్చునని అధికారులు చెబుతున్నారు. మోడల్ నిర్మాణాల కోసం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా స్థలాలను ఇప్పటికే ఎంపిక చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో వీటిని నిర్మించాల్సి ఉండగా స్థలాభావం వల్ల కొన్ని చోట్ల తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందితో జాబితా : జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో ఈ ఎన్నికల లోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. మొదటి విడతలో ఎంపిక చేసిన గ్రామాలను కాకుండా మిగతా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. మరికొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు జాబితాలు అందాయి. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల సలహాలు కూడా తీసుకుంటున్నారు. మొత్తం రెండు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందితో జాబితా తయారు చేస్తున్నారు. తుది జాబితాను ఈ నెలాఖరులోగా ప్రకటించనున్నట్లు తెలిసింది.

# మేము సన్న బియ్యం ఇచ్చాము

## దేశం మొత్తం బిజెపి ఇవ్వాలి: మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ : 42 శాతం బిసి రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్లో చేర్చేలా చట్టబద్ధత కోసం దమ్ముంటే ప్రధానిని ఒప్పించాలని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాలు చేశారు. కేంద్ర మంత్రి అన్న సంగతి మర్చిపోయి దిగజారి మాట్లాడుతున్నాడని ఆయన బండి సంజయ్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ పెద్దలకు భయపడే తెలంగాణ బిజెపి నేతలు బిసిల ధర్నాకు మొహం చాటేశారని విమర్శించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ ఢిల్లీ పెద్దలకు గులాంగిరి చేశాడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నోటికొచ్చింది మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అని, ఏదైనా సమిష్టి నిర్ణయాలు ఉంటాయని ఆయనన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, ఎంఎల్‌సి ఎన్నికల వలె స్థానిక సంస్థలు ఎంఎల్‌సి ఎన్నికల్లోనూ బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేక రహస్య మిత్రుడు బిఆర్‌ఎస్‌తో చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆయన బిజెపిపై ధ్వజమెత్తారు. బండి సంజయ్‌లో రోజురోజుకు అభద్రత భావం పెరిగిపోతుందని, సొంతపార్టీ నేతలే బండి సంజయ్ వైఖరి పై గుర్రుగా ఉన్నారని దుయ్యబట్టారు. అధ్యక్ష పదవి రాదని తెలిసి బండి సంజయ్ ఆగమాగం అయితుండని విమర్శించారు. తాను కేంద్ర మంత్రి అన్న సంగతి మర్చిపోయి దిగజారి మాట్లాడుతున్నాడని, బిజెపిలో గుర్తింపు కోసం బండి సంజయ్ ఆరాటమని దుయ్యబట్టారు. ఇకనైనా బాధ్యత గల కేంద్రమంత్రిగా వ్యవహరించాలని హితవు పలికారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి బండి సంజయ్ కి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సుదీర్ఘ కాలంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి నియామకం చేసుకోలేని బిజెపికి కాంగ్రెస్ హై కమాండ్ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి పట్టు సాధించ బట్టే బిసి రిజర్వేషన్లు, ఎస్‌సి వర్గీకరణ బిల్లులకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. హెచ్‌సియు అంశం ఉన్నత న్యాయ స్థాన పరిదిలో ఉందని. ప్రభుత్వం కమిటీ వేసిందని, రాజకీయ అవసరాల కోసం బండి సంజయ్ మాట్లాడడం సమంజసం కాదని పిసిసి చీఫ్ అన్నారు. మైనార్టీ హక్కుల కోసం నిలబడి కాంగ్రెస్ వక్ఫ్ బోర్డు బిల్లు పై నిర్ణయం తీసుకుందని, కార్పొరేట్ సంస్థలను నయనా, భయానా బెదిరించి నిధులు రాబట్టుకున్న బిజెపి నంబర్ వన్ గా నిలిచిందని విమర్శించారు. సన్న బియ్యం బిజెపి ఇస్తుంటే దేశం మొత్తం ఇవ్వచ్చు కదా, సన్న బియ్యంతో తెలంగాణలో నిరుపేదలకు అసలైన పండుగను కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందన్నారు. దేశ చరిత్రలో నిలిచిపోయే కుల గణన, బిసి బిల్లు, ఎస్‌సి వర్గీకరణ, సన్న బియ్యంను కాంగ్రెస్ హయంలో అమలు అయ్యాయని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేవారు.



# ఇల్లందకుంట ఆలయాభివృద్ధికి కృషి చేస్తా..

**పట్టు వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ప్రణవ్.**

**- అన్నదాన కార్యక్రమ నిర్వాహకులను అభినందించిన ప్రణవ్.**

**- కళ్యాణానికి వచ్చిన భక్తులకు మంత్రి పొన్నం సౌజన్యంతో ఉచిత మజ్జిక పంపిణీ..**





ఇల్లందకుంట ఏప్రిల్ 6 (ది క్రైమ్ న్యూస్) : అపర భద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలో పాల్గొన్నారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికారు.అనంతరం స్వామి వారిని దర్శించుకొని,కళ్యాణ మండపంలో పట్టు వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.భక్తుల రామనామస్మరణల మధ్య అభిజిత్ లగ్నంలో సీతమ్మ వారి మెడలో రామయ్య తాలిబొట్టు కట్టారు.హుజురాబాద్ ప్రజలు సుఖ సంతోషాలతో,అష్టైశ్వర్యాలు చేకూరాలని భగవంతున్ని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఇళ్ళందకుంట ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని,త్వరలోనే ఆలయ కమిటీతో చర్చించి తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ,నిధులు కేటాయిస్తామని తెలిపారు. భక్తులకు ఉచిత మజ్జిక పంపిణీ.. కళ్యాణానికి వచ్చే భక్తులకు రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిక పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ప్రణవ్.వేసవి దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమం గొప్ప కార్యక్రమం.. కళ్యాణానికి వచ్చే భక్తులకు ఉచితంగా అన్నదానం చేయడం పట్ల జమ్మికుంట రైస్ మిల్లర్ల,కాటన్ ఇండస్ట్రీస్,పారబాయిల్డ్ రైస్ మిల్లర్లను ఇతర దాతలను అభినందించారు ప్రణవ్.ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని కోరారు.అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు వడ్డించారు.

# కొత్త వక్ఫ్ బిల్లు సమస్యలు తెస్తుందా?

చట్టసభలు చట్టాలను చేయవచ్చు, చేయకపోవచ్చు.. కాలానుగుణంగా అవసరాల బట్టి చట్టాలను సవరించవచ్చు. అయితే ఆ పని చేసేటప్పుడు చట్టసభ సభ్యులు తులనాత్మక విధానాన్ని అనుసరించక తప్పదు. విభజన ఎజెండాకు బదులు ఎదురయ్యే అభ్యంతరాలను భవిష్య దృక్పథంతో పరిష్కరించే సూత్రం అవలంబించాలి. శాసనసభ యాధృచ్ఛికంగా ఒక సమయంలో ఒకవైపు మరోసందర్భంలో మరోవైపు లోలకాన్ని కదిలించలేదు. అటువంటి విధానం ముఖ్యంగా అనేక వైవిధ్యాలు కలిగిన భారత్ వంటి దేశంలో సమాజానికి మంచిది కాదు. అయితే దురదృష్టవశాత్తు ఇలాంటి పరిణామాలే దేశంలో తరచుగా జరుగుతుంటాయి. దేశవ్యాప్తంగా విస్తృత చర్చతోపాటు అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలకు దారితీసిన వక్ఫ్ (సవరణ) బిల్లు 2025 ఎట్టకేలకు పార్లమెంట్ ఆమోదం పొందింది. రాజ్యసభలో గురువారం అర్ధరాత్రి దాటే వరకు విస్తృత చర్చ జరిగింది.బిల్లుకు అనుకూలంగా 129 మంది. వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటేశారు. ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. అయితే ఈ కొత్త బిల్లు కొత్తగా సమస్యలను సృష్టిస్తుందా లేక పరిష్కరిస్తుందా? అన్నదే చర్చ. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ అనగా, ఇస్లాం మతం ప్రకారం మతపరమైన లేదా దాతృత్వ కార్యాల కోసం శాశ్వతంగా అంకితమిచ్చిన ఆస్తుల నిర్వహణ, వాటిని దుర్వినియోగం కాకుండా పరిరక్షించడం, ఆయా ఆస్తులను మతపరమైన లేదా దాతృత్వ ప్రయోజనాలకు వినియోగించడం తదితర అజమాయిషీకి సంబంధించి మొట్టమొదటి సమగ్రమైన చట్టం 1995లో తీసుకురావడమైంది. ఇది పూర్తిగా శాశ్వతంగా మతపరమైన ప్రయోజనాల కోసమే ఉద్దేశించబడింది. ఈ ఆస్తుల నిర్వహణ విషయంలో లౌకిక రాజ్యం పాత్ర పరిమితం. అయితే ఈ చట్టం ఇస్లాం మత విశ్వాసాలను మించి పోయి పాక్షిక న్యాయ అధికారాల అంటే ఒక విధంగా న్యాయరహిత వక్ఫ్‌బోర్డులుగా మార్చివేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ముస్లింలు మాత్రమే వక్ఫ్‌బోర్డు పాలక వర్గాల్లో సభ్యులుగా ఉంటారు. ఈ చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం ఎక్కడైనా ఏదైనా ఆస్తి వక్ఫ్ ఆస్తి అని నమ్మకం కలిగితే ఆ సమాచారాన్ని సేకరించే అధికారం వక్ఫ్‌బోర్డులకు ఉంటుంది.ఆపై నిర్ణయించే అధికారం కూడా ఉంటుంది. అంతేకాదు ఈ నిర్ణయాలను అమలు చేయాలని సంబంధిత జిల్లా మెజిస్ట్రేట్‌లను ఆదేశించే అధికారం కూడా ఈ బోర్డులకు ఉంటుంది. ఈ అధికారాలు బోర్డులు ఫిర్యాదుదారులుగా, దర్యాప్తు సంస్థలుగా, న్యాయ వ్యవస్థలుగా తయారు చేసింది. ఇది భారతీయ న్యాయ వ్యవస్థ నిబంధనలకు, ఆచరణలకు విరుద్ధంగా ఉంటోంది. ఈ ప్రత్యేక అపరిమిత అధికారాలు దేశంలో అధిక శాతం మంది ప్రజలకు, ముస్లింలకు, ముస్లిమేతరులకు కూడా ఆందోళన కలిగిస్తోంది. తప్పనిసరిగా దీన్ని మార్చవలసిన అవసరం ఉంది. ఇప్పుడు కొత్తగా వచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు పాత చట్టంలోని సెక్షన్ 40ను పూర్తిగా రద్దు చేసింది. ఇప్పుడు ఏదైనా ఆస్తి వక్ఫ్‌ఆస్తి అనుకుంటే ప్రభుత్వ ఉన్నతాధికారి ముందు నిరూపించవలసి వస్తుంది. ఈ వెసులుబాటుకు వ్యతిరేకంగా ఎవరైనా తమ వ్యాజ్యాలను 90 రోజుల్లో హైకోర్టుకు దాఖలు చేయవలసి ఉంటుంది. ఇది స్వాగతించదగిన పరిణామం. ఈ పొరపాట్లను సవరించడం, అనేక సమస్యలను పరిష్కరించడం అనే ముసుగులో ఎన్‌డిఎ ప్రభుత్వం ఇంతవరకు పరిష్కరించిన చట్టపరమైన నిబంధనలను, రాజ్యాంగాన్ని విస్మరించి వక్ఫ్ సవరణ బిల్లు 2025ను తెరపైకి తీసుకు వచ్చింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డుల వ్యవస్థల విషయంలో అపరిష్కృత విధానాలు కొత్త బిల్లులో చోటుచేసుకున్నాయి. ఇదివరకు చట్టంలో ఈ బోర్డుల్లో ముస్లింలే సభ్యులుగా ఉండేవారు. ఇస్లామిక్ మత విశ్వాసం ప్రకారం అంకితమైన ఆస్తులను పర్యవేక్షించేవారు. ఇప్పుడు కొత్త బిల్లు ప్రకారం ఈ బోర్డుల్లో ముస్లిమేతరులకు కూడా విశేషమైన మనవిపై సభ్యులుగా చోటు కల్పించే వీలుంది. దీనివల్ల బోర్డులు మరింత సమర్థవంతంగా పనిచేస్తాయని చెబుతున్నారు. అలాగే దీని స్వరూపాన్ని పరిశీలిస్తే ఈ సవరణ బిల్లు రాజ్యాంగం లోని ఆర్టికల్ 26(సి), (డి)ని ఉల్లంఘించింది. ఫలితంగా ప్రతి మతాధిపత్య సంస్థ చర, స్థిర ఆస్తులను తమ స్వంతమని స్వాధీనం చేసుకోవచ్చు. చట్టప్రకారం వాటిని అజమాయిషీ చేయవచ్చు. దీనివల్ల దేశంలో మతపరమైన మైనారిటీని నిర్వహించడంలో అవాంఛనీయ ప్రమేయానికి వీలవుతుంది. వక్ఫ్ ఆస్తిని దానం చేయడంలో హక్కు పరిమితమవుతుంది. ఐదేళ్ల పాటు ఇస్లాం ఆచరించే వ్యక్తులు తమ ఆస్తిని వక్ఫ్‌కు దానం చేయాలనుకుంటే హక్కులు పరిమితం అవుతాయి. దీనివల్ల ట్రిబ్యునల్‌కు బదులు వక్ఫ్‌ఆస్తి స్వభావాన్ని నిర్ణయించే హక్కు ప్రభుత్వ అధికారికి దక్కుతుంది. పౌర చట్టం ప్రకారం ఈ వివాదాల పరిష్కారం కావాలే తప్ప అధికార యంత్రాంగ చట్టం ప్రకారం సాధ్యం కాదు. ముస్లిం ప్రార్థనా స్థలాలపై హిందువుల వివాదాలు ఇప్పటికే ముసురుకుంటున్నాయి. కొత్త బిల్లు వల్ల ముస్లిం వక్ఫ్ ఆస్తులపై కూడా వివాదాలు పెరిగే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రార్థనా స్థలాల చట్టం 1991 ని కూడా ధిక్కరించి వ్యాజ్యాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వక్ఫ్ సవరణ బిల్లు అమలులోకి వస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో అన్న న్యాయపరమైన భయం ముస్లింల్లో వెంటాడుతోంది. ఇంతవరకు వక్ఫ్ పరిధిలో ఉన్న ఆస్తులపై హక్కులు కొత్త బిల్లువల్ల హరించబడతాయని

# సమిష్టి డిమాండ్ తగ్గిపోతోంది

సాధారణంగా సమష్టి డిమాండ్ (మొత్తం డిమాండ్) అంటే ఒక నిర్దిష్ట ధర వద్ద, ఒక నిర్దిష్ట కాలంలో వస్తువులు, సేవలకు మార్పిడి చేయబడిన మొత్తం ద్రవ్యంగా వ్యక్తీకరించబడుతుంది. మొత్తం డిమాండ్‌ను సాధారణంగా వినియోగం, పెట్టుబడి, ప్రభుత్వ వ్యయం, నికర ఎగుమతులు వంటి నాలుగు వనరుల మొత్తంగా వర్ణిస్తారు. ప్రపంచ సమష్టి డిమాండ్ తగ్గడానికి దోహదపడే ప్రధాన అంశాలుగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయం వంటి వి ఉన్నాయి. ప్రపంచ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, జీవన వ్యయ సంక్షోభం, ఇంధన ధరలు, వడ్డీ రేటు పెంపుదల, ప్రపంచ పరపతి కఠినత్వం, కొవిడ్ మహమ్మారి పరిణామాలు, లాజిస్టిక్స్ సవాళ్లు, ముడి పదార్థాల కొరత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, వాణిజ్య అనిశ్చితి మొదలైనవి మొత్తం డిమాండ్ తగ్గడానికి కారణమవుతున్నాయి. సమష్టి డిమాండ్ తగ్గడం వల్ల వాస్తవ స్థూల దేశీయోత్పత్తి, ఆర్థిక ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ప్రకారం 2025, 2026 సంవత్సరాల్లో ప్రపంచ వృద్ధి 3.3 శాతంగా అంచనా వేయబడింది, ఇది చారిత్రక (2000-19) సగటు 3.7 శాతం కంటే తక్కువ. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో మందగమనం ప్రపంచ డిమాండ్ బలహీనపడటానికి దోహదం చేస్తుంది. అమెరికా, యూరోపియన్ దేశాల నుండి చైనా, భారతదేశం, బ్రెజిల్ వరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ద్రవ్యోల్బణం, వడ్డీరేటు పెంపుదల, ప్రపంచ సరఫరా గొలుసు అంతరాయాలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మిశ్రమం కారణంగా తగ్గుతున్న సమష్టి డిమాండ్ సమస్యను ఎదుర్కొంటున్నాయి.అనేక ఇతర ఆర్థిక వ్యవస్థల మాదిరిగానే భారతదేశం కూడా తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా గణనీయంగా ప్రభావితమవుతుంది. భారతదేశంలోమొత్తం డిమాండ్‌లో తగ్గుదల ప్రధానంగా తగ్గిన వినియోగం, తగ్గిన పెట్టుబడి, తగ్గుతున్న ప్రభుత్వ వ్యయం, బలహీనమైన నికర ఎగుమతుల నుండి వస్తుంది. ఏదేశమైనా దేశీయ వినియోగంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఇది దాని స్థూల దేశీయోత్పత్తిలో గణనీయమైన భాగాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల, డిమాండ్‌లో ఏదైనా మందగమనం ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలో భిన్న పరిణామాలను కలిగిస్తుంది. ఆర్థిక మాంద్యం, పేదరికం, అసమానత, రాజకీయ అస్థిరత, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంపై ప్రభావం, నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎలు) వంటి విస్తృత ఆర్థిక పరిణామాల కారణంగా భారతదేశం తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా తీవ్రంగా ప్రభావితమవుతుంది. ఈ ప్రభావాలు ఉపాధి నుండి వ్యాపార పెట్టుబడి, ఎగుమతులు, ఆర్థిక ఆరోగ్యం వరకు వివిధ రంగాలలో అలలు రేపుతాయి. భారతదేశంలో మొత్తం డిమాండ్‌ను ప్రభావితం చేసే కీలక అంశాలు చూసినపుడు ద్రవ్యోల్బణ ఒత్తిడి ఫిబ్రవరి 2025లో 3.6%. ఇది కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది, వినియోగాన్ని ప్రభావితం చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు ప్రతిస్పందనగా వడ్డీ రేట్లను పెంచింది, ఇది ప్రైవేట్ పెట్టుబడి, వినియోగాన్ని తగ్గించవచ్చు, ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో అమెరికా, చైనా మందగమనం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కోవిడ్ మహమ్మారి వంటి ప్రపంచ అంశాలు భారతదేశ ఎగుమతులు, పెట్టుబడి రాకపోకలు ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. ప్రభుత్వ సంస్కరణలు వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి), మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు దేశీయ తయారీ, పెట్టుబడి ఎగుమతులను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే, వాటి పూర్తి ప్రభావాలు కార్యరూపం దాల్చడానికి సమయం పట్టవచ్చు. డిసెంబర్ 2024లో, భారత దేశంలో ప్రైవేట్ వినియోగం స్థూల దేశీయోత్పత్తిలో 64.8% వాటాను కలిగి ఉంది. కొవిడ్ మహమ్మారి తర్వాత గ్రామీణ భారతదేశం గణనీయమైన కోలుకుంది. అయినప్పటికీ పట్టణ ప్రాంతాలు ఇప్పటికీ మొత్తం వినియోగంలో ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. అయితే, వ్యవసాయ ఇబ్బందులు, ఆదాయ అసమానత ఇతర నిర్మాణాత్మక సవాళ్ల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ వృద్ధి కొద్దిగా నెమ్మదిగా ఉంది. భారతదేశ రిటైల్ రంగం దేశ స్థూల దేశీయోత్పత్తికి దాదాపు 10% దోహదపడుతుంది. వచ్చే దశాబ్దంలో దాదాపు 9- 10% కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్) వద్ద వృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది, 2032 నాటికి దాదాపు %వి%2 ట్రిలియన్ల విలువను చేరుకుంటుంది. భారతదేశ వినియోగదారుల విశ్వాసం హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అధిక ఇంధన ధరలు ఉపాధి ఆందోళనల కారణంగా 2024లో వినియోగదారుల ఆశావాదం తగ్గినట్లు నీల్సన్ ఐక్యూ వినియోగదారుల విశ్వాస సూచిక చూపించింది.సాంకేతికత, ఇ- కామర్స్, తయారీ వంటి రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవాహాలు బలంగా ఉన్నాయి. 2024లో, ఏప్రిల్- డిసెంబర్ కాలంలో భారతదేశ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) 27% పెరిగాయి. అయితే, అధిక నిష్క్రమణల కారణంగా నికర ఎఫ్‌డిఐ తగ్గింది. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశ ప్రభుత్వ వ్యయం 48.21 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది, ఇది స్థూల దేశీయోత్పత్తి లో 19.4%.ఈ భాగాలలో ఏదైనా తగ్గుదల సమిష్టి డిమాండ్ తగ్గడానికి దారితీస్తుంది. మెరుగుపరచడానికి చర్యలు ఒక దేశం కేంద్రబ్యాంకు నియంత్రణలో ఉన్న ద్రవ్యవిధానం, రుణ వ్యయాలు, పెట్టుబడి, వినియోగదారుల ఖర్చులను ప్రభావితం చేయడం ద్వారా మొత్తం డిమాండ్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు అమెరికాలోని ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఇసిబి) ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు వారి బెంచ్‌మార్క్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ గతంలో ప్రతికూల వడ్డీ రేట్లతో ప్రయోగాలు చేశాయి. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌ను ప్రత్యక్షంగా ప్రభావితం చేయడానికి ప్రభుత్వాలు ఆర్థిక విధానాన్ని ఉపయోగించవచ్చు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్, 2021 అమెరికా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిల్లు వంటి పెద్ద-స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మొత్తం డిమాండ్‌ను పెంచే లక్ష్యంతో ఆర్థిక ఉద్దీపన ప్రకటించాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో అమెరికా నిరుద్యోగ బీమా ప్రయోజనాలు, అలాగే స్పెయిన్, ఫిన్లాండ్ వంటి దేశాలలో యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ (యుబిఐ) చర్చలు ఇందుకు ఉదాహరణలు. ఇటీవల, చైనా భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మొత్తం డిమాండ్‌ను పెంచడానికి మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడానికి ఒక ఉదాహరణ.

# సంపాదకీయం

## కులాల లెక్కలు.. బిజెపికి చిక్కులు

కులాల వారీగా జనాభా లెక్కలను సేకరించాలని కాంగ్రెస్, ఇతర విపక్షాలు ఎప్పటి నుంచో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా చెవిటివాని ముందు శంఖంలా ఉంటోంది. మంగళవారం (ఏప్రిల్ 1) కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ అంశంపై సవివరంగా ప్రస్తావించారు. కులాల వారీగా జనగణన ఆలస్యం కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. యుద్ధాలు, అత్యవసర పరిస్థితులు, ఇతర సంక్షోభాల సమయంలో కూడా జనాభా లెక్కల సేకరణ జరిగిందని, కానీ చరిత్రలో మొదటిసారిగా ప్రభుత్వం రికార్డు స్థాయి లో జనగణన నిర్వహించడంలో జాప్యం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. దీన్ని నిర్వహించడానికి ప్రభుత్వం ఇష్టపడటం లేదని స్పష్టమవుతోందని విమర్శించారు. ఖర్గే చెప్పిన వివరాల ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి కులాల ప్రాతిపదికపై జనాభా గణనపై విముఖత ఉన్నట్టు తెలుస్తోంది. కులాల ప్రాతిపదికగా జనాభా లెక్కలను సేకరించడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో సుప్రీం కోర్టు ముందు చేతులెత్తేసింది. అప్పటినుంచి ఈ సమస్య కొన్నేళ్లపాటు వాయిదా పడుతోంది. 1881 నుంచి దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఓసారి జనాభా లెక్కలను సేకరించడం పరిపాటిగా వస్తోంది. 1931 జనాభా లెక్కలకు ముందు మహాత్మాగాంధీ జనాభా లెక్కలు దేశానికి ఎంత ముఖ్యమో ఆయన గుర్తు చేశారు. మన ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి మనకు కాలానుగుణంగా వైద్య పరీక్షలు ఎంత అవసరమో జనాభా లెక్కలు కూడా అంతే అవసరంగా గాంధీజీ ఉదహరించడం ఇక్కడ గమనించాలి. అయితే కులాల వారీ జనాభా లెక్కలు మాత్రం బ్రిటిష్ వారి పాలనలోనే దేశం లో 1933లో చివరిసారి జరిగింది. అప్పటి నుంచి ఆగిపోయిన ఈ ప్రక్రియను తిరిగి చేపట్టాలన్న డిమాండ్ చిరకాలంగా వెనుకబడిన తరగతుల నుంచి వస్తోంది. 1933 నాటి కులాల వారీ సేకరణ ఆధారంగానే ఒబిసిలు దేశ జనాభాలో 36 శాతం మాత్రమే ఉంటారని ఒక వర్గం, 60 నుంచి 70 శాతం వరకు ఉంటారని మరోవర్గం ఎవరికి తోచిన విధంగా వారు వాదన లేవదీయడమే తప్ప కచ్చితమైన వివరాలు ఎవరూ చెప్పలేకపోతున్నారు. అయితే దేశ జనాభాలో వెనుకబడిన తరగతులు అధిక సంఖ్యలోనే ఉంటారని ఎక్కువ శాతం మంది అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు కేవలం 27 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించడం న్యాయం కాదని వెనుకబడిన తరగతుల ఆవేదన అరణ్య రోదనగా ఉంటోంది. విపి సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 1990లో ఒబిసిలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27% కోటా కల్పించారు. అప్పటినుంచి తమ జనసంఖ్య ఎంతో తేల్చి ఆ మేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ ఆ వర్గాలనుంచి బయలుదేరింది. 2001లోను, 2011లోను జనాభా లెక్కలతోపాటు కులాల వారీ లెక్కలు సేకరించాలన్న ఆలోచన అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అయితే యుపిఎ ప్రభుత్వం 2011 జనాభా లెక్కల సేకరణలో వేర్వేరుగా సామాజిక, ఆర్థిక కులగణన పేరుతో కొంత సమాచారాన్ని సేకరించింది. ఈ సమాచారం తమకు అందజేస్తే జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితుల చట్టం కింద ఒబిసిలకు 27% రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలవుతుందని 2021లో మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించింది. ఆ మేరకు సుప్రీం కోర్టులో కూడా వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. అయినా కేంద్రం చలించలేదు. ఆ సమాచారం తప్పుల తడకగా ఉందని, దానివల్ల ఎలాంటి ప్రయోజనం కలగదని కేంద్రం సాకులు చెప్పి తప్పించుకుంది. 2021 జనాభా లెక్కల సేకరణలో భాగంగా కులాల వారీ లెక్కలు సేకరించడం సాధ్యం కాదని కేంద్రం సుప్రీం కోర్టుకు స్పష్టం చేసింది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా కుల ప్రాతిపదికన జనగణన చేపట్టాలని నాలుగేళ్ల క్రితం ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేసినా ఫలించలేదు. ప్రతి పదేళ్లకు ఓసారి చేపట్టే జనాభా లెక్కల సేకరణలో ఎస్‌సి, ఎస్‌టిల జనగణన సాధ్యమవుతున్నప్పుడు ఇతర వెనుకబడిన తరగతుల వివరాలు సేకరించడం ఎందుకు కష్టమవుతుందని కాంగ్రెస్‌తో సహా విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. మండల్ కమిషన్ నివేదిక ఆధారంగా గతంలో విపి సింగ్ ప్రభుత్వం ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించినప్పుడు దానికి వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోనే హింసాత్మక ఆందోళనలు చెలరేగడం మరిచిపోలేని వాస్తవం. కులాల గణన పేరు చెబితే కాషాయ నాథులకు కంపరం పుట్టుకొస్తోంది. దీనికి కారణం కులాల శాతాలు బయటపడితే అగ్రవర్ణాలకు దూరం కావలసి వస్తుందని వారి భయం. బిజెపి మొదటి నుంచి హిందుత్వ భావజాలంతో అగ్రవర్ణాలను అక్కునచేర్చుకుని వారిని ఓటు బ్యాంకుగా కొల్లగొడుతోంది. జనాభాలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు, మైనారిటీలు దాదాపు 80% వరకు ఉన్నారు. వీరంతా పేదరికంలోనే మగ్గుతున్నారు. మిగిలిన 20% అగ్రవర్ణాలు. అగ్రవర్ణాలదే అన్నిటిలో పైచేయిగా ఉంటోంది. దేశ సంపద అంతా అగ్రవర్ణాల అనుభవంలోనే ఉందన్న వాస్తవం గణాంకాలతో బయటపడితే తమ ఉనికికే ముప్పు తప్పదన్న పిరికితనం కమలనాథులను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కులాల గణనకు ముందుకు రాకుండా ఏవో సాకులతో విపరీత కాలయాపన చేస్తోందన్న విమర్శలు కాంగ్రెస్ తదితర విపక్షాల నుంచి వస్తున్నాయి. అంతేకాదు ఈ సంవత్సరం బడ్జెట్‌లో జనాభా గణన కోసం రూ. 575 కోట్లు మాత్రమే కేటాయించడం బట్టి చూస్తే కేంద్ర ప్రభుత్వానికి కులాల వారీ జనాభా లెక్కల సేకరణ బొత్తిగా ఇష్టం లేదనిపిస్తోందని రాజ్యసభలో విపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యల్లో యదార్థం లేకపోలేదు.

## సొంతింటి కలకు ప్రభుత్వాల మోకాలడ్డు



### ధరలకు తోడు అనేక రకాల పన్నుపోట్లు

హైదరాబాద్ : హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. రియల్ రంగం పూర్తిగా దెబ్బతింటోంది. ప్రజల్లో ఇల్లు కొనుక్కోవాలన్న ఆలోచన లేకుండా ప్రభుత్వా తీరు ఉంటోంది. భూముల ధరలు పెరగడం, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం, ఇళ్లు అందుబాటులో లేకుండా పోవడం అన్నది అభివృద్ధికి సంకేతం కాదు. ఇది తిరోగమన చర్యగా చూడాలి. ప్రధానంగా రియల్ రంగంతో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. వివిధ రకాల వృత్తులు దీనితో పెనవేసుకుని వున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాలయాపన చేస్తూ...పోయేబదులు సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించాలి. ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కొనాలను కుంటున్న వారికి పన్నుల భారతం తడిసి మోపెడు అవుతోంది. ఇందులో జిఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజిస్ట్రేషన్‌కు ఓ పది నుంచి 20 లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. తెలంగాణలో కెసిఆర్ పుణ్యమా అని లోన్‌పైనా 50వేల అదనపు పన్నులు వేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు దోపిడీ కేంద్రాలుగా మారాయి. నిజానికి బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే కనిపిస్తోంది. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని బడ్జెట్‌లో చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతు న్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధంలోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ధ అబద్దం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్న విషయంలో అబద్దాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ప్రధాన మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ అభివృద్ధిలో దూసుకుని పోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరని గుర్తించాలి.

## డంకీరూట్‌లో అక్రమంగా ప్రవేశం

### తాజాగా పంజాబీ యువకుడు దుర్మరణం

న్యూఢిల్లీ : డంకీ రూట్..అంటే దొంగమార్గమని వేరుగా చెప్పనక్కరలేదు. అగ్రరాజ్యంలో ఈ రూట్లో ప్రవేశించేందుకు యత్నించిన అనేకమంది అసువులు బాసారు. ఇందులో అనేకదేశాల వారూ ఉన్నారు. భారీతయులు కూడా ఇలా ప్రతయ్నించి ప్రాణాలు పోగట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్రమంగా తమ దేశానికి వచ్చిన 104 మంది భారతీయులను ఇటీవల అమెరికా తిప్పి పంపిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులపై ట్రంప్ మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు పక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే ఇటీవల 104 మంది భారతీయులను సైనిక విమానంలో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే. దీంతో అగ్రరాజ్యంలోకి అక్రమంగా వెళ్లగలిగే మార్గాలపై చర్చ మొదలైంది. ఈనేపథ్యంలోనే తాజాగా ఓ పంజాబీ యువకుడు డంకీ రూట్ లో అమెరికా వెళ్తూ మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగు చూసింది. 33 ఏళ్ల గుర్‌ప్రీత్‌సింగ్ గ్వాటెమాలాలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబసభ్యులు మీడియాకు వెల్లడించారు. 'నా సోదరుడు గుర్‌ప్రీత్ అమెరికా వెళ్లేందుకు మూడు నెలల కిందట ఇంటి నుంచి బయల్దేరారు. ఇందుకోసం చండీగఢ్‌లోని ఏజెంట్ బల్వీందర్‌సింగ్‌ను సంప్రదించాడు. అతడు రూ.16.5 లక్షలు తీసుకొని నా సోదరుడిని గయానా పంపించాడు. అక్కడ ఓ పాకిస్థానీ ఏజెంట్‌కు అప్పగించాడు. అనంతరం మరికొందరు వలసదారులతో కలిసి పనామా అడవి గుండా కొలంబియాకు బయల్దేరాడు. మధ్యలో ఓసారి మాకు ఫోన్ చేసి గ్వాటమాలాలోని హోటల్‌లో ఉన్నట్లు చెప్పారు. ఆ తర్వాత ఇటీవల ఓ వ్యక్తి మాకు ఫోన్ చేసి గుర్‌ప్రీత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పాడు. కారులో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడని తెలిపాడు. ఆ తర్వాత ఐదారు నిమిషాలకే నా సోదరుడు చనిపోయినట్లు సమాచారమిచ్చారు' అని గుర్‌ప్రీత్ సోదరుడు తారాసింగ్ మీడియాకు వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. తన సోదరుడి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు సాయం చేయాలని ఈసందర్భంగా ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మృతుడి కుటుంబాన్ని పంజాబ్ రాష్ట్ర మంత్రి కుల్దీప్‌సింగ్ దలివాల్ పరామర్శించారు.


## సిరిసిల్ల నేతన్నలపై అణచివేత ఆపాలి

ఉరిసిల్లగా మారిన సిరిసిల్లను ఆదుకునేందుకు, ఆకలి చావు లు, ఆత్మహత్యలు, వలసలను నివారించడానికి ఇదివరకటి కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు, ఆర్‌వీఎం వంటి పథకాలు తెచ్చింది. అవి కార్మికుల ఉపాధికి ఆధారమయ్యాయి. స్కూల్ విద్యార్థి, విద్యార్థినుల యూనిఫామ్‌లు, బతుకమ్మ పండుగకు బతుకమ్మ చీరల ఉత్పత్తి సిరిసిల్ల కార్మికుల ఉపాధికి భరోసానిచ్చాయి. బతుకమ్మ చీరల్లో అవినీతి జరిగిందని, నాణ్యత లేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని రద్దు చేసింది. బతుకమ్మ చీరల్లో నాణ్యత లేకపోతే అంతకంటే మంచి చీరలను తయారు చేయించాలి. అవినీతి జరిగితే అవినీతి చేసిన అధికారులపై, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి తప్ప ఉన్న పథకాలను తీసివేసి ఉపాధి లేకుండా చేసి కార్మికులను రోడ్డున పడేయడం ప్రజాపాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సబబేనా? సంవత్సరన్నర కాలంలో 38 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. వందలాది మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులు మరోసారి పోరుబాట పట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో బతుకమ్మ చీరల స్థానంలో తెలంగాణ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న 65 లక్షల మంది మహిళలకు రెండు చీరల చొప్పున 1 కోటి 30 లక్షల చీరలను ఉత్పత్తి చేయిస్తామని, తద్వారా కార్మికులకు ఉపాధి, మెరుగైన ఆదాయం కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. చీరల ఉత్పత్తికి ఆర్డర్ తెచ్చుకున్న సంఘాలకు, యాజమాన్యాలకు ఒక మీటర్‌కు రూ.9 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ధర నిర్ణయించింది. కష్టపడి చీరలను నేసే కార్మికుడికి కూలి మాత్రం ప్రభుత్వం నిర్ణయించలేదు. ఇదెక్కడి న్యాయం? చీరల ఉత్పత్తికి కూలి ప్రభుత్వం నిర్ణయించాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరితే మీరు యజమానులను అడగండి మాకు సంబంధం లేదని చేతులు దులుపుకోవడం సరైనదేనా? ఈ నేపథ్యంలో సిరిసిల్ల నేత కార్మికులు ఏప్రిల్ 1 నుండి సమ్మెకు దిగారు. ఈ సమ్మెను విచ్చిన్నం చేయడం కోసం సమ్మె చేస్తున్న కార్మికులను, వారికి అండగా నిలబడిన కార్మిక సంఘాల నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారు. కేసులు పెడతామని భయపెడుతున్నారు. కార్మికులను, నాయకులను పోలీసులు భయాందోళనలకు గురిచేయడం ప్రజాస్వామ్యబద్ధమేనా? తమకు ప్రభుత్వం కూలి నిర్ణయించాలని, పాలిస్టర్ వస్త్రానికి కార్మికుల ఒప్పందం ప్రకారం కూలి చెల్లించాలని, 2023లో కార్మికులకు చెల్లించాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని, 10 శాతం యారన్ సబ్సిడీని వర్తింపజేయాలని ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మె చేస్తున్న కార్మికులను నిర్భంధించి సమ్మెను విచ్చిన్నం చేయాలనుకోవడం ప్రజాపాలన అనిపించుకుంటుందా? ప్రభుత్వానికి కార్మికుల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే నిర్భంధం, అరెస్టులకు పాల్పడకుండా కార్మికులు అడుగుతున్న న్యాయమైన కోర్కెలను తీర్చాలి. సమస్యలను పరిష్కరించకుండా నిర్బంధించి పరిపాలన చేస్తామంటే కార్మికులు చూస్తూ ఊరుకోరు. ఇది పోరు తెలంగాణ.



## నైతికబలమే ఆత్మశక్తి

ప్రభువు చుట్టూ ప్రజలు తండోపతండాలుగా ఉండేవారు. ఆయన సన్నిధిలో ఆకలి నిద్రలు మరచి పులకించిపోయేవారు. ప్రభువు పలుకులే వారికి దివ్యౌషధాలు. అలాంటి వారిని అప్పుడప్పుడూ కొందరు అహంకారులు పట్టి పీడించేవారు. వారిపై దౌర్జన్యానికి పాల్పడేవారు. అయినా వారంతా మొక్కవోని ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ప్రభువు దగ్గరే అచంచలమైన దీపాల్లా వెలుగుతుండేవారు. వారిని చూసి జాలిపడిన ప్రభువు.. 'ఆత్మవిషయమై దీనులైన మీరు ధన్యులుబీ పరలోకరాజ్యము మీదే' అని ఊరట కలిగించేవారు. ప్రభువు కొండమీద కూర్చొని అలా పలుకుతుంటే, చిన్నగా జాలువారే అమృతధారలు వారిలో జీవం ఉప్పొంగించేవి. అలా ఆయన మాటలు దుఃఖపడే వారిని ఓదార్చేవి. నీతి కోసం నిలబడే నైతిక బలమే ఆత్మశక్తిని, తృప్తినీ ఇస్తాయని ప్రభువు వారికి బోధిస్తుండేవారు. ప్రభువు బోధనలు ఆధ్యాత్మిక, భౌతిక, తాత్వికతకు మూలబీజాలుగా ఉండేవి. ఎందరెందరో బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేసేవి. బాధితుల మనసుకు సాంత్వన చేకూర్చేవి.



ఆధ్యాత్మికం

## వైభవంగా సీతారాముల కళ్యాణం





**ధర్మపురి, ఏప్రిల్ 6, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ నృసింహా స్వామి వారి ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణంను ఆలయ అధికారులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం వలె ఈ సంవత్సరం కూడా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వారి ఆలయం ప్రాంగణంలోగల శ్రీ శేషప్ప కళావేదికపై శ్రీ స్వామివారల నిత్యకళ్యాణంతో పాటు శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం దేవస్థానం వేదపండితులు, అర్చకులచే వైభవంగా నిర్వహించబడిందని ఆలయ ఇఓ శ్రీనివాస్ తెలిపారు. అలాగే ధర్మపురి మండలంలోని పలు శ్రీ సీతారాముల వారి ఆలయాల్లో స్వామివారి కళ్యాణ%శీ% అత్యంత వైభవంగా నిర్వహించగా ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ సీతారాముల కళ్యాణం ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ముఖ్య అర్చకులు నంభి శ్రీనివాసాచార్యులు, అర్చకులు నంభి అరుణ్ కుమార్, చక్రపాణి కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ మరియు అర్చకులు సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నూతన మండలాధ్యక్షుడి నియామకం



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొలంపెల్లి మాజీ ఎంపీటీసీ బండారి రమేష్ ను కాంగ్రెస్ నూతన మండలాధ్యక్షుడిగా నియమిస్తూ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు. యువ నాయకులకు పార్టీలో సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతోనే అధిష్ఠానం పార్టీలో మార్పులు చేపట్టిందని పేర్కొంటూ మండలంలో పార్టీ పటిష్టతకు పాటుపడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకై ఇప్పటి నుండే కష్టపడాలని రమేష్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. పార్టీకి చేసిన సేవలు దృష్టిలో పెట్టుకొని మాజీ మండలాధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డికి జిల్లాస్థాయిలో బాధ్యతలు అప్పగిస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బొడిగె కొండయ్య, మామిడి అనిల్ కుమార్, కొత్త తిరుపతిరెడ్డి, భూదారపు శ్రీనివాస్, సిరిగిరి రంగారావు, గుంటి మల్లేశం, రెడ్డిగాని రాజు, కొత్తపల్లి వినోద్, డి సురేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గంలోని మానకొండూర్, తిమ్మాపూర్ మండలంలోని అల్లునూర్,పొలంపెల్లి, ఇల్లంతకుంట మండలంలోని రామోజీ పేట గ్రామాలలో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై దేవతమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలుతో ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తుల కోరిక మేరకు ఆలయానికి వచ్చే భక్తుల కోసం బోరింగ్, విశ్రాంతిభవన నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శ్రీరాముని చరిత ఆదర్శంగా భక్తి, శ్రద్ధలతో జరిగే ఉత్సవాలు ప్రజల ఐక్యతను, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని పేర్కొంటూ శ్రీరాముని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండి ప్రతి ఇంట్లో స్వాంతన, సంపద, శాంతి నిండాలని మనసారా కోరుకుంటున్నట్టు ఎమ్మెల్యే కవ్వంపల్లి తెలిపారు. కార్యక్రమాల్లో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆయా మండలాల పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 06:** తెలంగాణ ఐటి పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి గాజులపల్లి గ్రామస్తులు పాలాభిషేకం నిర్వహించారు. ఆదివారం మంథని మండలం గ్రామం గాజులపల్లి లో సన్న బియ్యం పథకం ప్రజా పంపిణీ ద్వారా ప్రారంభమైన సందర్భంలో గ్రామస్తులు అందరు కలిసి మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ.... తెలంగాణ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆలోచన విధానం చాలా మంచిదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజులపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# మణి భాసికమును నుదుటునగట్టి

- రాములోరి లగ్గానికి అందరూ చుట్టాలే... • గుంపుల కలికి శ్రీరామ భద్ర ఆలయానికి పోటెత్తిన భక్తజనం.. • జయ జయ ద్వానాల మధ్య సాగిన జానకిరాముల పరిణయం
- కళ్యాణ క్రతువులో ప్రతి ఘట్టాన్ని కనులారా వీక్షించి పులకించిన భక్తజనం...







**( ది క్రైమ్ న్యూస్ ) బ్యూరో:** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామ మానేరు నది ఒడ్డున గల కలికి శ్రీరామ భద్ర దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం ఆదివారం రోజున అత్యంత వైభవోపేతంగా, సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా సాగాయి. చూడ చక్కగా అలంకరించిన కళ్యాణ వేదికపై వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ దశరథ మహారాజు కుమారుడైన శ్రీరామున్ని పెండ్లి కొడుకుగా. .. జనక మహారాజు కుమార్తె సీతాదేవిని పెండ్లి కుమార్తెగా పీటల మీద చూసిన భక్తులు తన్మయత్వంతో ఊగిపోయారు. బుగ్గన చుక్కతో... నుదుటున బాసికాలతో.. దేహాన పట్టు వస్త్రాలతో కొలువైన నవ వధూవరులైన శ్రీ సీతారాముల కళ్యాణ క్రమంలో పట్టు వస్త్రాల సమర్పణ.. జిలకర బెల్లం.. మాంగల్య ధారణ... తలంబ్రాలు పోసే ఘట్టాలు ఎంతో రమణీయంగా సాగడంతో భక్తులు భక్తిపారవశ్యంతో ఊగిపోయారు. సిరి కళ్యాణపు బొట్టును పెట్టి.... మనీ బాసికమును నుదుటున గట్టి.. ఆణిముత్యమునలు తలంబ్రాలుగా.. ఇరువుల మెరిసిన సీతారాముల కళ్యాణము చూతము రారండి... అంటూ సాగిన శ్రీ సీతారాముల కళ్యాణం... కమనీయం రమణీయం.. భగభగ మండే ఎండల్ని సైతం ఏమాత్రం లెక్క చేయకుండా చుట్టుపక్కల గ్రామాల నుండే కాకుండా సుదూర ప్రాంతాల నుండి కూడా భక్తుల వరద మానేరు తీరానికి చేరింది. ఇసుక పోస్తే రాలని జనంతో ప్రాంగణం అంతా కిటకిటలాడిపోయింది . భక్తుల రద్దీని గమనించిన స్థానిక పొత్కాపల్లి పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి కళ్యాణ మహోత్సవం లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. కళ్యాణం తర్వాత జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **భక్తులకు మజ్జిగ పంపిణీ :** భగభగ మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని స్థానిక వ్యాపారస్తుడు రావి అరుణ్ భక్తుల దాహార్తిని చేర్చడానికి నాలుగు క్వింటాళ్ల పెరుగు( సుమారు 40 వేల రూపాయలు )తో మజ్జిగ తయారుచేసి భక్తులందరికీ ఉచితంగా పంపిణీ చేయడం కళ్యాణోత్సవంలో హైలైట్ గా నిలిచింది. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం సీతారాముల కళ్యాణం రోజున భక్తులందరికీ ఇదేవిధంగా మజ్జిగను ఉచితంగా.. కావలసినంత అందిస్తున్నానని... ఆ భగవంతుని దయతో రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని వేల మంది భక్తులు వచ్చినా కూడా ఈ కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగిస్తానని ది క్రైమ్ న్యూస్‌కు తెలిపారు. తన మిత్రులతో కలిసి భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న స్థానిక వ్యాపారి రావి అరుణ్.

# అంత్యోదయ సిద్ధాంతంతో ఆఖరివ్యక్తికి అభివృద్ధి ఫలాలు

- కార్యకర్తల త్యాగఫలితమే నేటి బిజెపి • దేశాన్ని విశ్వగురుగా నిలపడమే లక్ష్యం • మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** దేశాన్ని విశ్వగురుగా నిలపాలనే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల రామక్రిష్ణారెడ్డి అన్నారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పెద్దపల్లి బస్టాండు కూడలిలో పార్టీ పతాకావిష్కరణ చేసిన అనంతరం గుజ్జుల మాట్లాడుతూ, అనేకమంది జాతీయవాద కార్యకర్తల ప్రాణ త్యాగఫలితమే నేటి బిజెపి అని, వారి కష్టంవల్లే 25రాష్ట్రాల్లో అధికారంలో కొనసాగుతోందన్నారు. ప్రపంచంలోనే క్రమశిక్షణ కలిగిన అతిపెద్ద రాజకీయ పార్టీగా బిజెపి అవతరించడం వెనక కార్యకర్తల అకుంఠిత దీక్ష, మొక్కవోని ధైర్యం, సడలని పట్టుదల ఉందని గుర్తు చేశారు. 45యేళ్ళ క్రితం శ్యామాప్రసాద్ ముఖర్జీ, అటల్ బిహారి వాజిపాయ్,లాల్ క్రిష్ణ అద్వాని వంటి దేశభక్తుల చేతిలో రూపుదిద్దుకున్న భారతీయ జనతా పార్టీ అంచెలంచెలుగా ఎదిగి, దేశాన్ని తిరిగి అఖండ భారత్ ఏర్పాటి దిశగా తీసుకెళ్ళడం మంచి పరిణామమని గుజ్జుల పేర్కొన్నారు. తెలంగాణాలో బిజెపి జెండా పాతుతాం: దక్షిణాది రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీకి ఆధరణ లేదని ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను గుజ్జుల తిప్పికొట్టారు. తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించి కమలం జెండాను పాతబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. నిజాయతి గల కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, మునిసిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతామని తెలిపారు. ఈ వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, నాయకులు ఠాకూర్ రాంసింగ్, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, బెజ్జంకి దిలీప్ కుమార్, జంగా చక్రధర్ రెడ్డి, అక్కెపల్లి క్రాంతి, మంథెన క్రిష్ణ, పెండ్యాల కరుణాకర్, మౌటం నర్సింగం, పుట్ట రవి, గనెబోయిన రాజేందర్, ఎండి ఫహీం, సతీష్ గౌడ్, కుక్క వంశీ, శ్రీనివాస్ గౌడ్, కొమిరిశెట్టి రమేష్, జాపతి రాజేష్, రాజం కొమురయ్య, సిలివేరి ఓదెలు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటా..

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ - వినతి పత్రం అందించిన గ్రామస్తులు





**ధర్మారం,ఎప్రిల్,6 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు సన్నబియ్యం పథకం పంపిణీ కార్యక్రమంలో భాగంగా ధర్మారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి విచ్చిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు గ్రామ శివారులో ప్రభుత్వ భూములను కాపాడి భూమిలేని పేదలకు భూ పంపిణీ చేయాలని వినతి పత్రం అందించిన గ్రామస్తులు భూమి లేని నిరుపేద రైతులకు అందరికీ భూ పంపిణీ చేయటం జరుగుతుంది అని గ్రామస్తులకు హామీ ఇచ్చిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నర్సింగాపూర్ గ్రామ శివారులో గల ప్రభుత్వ భూమి గత ప్రభుత్వంలో అన్యాక్రాంతం ఆక్రమణ అయిన భూములను కాపాడి గ్రామంలో భూమి లేని నిరుపేద రైతులకు భూ పంపిణీ చేయాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వినతి పత్రం అందించిన గ్రామస్తులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించి ఈ సందర్భంగా మాట్లాడుతూ..అధికారులు గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నిర్వహించారు. మిగులు భూమి సుమారు ఒక వంద ఎకరాల పైగా మిగులు భూమి ఉన్నట్టు తెలుపుతున్నారు. అందులో భూ ఆక్రమణ దారులు ఉన్నట్టు నా దృష్టికి వచ్చింది. నర్సింగాపూర్ గ్రామంలో భూమి లేని నిరుపేద రైతులకు ప్రతి ఒక్కరికి త్వరలోనే భూ పంపిణీ చేసే విధంగా తగు చర్యలు తీసుకొని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గా ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటాను అన్నారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**గన్నేరువరం (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలకేంద్రంలో బిజెపి మండలాధ్యక్షులు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం తిప్పర్తి నికేష్ మాట్లాడుతూ..... భారతీయ జనతా పార్టీ 1980 ఏప్రిల్ 6న స్థాపించబడి రెండు ఎంపీ స్థానాలతో ప్రారంభమై ప్రస్తుతం 303 స్థానాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, ఎలాంటి ఆకాంక్ష లేకుండా దేశం కోసం ధర్మం కోసం పనిచేస్తున్న కార్యకర్తలకదే ఈ ఘనత అని సూచించారు. "నేషన్ ఫస్ట్ పార్టీ నెక్స్ట్ సెల్ఫ్ లాస్ట్" అనే నినాదాన్ని అనుసరిస్తూ బిజెపి కార్యకర్తలు పనిచేస్తున్నారని బిజెపి క్రమశిక్షణ కర్తవ్యనిష్ట చూసి ప్రజలు మూడోసారి అధికారంలో కూర్చోబెట్టారని గుర్తు చేస్తూ రాబోయే కాలంలో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచి స్థానాల గెలుపే లక్ష్యంగా బిజెపి పనిచేస్తుందని బిజెపి నాయకుల క్రమశిక్షణ చూసి స్థానిక సంస్థల్లో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, నాయకులను గెలిపించుకునే దిశలోనే పార్టీ సర్వదా పనిచేస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, జాలి శ్రీనివాసరెడ్డి, అటికం రామచంద్రం, బండి తిరుపతి, రాజిరెడ్డి, లక్ష్మీపతి, చంద్రశేఖర్, జగన్, లక్ష్మీరాజ్యం, సంతోష్, సాయి దీప్, వినయ్, సంపత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

- శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు చూసి పునీతులైన భక్తులు
- భక్తులతో కిటకిటలాడిన శ్రీ సీతారాముల కళ్యాణ మండపాలు
- గ్రామ గ్రామాల్లో శ్రీ సీతారామచంద్రుల కళ్యాణ వేడుకలు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 06:** శ్రీ విశ్వావసు నామ సంవత్సరం శుక్లపక్షం నవమి తిథి అయిన ఆదివారం రోజున లోకకళ్యాణార్థం శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు కనుల పండుగగా నిర్వహించారు. శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణ వేడుకలకు తిలకిడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కళ్యాణ వేడుకలను చూసి పునీతులయ్యారు. మంథని నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ ఆలయ వేడుకలు నిర్వహించారు. సీతరామల కళ్యాణం చైత్రశుద్ధ నవమి సందర్భంగా నిర్వహించే కల్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం ముహూర్త సమయానికి ప్రారంభమయ్యే కళ్యాణ వేడుకలు వేద పండితులు శాస్త్రుత్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేషంగా నిత్యపూజలు, అభిషేకం, అర్చనలు, హారతి, మంత్రపుష్పం తో ప్రారంభమై ఉదయం 9-30 నుండి కళ్యాణ వేదికపై శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలకు నిర్వహించారు. మంథని పట్టణంలోని గోదావరి నది తీరంలో గల శ్రీ కోదండ రామాలయంలో, శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో, శ్రీరామ నగర్ లోని రామాలయంలో, ఖమ్మంపెల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయంలో, ఎగ్లాస్పూర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అలాగే అన్ని గ్రామాల్లోని కళ్యాణ వేడుకలు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు పానకం, వడపప్పు మహాప్రసాదంగా అందజేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గోని సీతారాముల కళ్యాణ అనంతరం అన్నదాన కార్యక్రమంలో స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీ సీతారామచంద్రుల కళ్యాణము యొక్క ప్రాముఖ్యత సత్యానికి న్యాయానికి ధర్మానికి ప్రతిరూపమైన శ్రీ రామచంద్రుల కళ్యాణ వేడుకలు దేశంలోని అన్ని ప్రాంతాల్లో గ్రామాల్లో నిర్వహిస్తుండడం సంప్రదాయంగా వస్తుంది. అందుకే రామరాజ్యం రావాలి అని అందరూ కోరుకుంటున్నారు. పాతివ్రత్యానికి సీతాదేవి, పితృ వాక్య పరిపాలనకు రామచంద్రుడు చిరస్థాయిగా నిలిచిపోయారు. శ్రీరాముని దివ్య చరిత్రను కీర్తించిన వాల్మీకి ధన్యుడయ్యారు. మానవజాతిని తీర్చిదిద్ది ధార్మిక జీవనం ఎంత మహోన్నతమైనదో రామాయణం ద్వారా బోధపడుతుంది. అందుకొరకే భారతీయులందరూ శ్రీరామచంద్రుని ఆరాధ్య దైవంగా పూజిస్తారు. శ్రీ మహావిష్ణు రామావతారం చైత్ర శుద్ధ నవమితి పునర్వసు నక్షత్రం రోజున జన్మించారు. శ్రీ రామ జపాన్ని పఠిస్తే అంతా శుభం జరుగుతుంది. శ్రీరాముడు అయోధ్య లో జన్మించి అయోధ్య వాసులను తరింపజేశారు.

# ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడమే బిజెపి సిద్ధాంతం
- పంటలకు రెండు తడులు నీరందించాలి
- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రపంచపటంలో అత్యంత శక్తివంతమైన దేశంగా భారతను నిలిపేలా నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ఉద్ఘాటించారు. బిజెపి 45వ ఆవిర్భావ వేడుకలను పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్, మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. చందపల్లి, నిమ్మనపల్లి గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించిన ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, 1980 ఏప్రిల్ 6న అటల్ బిహారీ వాజిపాయి, లాల్ క్రిష్ణ అద్వాని సారథ్యంలో ఏర్పడి, సాంస్కృతిక విలువల పరిరక్షణే ధ్యేయంగా రికార్డులను బద్దలు కొడుతూ అనేక రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో కొనసాగుతున్నదని తెలిపారు. దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతావాదానికి కట్టుబడిన బిజెపి ప్రభుత్వం చివరిపంక్తిలో వ్యక్తికి సైతం తొలిపంక్తిలో ఉన్న వ్యక్తి పొందే ప్రయోజనం చేకూరాలన్న అంత్యోదయ సిద్ధాంతాన్ని ఆచరణలో చూపించడం గొప్ప విషయమన్నారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఎన్నికయ్యాక ప్రపంచంలోనే అగ్రగామిదేశంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. జమ్మూ కాశ్మీరులో ఆర్టికల్ 37రద్దు, అయోధ్యలో బాలరాముడి అద్భుత మందిర నిర్మాణం, సిఏఏ, ఎన్ఆర్సి అమలు, పటిష్టమైన టాప్ 5వ ర్యాంకు ఆర్మీ ఏర్పాటులో ఏనలేని కృషి చేసిందన్నారు. పంటలకు రెండుతడులకు నీళ్ళివ్వాలి : ఎస్సారెస్పీ డి83, డి86 కాలువల ద్వారా జిల్లాకు రెండుతడులు సాగునీరు అందించాలని ప్రదీప్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కాలువల నీటిపారకంపై ఆధారపడ్డ రైతులు లక్షల ఎకరాలలో మొక్కజొన్న, వరి సాగుచేయడం జరిగిందన్నారు. నీళ్ళకోసం అధికారులను నిలదీస్తే, ఉన్నతాధికారులకు పైరవీలు చేసుకోవాలని సూచిస్తుండటం సిగ్గుచేటని విమర్శించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని స్థానిక మంత్రి, ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, నాయకులు తంగెడ రాజేశ్వరరావు, మేకల శ్రీనివాస్, పోల్సని సంపత్, ఈర్ల శంకర్, ఒల్లె తిరుపతి, రాజం మహంతకృష్ణ, కారెంగుల శ్రీనివాస్, మహేందర్ యాదవ్, కావేటి రాజగోపాల్, ఉప్పు కిరణ్, ముంజ రాజేందర్, ఎర్రోళ్ల శ్రీకాంత్, ఉప్పు హరీష్, గుడ్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలు మానవతా వికాస కేంద్రాలు





**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్):** దేవాలయాలు మానవతా వికాస కేంద్రాలుగా విలసిల్లుతున్నాయని, ప్రజలకు జీవకోటికి సేవలందించే విధంగా మన పూర్వీకులు ఆలయాలను రూపొందించారని జాతీయ సాహిత్య పరిషత్ పూర్వ జాతీయ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ కరీంనగర్ జిల్లా శాఖ కొత్తపల్లి గ్రామం చిన్న గుట్టపై వెలసిన స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం పేరుతో శ్రీ వేంకటేశ్వర వైభవం నేపథ్యంలో నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవాలయాలు ఆకలితో ఎవరు వచ్చినా వారి ఆకలి తీర్చే అన్నసత్రాలుగా, అనాథలను తీర్చిదిద్ది వారి కాళ్ళ మీద వారిని నిలబెట్టి సమాజంలోకి పంపించే అనాథాశ్రమాలుగా పేరు పొందాయని ఆయన వివరించారు. అదే మాదిరిగా ఆలయాలు ధర్మ సత్రంగాను, విద్య, వైద్య, వేద, కళ, సాంస్కృతిక, గ్రంథాలయ కేంద్రాలుగాను, శాస్త్ర అధ్యయన దివ్యధామలుగాను వర్ధిల్లుతున్నాయని ఆయన కొనియాడారు. ఆధ్యాత్మికతకు అనవాలమైన ఆలయ కేంద్రంగా వసంతోత్సవం నిర్వహించుకోవడం మహత్తర విషయమని ప్రశంసించారు. కొత్తపెల్లిలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉండడమే కాకుండా, అనేక మంది యోగులు, రుషులు ఇక్కడ ఉన్న గుహలో తపస్సును ఆచరించారని, అటువంటి మహిమాన్విత స్థలంలో ఈరోజు వసంతోత్సవం నిర్వహించడాన్ని గొప్ప దైవకార్యంగా అభివర్ణించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ దేశం కోసం, ధర్మం కోసం పాటుపడవలసిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుతం ఇంటా బయట భారతీయ ధర్మం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నదని, వీటిని ప్రతి హిందువు తిప్పికొట్టవలసిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు గాజుల రవీందర్ సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డా.గంఢ్ర లక్ష్మణరావు, ప్రజ్ఞ భారతి చైర్మన్ డా.లెక్కల రాజ భాస్కర్ రెడ్డి , జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ అధ్యక్షులు వడ్లూరి ఆంజనేయరాజు, నరహరి నారాయణరెడ్డి, బండ గోపాల్ రెడ్డి, కొత్తపల్లి పూర్వ సర్పంచ్ వాసాల రమేశ్, నరహరి జగ్గారెడ్డి మాట్లాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్ సమన్వయం చేసిన ఈ కవిసమ్మేళనంలోఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డా. కలువకుంట రామకృష్ణ,కొత్త అనిల్,స్తంభంకాడి గంగాధర్, ముత్తినేని శ్రీనివాస్, శ్రీనివాస జియ్యంగార్, నీలగిరి అనిత, ఎర్రోజుల రాజమౌళి, కటుకోజ్వల మనోహరాచారి, అనాసి జ్యోతి, సామలకిరణ్, మందల నగేష్ రెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, సముద్రాల నాగేశ్వరరావు, జనార్దన్ రెడ్డి,కె.ఎస్.అనంతాచార్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ కవిత్వగానం చేసిన 122 మంది కవులను శ్రీ వేంకటేశ్వర స్వామి చెంత పూజ చేసిన శాలువా, ప్రశంసా పత్రం, పూలు పండ్లతో సత్కరించారు.

# నేషన్ ఫస్ట్ నినాదంతో దేశసేవకు అంకితమైన అతిపెద్ద రాజకీయ పార్టీ బిజెపి

- ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వగృహంపై పార్టీ జెండా ఎగరవేసిన బొంతల కళ్యాణ్ చంద్ర



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 6(ది క్రైమ్ న్యూస్):** నేషన్ ఫస్ట్ నినాదంతో దేశ సేవకు అంకితమైన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. 45వ వ్యవస్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల తన స్వగృహంపై బొంతల కళ్యాణ్ చంద్ర పార్టీ పతాకాన్ని ఎగరవేసి, పార్టీ ఫౌండర్స్ కు ఘన నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ 44 ఏళ్ల కఠోర శ్రమ, పోరాటం , త్యాగాలతో పార్టీ ఈ స్థాయికి ఎదిగిందని, బిజెపిని ఈ స్థాయికి తీసుకురావడానికి పార్టీలోని ఎంతోమంది మహానుభావులు విశేష కృషి చేశారని, పార్టీకి వారు చేసిన సేవలు మరువలేనివన్నారు . నేషన్ ఫస్ట్ అనే నినాదమే ఊపిరిగా జీవిస్తూ , దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు పగలు రాత్రి శ్రమిస్తున్న కార్యకర్తలే బిజెపికి అతి పెద్ద బలమన్నారు. అలాంటి కార్యకర్తల బలంతోనే నేడు ప్రపంచంలోనే బిజెపి అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. దేశసేవ, ప్రజా సేవ కోసం పరితపించే కార్యకర్తలు నాయకులు కేవలం బిజెపిలోనే ఉంటారని పేర్కొన్నారు. దశాబ్దాలుగా దేశాన్ని పరిపాలించిన పార్టీలు కేవలం రాజకీయాలే చేసివారి ఎదుగుదల కోసమే ప్రయత్నం చేశాయని విమర్శించారు. బిజెపి అధికారంలో ఉన్నప్పుడుస్వార్థక ప్రయోజనాల కోసం పనిచేయలేదని, నిరంతరం దేశం సంక్షేమ అభివృద్ధి కోసం ఆలోచించి పని చేసిందన్నారు. స్వచ్ఛమైన, పారదర్శక పాలన కొనసాగిస్తూ, అభివృద్ధి ప్రయోజనాలు నేడు ఎటువంటి వివక్ష లేకుండా చివరి దశలో ఉన్న పేదలకు చేరే విధంగా జవాబు దారితనంతో బిజెపి ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా కొనసాగు తున్నాయన్నారు.

## శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబాబు

- ఎన్ని కష్టాలు ఎదురైనా నమ్మిన సత్యశీలత, ధర్మనిరతిని ఆచరించి చూపిన శ్రీరాముని జీవితం స్పూర్తిదాయకం





**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 06:** రామగిరి మండలంలోని నావబ్ పేట గ్రామంలో శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబాబు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన్నారు. ఈ సందర్భంగా దుద్దిళ్ళ శ్రీనుబాబు మాట్లాడుతూ... ఆదర్శ గుణగుణాలు, ధర్మపాలనకు మరుపేరైన శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వస్తు సందర్భంగా శ్రీరామనవమి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటారు. శ్రీ సీతారామ చంద్రస్వామి కృపాకటాక్షాలతో మంథని నియోజకవర్గం సుభిక్షంగావర్ధిల్లాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని తెలిపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మండలవ్యాప్తంగా బిజెపి ఆవిర్భావ వేడుకలు



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని మానకొండూర్, లక్ష్మీపూర్,వెగురుపల్లితో పాటు పలు గ్రామాల్లో ఆదివారం బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపూర్‌లో బిజెపి మాజీ మండలాధ్యక్షులు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రంగు బాస్కరాచారి, మండలాధ్యక్షుడు కంది రాజి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై బిజెపి జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేసి అల్పాహారం వితరణ చేశారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ....ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బిజెపి అని అటల్ జి,అద్వానీజీ ఆశయాలతో నరేంద్ర మోడీ పనిచేస్తున్నారని కొనియాడారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ సారథ్యంలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చా మండల కార్యదర్శి బండారి హరీష్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు రాపాక జగన్, పోలింగ్ బూత్ అధ్యక్షులు ఉప్పు సాయినితీష్ పటేల్, రాపాక లక్ష్మణ్, వెల్ది పోలింగ్ బూత్ అధ్యక్షులు నగునూరి ప్రవీణ్, నాయకులు పెంట రమేష్, ఎడ్ల రవీందర్, ఉప్పు రవీందర్, గుండేటి లక్ష్మీనారాయణ,వీర్ల మహేష్,పిట్టల సురేష్ చుక్క మహేష్, రాపాక ప్రశాంత్, సుంక ఉదయ్ కుమార్, ఎల్లయ్య,సారయ్య, అశోక్, విటల్, కుమార్, శ్రీనివాస్ ఆయా గ్రామాల బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిసాన్ సెల్ అధ్యక్షునిగా బుర్ర శ్రీకాంత్ గౌడ్



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్):** మానకొండూర్ మండలం మద్ది కుంట గ్రామానికి చెందిన బుర్ర శ్రీకాంత్ గౌడ్ ను కిసాన్ సెల్ మండల అధ్యక్షునిగా బుర్ర శ్రీకాంత్ గౌడ్ నియామకం అయ్యారు.దీనికి సంబంధించిన కవ్వంపల్లి సత్యనారాయణ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు పురం రాజేశం, ఉపాధ్యక్షులు ధ్వావ శ్రీనివాస్ రెడ్డి వారికి నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ కి జిల్లా అధ్యక్షులు పురం రాజేశం కి,మండల అధ్యక్షులు నంద గిరి రవీంద్ర చారి కి, ఎఎంసి చైర్మన్ ఓదెలు వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి కి మండల నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కమాన్ పూర్ ఇనుగంటి రామారావు జన్మదిన వేడుకలు



**మంథని, (ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మాజీ వరాహ స్వామి టెంపుల్ చైర్మన్ ఇనుగంటి హేమలత జగన్నాథరావు కుమారుడు ఇనగంటి రామారావు గారి జన్మదినం సందర్భంగా, గోదావరిఖని లోని అమ్మ పరివార్ అనాథ ఆశ్రమం లో కేక్ కట్ చేసి, పిల్లలకి బట్టలు అందించడం జరిగినది, అలాగే వారికి భోజనం మరియు పండ్లు అందించడం జరిగినది, ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిట్ల గోపాల్ గారికి, మరియు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఇనగంటి రోహిత్ రావు, మెడగోని విజయ్, సయ్యద్ జాకీర్, నారగోని ప్రశాంత్, చెన్నూరు అభిలాష్, పిట్టల తిరుపతి, దోనికేనా విజయ్ ,కమ్మగొని అనిల్, కీర్తి సాయి, దయ్యాల రమేష్, తాటికొండ లింగాచారి, నల్లెల్లి ఈశ్వర్, విష్ణు, ఖదీర్, షఫీ పాల్గొన్నారు.

# కమలాపూర్ మండలంలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో కమలాపూర్, ఉప్పల్, శనిగరం లలో ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. కమలాపూర్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో కార్యకర్తలకు, నాయకులకు పార్టీ ఆవిర్బవా శుభాకాంక్షలు తెలుపుతూ 1980 ఏప్రిల్ 6 వ తారీకు రోజున భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం జరిగిందనీ అటల్ బిహారి వాజపేయి గారు మరియు లాల్ కృష్ణ అద్వానీ గారు బీజేపీ పార్టీ నీ ఏర్పాటు చేసారని 3 సార్లు వాజ్ పాయ్ గారు మరియు 3 సార్లు నరేంద్ర మోడీ గారు ప్రధాని గా పనిచేయడం జరిగిందనీ 2 పార్లమెంట్ సీట్ల తో ప్రస్థానం మొదలు పెట్టి ప్రపంచంలో శక్తి వంతమైన పార్టీగా ఎదిగిందని, రాబోయే కాలంలో తెలంగాణలో అధికారంలోకి వస్తుంది అని ఆశభావం వ్యక్తం చేసారు. దేశంలో న్ డి ఏ కూటమితో 19 రాష్ట్రాల్లో అధికారంలో కొనసాగుతుందని బీజేపీ తోనే దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వలిగే సాంబారావు, తోట సురేష్, భూపతి ప్రవీణ్, బండి కోటేశ్వర్, ఎలిమి మహాజన్, ఇనుగాల రత్నాకర్, కనుకుంట్ల అరవింద్, భోగి బిక్షపతి, తాడేం రాజేందర్ జెట్టి సారంగపాణి, పాక కుమారస్వామి, బండి సంపత్,తూర్పటి భాస్కర్, బండి వినయ్ సాగర్, డాక్టర్ సాంబయ్య, పోలోజు రాజేశం, మౌటం మొగిలి, కొండమీది బిక్షపతి, మార్గం చైతన్య, శనిగరం సంపత్, రామ్ శెట్టి రాజయ్య, ఒడ్డె వీరన్న, పుల్ల సంజీవ్, వెంగళ సాయి, చెలిమల్ల రంజిత్, అట్ల హరీష్, పుస్కూరి రాంబాబు, బుర్ర కుమారస్వామి, పసునూటి రాణా ప్రతాప్, బండి సురేష్, రావుల ఆకాష్, గుర్రం సురేష్, నరిగే ఓదెలు, చందర్ సింగ్, దండబోయినా శ్రీనివాస్, సముద్రాల మొగిలి,ఎగ్గొజు శ్రీనివాస్,అకినపెల్లిరవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో ఘనంగా సీతారాముల కళ్యాణం



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ లో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతా రామాంజనేయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం కమిటీ నిర్వాహకులు కళ్యాణానికి వచ్చిన భక్తులకు ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆంజనేయ మాలా దారణ స్వాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణ మహోత్సవాలకు మాజీ మంత్రి కొప్పుల



**ధర్మారం,ఏప్రిల్,6 (ది క్రైమ్ న్యూస్):** శ్రీరామనవమి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నిర్వహించిన శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఈ సందర్భంగా వేద పండితులు కొప్పుల ఈశ్వర్ తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఓడేడులో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ముత్తారం.ఏప్రిల్.06.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం కేంద్రంలో,ఓడేడ్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని పార్టీ జెండాను ఎగుర వేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతీయ జనతా పార్టీ అతి పెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి హరీష్ రావు, మాజీ మండల అధ్యక్షుడు బిరుదు గట్టయ్య, మూగ మల్లేష్, దాసరి ప్రశాంత్, దాసరి సృజన్, బిక్కినేని సంతోష్ రావు, ఓగులవేని కుమార్, ఓగులవేని రాజేష్, సమ్మెట దినేష్, దాసరి శివ, ఐద రమేష్, మూగ రాజయ్య, పెయ్యాల సురేష్, బొడ్డు సారయ్య, చందా రాజేష్, గొర్ల సతీష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ధర్మపురి, ఏప్రిల్ 6, (ది క్రైమ్ న్యూస్): భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ధర్మపురి పట్టణ బీజేపీ అధ్యక్షుడు గాజు బాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం ధర్మపురి పట్టణంలోని స్థానిక నంది చౌక్ వద్ద భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గాజు భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 12కోట్ల మంది భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు, సానుభూతిపరులకు, దేశంకోసం ధర్మంకోసం పనిచేస్తున్న ప్రతివ్యక్తి భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రపంచ చరిత్రలో అతిపెద్ద రాజకీయ పార్టీ, 12కోట్ల సభ్యత్వంతో మిగతా రాజకీయ పార్టీలకు ఆదర్శంగా ఉన్న మా పార్టీ ఏకాత్మ సిద్ధాంతం మనందరికీ స్ఫూర్తి అని బాస్కర్ తెలిపారు. కేవలం రెండు సీట్లు నుంచి 300 సీట్ల వరకు గెలుచుకొని మూడవసారి అధికారం చేపట్టిన ఘనత భారతీయ జనతా పార్టీ అని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ లో భారతీయ జనతా పార్టీ తప్పక విజయం సాధిస్తుందని పట్టణాధ్యక్షుడు బాస్కర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజుభాస్కర్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సారంగుల అమర్నాథ్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, బెజ్జరపు లవన్, పోగుల గుండన్న, కొంపల నరసయ్య, చుంచుకాల కిషన్, ముత్యపు రమేష్, పానుగంటి రవి, స్తంభం కాడి శ్యామ్, పిల్లర్ల సురేందర్, నరెడ్ల శంకర్, పోతంశెట్టి శేఖర్, రాయల రవికుమార్ సిందె, కాశెట్టి హరీష్, మండలజీ సూరజ్, దివిట్టి శ్రీధర్, సంఘీ మాధవ్, కాశెట్టి శివ సాయి, అప్పం మల్లేష్, బొమ్మ కంటి రాకేష్, కాలికోట రాజు, శేఖర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక లొంకకేసారం గ్రామం

- హిందూ సంప్రదాయ పండుగలలో ముస్లింల సహకారం
- గత ఆరు ఏళ్లుగా వైభవంగా రాములోరి కళ్యాణం
- తాజా మాజీ సర్పంచ్ ఎండి మంజూరు





**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 06:** రామగిరి మండలం లొంకకేసారం గ్రామ నడిబొడ్డున నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్బంగా సీతారామ కళ్యాణం వైభవంగా నిర్వహించారు. 10 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయంలో ఆరు సంవత్సరాల నుండి గ్రామస్తులు అందరూ కలిసి ప్రతి దైవ కార్యక్రమం సంతోషంగా, వైభవంగా జరుపుకుంటారు. మత సామరస్యానికి ప్రతీకగా లొంకకేసారం గ్రామం చెప్పవచ్చు. తెలంగాణ ఏర్పడిన తదుపరి ఏర్పడిన చిన్న నూతన గ్రామ పంచాయతీ మొదటి సర్పంచిగా ఎన్నికైన ముస్లిం మతానికి చెందిన ఎండి మంజూరుతో పాటు, ఇతర ముస్లిం గ్రామస్థులు ప్రతి హిందూ పండగ, పూజలు, ఉత్సవాలలో లొంకకేసారం గ్రామ ప్రజలలో మమేకమై అన్ని రకాలుగా సహకరిస్తుంటారు. యధావిధిగా ఈ సంవత్సరం కూడా జరిగే ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు గ్రామ ప్రజలందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ పాల్గొని కార్యక్రమం ఖర్చులకు తమ వంతు శక్తికొలది ధన, వస్తు రూపేనా చందాలు పోగేసుకుని సంతోషంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈయేడు కూడా ఆలయ పూజారి కోవెల శ్రీనివాసాచార్యులు, అర్చకులు కంజర్ల వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోత్తంగా, వేద మంత్ర ఉచ్చరణలతో వైభవంగా సీతారాముల కళ్యాణం నిర్వహించగా ఒజ్జ స్వర్ణలత-సురేష్ దంపతులు రాముని తల్లి తండ్రులుగా, వీరవేని సౌందర్య-శ్రీనివాస్ దంపతులు సీతాదేవి తల్లితండ్రులుగా వ్యవహరిస్తూ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ వేదిక ముందు కూర్చుండి ఆలయ కమిటీ సేవకులు అందించిన రామరసం సేవిస్తూ కళ్యాణం అయ్యేంతవరకు భక్తిశ్రద్ధలతో తిలకించి, కళ్యాణం అనంతరం స్వామివార్లను దర్శనం చేసుకుని కట్న కానుకలు సమర్పించుకొని, అక్షింతలు తీసుకొని, ప్రసాద భోజనాలు స్వీకరించారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరాని సద్వినియోపరుచుకోండి

- లద్నాపూర్ గ్రామ ఉచిత నేత్ర వైద్య శిబిరం కరపత్రం ఆవిష్కరణ
- శ్రీ పాద టస్ట్ చైర్మన్ దుద్దిళ్ళ శీను బాబు




**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 06:** రామగిరి మండలంలోని లద్నాపూర్ గ్రామంలో తేదీ 07-04-2025 సోమవారం రోజున ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00గంటల వరకు లయన్స్ క్లబ్ ఆప్ సెంటినరీ కాలనీ, రేకుర్తి కంటి ఆసుపత్రి కరీంనగర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత నేత్ర వైద్య శిబిర కర్రపత్రాలను శ్రీ పాద టస్ట్ చైర్మన్ దుద్దిళ్ళ శీను బాబు తో కలసి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువ నాయకులు దుద్దిళ్ళ శ్రీను బాబు మాట్లాడుతూ కంటి చూపులో లోపాలు కంటి సమస్యలు, కంటి శుక్లాలు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి నిపుణులైన డాక్టర్లచే పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారిని వెంటనే రేకుర్తి ఉచిత బస్ సౌకర్యం తీసుకెళ్లి రేకుర్తి కంటి దావకానలో ఉచిత ఆపరేషన్ చేయబడునని అన్నారు.ఈ అవకాశాన్ని ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీను బాబు, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, ప్రోగ్రాం ఇంచార్జ్ ,మాజీ ఎంపిటిసి వనం రామచంద్ర రావు,మంథని అసెంబ్లీ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బర్ల శ్రీనివాస్ ముదిరాజ్, లయన్స్ క్లబ్ నిర్వాహకులు, రామగిరి మండల నాయకులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రామన్న యువసేన ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 06:** కమాన్ పూర్ మండల కేంద్రంలో రామన్న యువసేన ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీపీ మాజీ ఆదివారహస్వామి దేవాలయ చైర్మన్ తనయుడు ఇనగంటి రామారావు (రామన్న) యువసేన ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను మెరుగు కుమార్ , జంగపల్లి రవి మేడగో ని విజయ్, ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. మొత్తం కమాన్ పూర్ మండలంలోని 10 జట్లు ఇందులో పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్ గేయల్ వర్సెస్ ఐకెపి జూనియర్స్ జరగగా ఐ కెవి జూనియర్స్ ఘనవిజయం సాధించారు.ఇందులో ఫైనల్ విజేతకు 5016 రూపాయలు రన్నర్ అప్ కు 2016 రామన్న చేతుల మీదుగా జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మెడగొని సాయి, గోశిక వరప్రసాద్, గుంజపడుగు నరేష్, జంగపల్లి సంతు, చిన్నోజు చందు, కమ్మగొని అనిల్, జంగిపల్లి శ్రీకాంత్ ,రోహిత్ రావ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడలో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

- పాల్గొన్న పుర ప్రముఖులు.. వేలాది మంది భక్తులు
- టీపీసీసీ జనరల్ సెక్రెటరీ శశికళ యాదవ రెడ్డి ఆధ్వర్యంలో..



**సంగారెడ్డి, ( ది క్రైమ్ న్యూస్ ):** దశాబ్దాల కాలంగా బీరంగూడ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో టీపీసీసీ జనరల్ సెక్రెటరీ, మాజీ అమీన్పూర్ గ్రామ సర్పంచ్, ఉమ్మడి మెదక్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు గోక శశికళ యాదవ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా జరుగుతాయి.ఆనవాయితీని కొనసాగిస్తూ నేడు ఆదివారం నాడు శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజకీయ ప్రముఖులతో పాటు వేలాది మంది భక్తులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. రాజకీయాలకు అతీతంగా పుర ప్రముఖులు గ్రామస్తుల సహకారంతో ప్రతి ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తామని ఇక్కడ నివసించే ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటూ భవిష్యత్తులో వేడుకలు మరింత ఘనంగా నిర్వహిస్తామని శశికళ యాదవ రెడ్డి తెలిపారు.ఈ వేడుకలలో పాల్గొన్నటువంటి భక్తులు సీతారాముల వారి కళ్యాణం అనంతరం నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్న సమారాధన కార్యక్రమంలో వేలాదిగా పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

## కామ్రేడ్ బి టి రణదీవే స్ఫూర్తితో కార్మిక రాజ్య స్థాపన కై కృషి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమార్ స్వామి

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 06** మంథనిలో మంథని విద్యార్థి యువత కార్యాలయంలో కామ్రేడ్ బీటీ రణదీవే వర్ధంతి కార్యక్రమాన్ని సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమార్ స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ భారత కార్మిక ఉద్యమ నిర్మాత కామ్రేడ్ బిటి రణదీవే స్వాతంత్ర పోరాటంలో పాల్గొంటూ కార్మిక కష్టజీవుల హక్కుల కోసం రాజిలెని పోరాటాలు నిర్వహించారని అన్నారు.ఈ దేశంలో కార్మిక సంఘాలకు కేంద్రబిందువుగా ఉన్న విప్లవకర ట్రేడ్ యూనియన్ సీఐటీయూ ని స్థాపించడంలో కామ్రేడ్ రణదీవే ప్రముఖ పాత్ర వహించారని అన్నారు ఆర్థిక పోరాటాలతో పాటు సామాజిక సాధన కోసం కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాల నిర్వహించాలని అన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో ఈ దేశంలో కార్మిక రాజ్య స్థాపన కోసం పోరాటాలను కొనసాగిస్తామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ బిక్షపతి, సిపెల్లి రవీందర్, సహాయ కార్యదర్శి జి జ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ ,నాయకులు ఆర్ల సందీప్, జి.సురేష్, పాల్గొన్నారు.



# వైభవంగా హిందూవాహిని శ్రీరామ మహాశోభయాత్ర

- మతంమారితే హిందువులు మనుగడ సాధించడం అసాధ్యం
- తెలుగురాష్ట్రాల్లో పనిగట్టుకొని హిందుత్వంపై దాడి
- ప్రపంచవ్యాప్తంగా సనాతనధర్మం విస్తరిస్తోంది
- గోవులు, ఆలయాలు దేశ సాంస్కృతిక వారధులు
- రాధామనోహరదాస్, శివానందస్వామీజీ ఉద్ఘాటన..





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అత్యంత ప్రాచీన ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన భారతదేశానికి సకలదేవతలకు నిలయాలైన గోవులు, ఆలయాలు సాంస్కృతిక వారధులుగా నిలిచాయని ప్రముఖ భగవద్గీత ప్రచారకర్త రాధామనోహరదాస్, తెలంగాణా ప్రాంత ధర్మాచార్యులు శివాశివానంద స్వామీజి అన్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని హిందువాహిని ఆద్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో చేపట్టిన మహా శోభయాత్ర కార్యక్రమానికి విచ్చేసిన ఇరువురు మాట్లాడుతూ, మతం మారితే హిందువులు మనుగడ సాధించడం అసాధ్యమని తేల్చి చెప్పారు. ప్రస్తుతం విశ్వవ్యాప్తంగా సనాతనధర్మ ఆచరణ దిశగా అనేక దేశాల ప్రజలు ముందుకు వస్తున్నారని, అలాంటి సమయంలో హిందుత్వాన్ని వదిలివెళ్ళడం మూర?త్వమే అవుతుందని తెలిపారు. బలమైన ప్రాచీన హిందుత్వమూలాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. అనేక యేళ్ళపాటు హిందూధర్మం పట్ల విషాన్ని చిమ్మిన పాలకుల అసలు నిజస్వరూపం బయట పడుతోందన్నారు. హిందూ ధర్మాన్ని మరిన్ని తరాలకు అందించేలా తమ కార్యచరణ ఉండబోతుందన్నారు. ధర్మ రక్ష కొరకు ప్రతీ హిందువు శివాజీ మహరాజ్ వలే పోరాటం చేయవలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. హిందుత్వ వ్యతిరేక శక్తుల పీచమణచడంలో కీలకభూమిక పోషించాలని వారు సూచించారు. హిందూవాహిని చేపట్టిన మహా శోభయాత్ర విజయవం తమైనది. వేలాదిగా హిందూవాహిని కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాలకు చెందిన నాయకులు తరలిరావడంతో పట్టణ వీధులన్ని కాషాయవర్ణంతో నిండిపోయాయి. సీతాసమేత శ్రీరాములవారు, హనుమంతుడు, ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా జనం తరలిరావడం అన్ని వర్గాలను విస్మయానికి గురిచేసింది. అటు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్ర సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ యాత్రలో హిందూవాహిని నాయకులు పూసాల శ్యాంసుందర్, విజయ్, సాయివెంకి, ప్రవీన్, క్రాంతి, మారుతి, నరేష్, వంశీ, బిజెపి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, బెజ్జంకి దిలీప్ కుమార్, శివంగారి సతీష్, తదితరులు పాఒల్గొనారు.

# కన్నుల పండుగగా శ్రీ సీతారామల కళ్యాణ మహోత్సవం

- భక్తులతో కిటకిటలాడిన శ్రీ సీతారాముల కళ్యాణ మండపాలు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్) ఏప్రిల్ 06:-** కమాన్ పూర్ మండలంలో ఆదివారం రాములోరి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.శ్రీ విశ్వావసు నామ సంవత్సరం శు క్లపక్షం నవమి తిథి అయిన ఆదివారం రోజున లోకకళ్యాణార్థం శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు కనుల పండుగగా నిర్వహించారు. శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణ వేడుకలకు తిలకిడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కళ్యాణ వేడుకలను చూసి పునీతులయ్యారు. కమాన్ పూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఈ ఆలయ వేడుకలు నిర్వహించారు. సీతరామల కళ్యాణం చైత్రశుద్ధ నవమి సందర్భంగా నిర్వహించే కల్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం ముహూర్త సమయానికి ప్రారంభమయ్యే కళ్యాణ వేడుకలు వేద పండితులు శాస్త్రృత్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేషంగా నిత్యపూజలు, అభిషేకం, అర్చనలు, హారతి, మంత్రపుష్పం తో ప్రారంభమై ఉదయం 9-30 నుండి కళ్యాణ వేదికపై శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలకు నిర్వహించారు. కమాన్ పూర్ మండల కేంద్రంతో పాటు గుండారం జూలపల్లి రొంపి కుంట పెంచికలపేట పేరపల్లి సిద్ది పల్లె, రాజాపూర్, కిష్టం పల్లె, తోపాటు గొల్లపల్లి అన్ని గ్రామాల్లోని కళ్యాణ వేడుకలు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు పానకం, వడపప్పు మహాప్రసాదంగా అందజేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గోని సీతారాముల కళ్యాణ అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీ సీతారామచంద్రల కళ్యాణము యొక్క ప్రాముఖ్యత సత్యానికి న్యాయానికి ధర్మానికి ప్రతిరూపమైన శ్రీ రామచంద్రుల కల్యాణ వేడుకలు దేశంలోని అన్ని ప్రాంతాల్లో గ్రామాల్లో నిర్వహిస్తుండడం సంప్రదాయంగా వస్తుంది. అందుకే రామరాజ్యం రావాలి అని అందరూ కోరుకుంటున్నారు. పాతివ్రత్యానికి సీతాదేవి, పితృ వాక్య పరిపాలనకు రామచంద్రుడు చిరస్థాయిగా నిలిచిపోయారు. శ్రీరాముని దివ్య చరిత్రను కీర్తించిన వాల్మీకి ధన్యుడయ్యారు. మానవజాతిని తీర్చిదిద్ది ధార్మిక జీవనం ఎంత మహోన్నతమైనదో రామాయణం ద్వారా బోధపడుతుంది. అందుకొరకే భారతీయులందరూ శ్రీరామచంద్రుని ఆరాధ్య దైవంగా పూజిస్తారు. శ్రీ మహావిష్ణు రామావతారం చైత్ర శుద్ధ నవమితి పునర్వసు నక్షత్రం రోజున జన్మించారు. శ్రీ రామ జపాన్ని పఠిస్తే అంతా శుభం జరుగుతుంది. శ్రీరాముడు అయోధ్య లో జన్మించి అయోధ్య వాసులను తరింపజేశారు.

# శ్రీ హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో 25 వసంతాలు కల్యాణ మహోత్సవం



**మంథని, (ది క్రైమ్ న్యూస్):** కమాన్పూర్ మండలంలోశ్రీ హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం పాల్గొన్న భక్తులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడం జరిగింది అలాగే అన్నిరాజకీయ పార్టీల నాయకులు పుర ప్రముఖులు అలాగే శ్రీ హనుమాన్ సేవా సమితి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీతకు సన్మానం..



**మంథని, (ది క్రైమ్ న్యూస్):** .బిట్.డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మార్చి నెలలో గోదావరిఖనిలో జరిగిన ఉగాది పురస్కారాలలో భాగంగా వివిధ రంగాల్లో కృషిచేసిన వారికి అవార్డుల ప్రాధానోత్సం జరిగింది. ఈ అవార్డులో భాగంగా కమాన్ పూర్ గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు గారికి సేవా రత్నా అవార్డ్ అందుకున్న సందర్భంగా ఆదివారం జూపాక మూర్తి ఆధ్వర్యంలో అవార్డ్ గ్రహీత గుర్రం లక్ష్మిమల్లు గారిని శాలువతో ఘనంగా సన్మానించారు.లి ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ కన్వీనర్ తాటికొండ శంకర్, బి.ఆర్.ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, నాయకులు నీలం శ్రీనివాస్, జాబు సతీష్, గుర్రం రవి, రాంపెల్లి రవి, తోట రాజ్ కుమార్, సాన సురేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారుద.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

**ధర్మారం, ఏప్రిల్ 6( ది క్రైమ్ న్యూస్):** పేకాట స్థావరంపై పోలీసుల దాడులు పదకొండు వేల ఐదు వందల ముప్పై రూపాయలు స్వాధీనం ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులను ఎస్సై శీలం లక్ష్మణ్ పట్టుకొని వారి వద్ద నుండి 11,530 వేల రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# కళ్యాణం... కమనీయం...

- అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** కళ్యాణం కమనీయం అనే రీతిలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా కొనసాగింది. గోదావరిఖనిలోని కాకతీయ నగర్ భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ళ నీడలో మామిడాకు తోరణాల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు బూర్ల గణేష్ అయ్యగారి ఆధ్వర్యంలో అర్చకులు నూతి అంబాదాస్, పవన శర్మ, నెల్లి లక్ష్మీనారాయణ, ఆకోజి జానకి రామయ్య, బండారి రాజమల్లు తదితర వేద పండితుల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణం భద్రాచలంలో మాదిరిగానే అంగరంగ వైభవంగా కొనసాగింది. కల్యాణం యొక్క ప్రాముఖ్యతను, ఉద్దేశమును వేలాదిమంది భక్తజనం అర్థం చేసుకునే విధంగా ఆలయ ప్రధాన అర్చకులు బూర్లగణేష్ అయ్యగారు రామయ్య తండ్రి పాటలు పాడుతూ కల్యాణం యొక్క విశిష్టతను కూలంకుషంగా వేలాది మంది భక్తజనం అర్థం చేసుకునే రీతిలో కళ్యాణ ప్రాముఖ్యతను వివరించారు. వేద పండితుల మంత్రాలు వేలాది మంది భక్తజనం సందోహం మధ్య అంగరంగ వైభవంగా కళ్యాణం కమనీయం అనే రీతిలో శ్రీ సీతారాముల కళ్యాణం భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణమంతా మారు మోగేలాగా కొనసాగింది. వేలాది మంది భక్తులు హాజరై శ్రీ సీతారాముల కళ్యాణం ఘట్టాన్ని తిలకించి వారి కుటుంబాలు పిల్లాపాపలు పాలిస్తున్న పాలకులు తమ తమ గ్రామాలు తమ నివాసాలు సుఖంగా సంతోషంగా ఉండాలని ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ సీతారాముల వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ దాట్ల జేమ్స్ రెడ్డి, బిఆర్ఎస్ అధికార ప్రతినిధి నీరటి శ్రీనివాస్, ఎన్సీపీ నాయకులు మొలుగూరి మహేష్, బస్తీ వాసులు ఆగయ్య, గొర్రె రామచందర్, గొర్రె నర్సింగరావు, ఉప్పరి మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు మజ్జిగ వితరణ..



**ఇల్లందకుంట ఏప్రిల్ 6 (ది క్రైమ్ న్యూస్):** శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం సందర్భంగా ఇల్లంతకుంట దేవస్థానం వద్ద రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సౌజన్యంతో శ్రీ పోన్నం సత్తయ్య గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని హుజరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడతల ప్రణవ్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేశిని కోటి, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ ఇంగిలి రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, సజ్జు లతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం



**జమ్మికుంట ఏప్రిల్ 6 (ది క్రైమ్ న్యూస్):** శ్రీరామ నవమి సందర్భంగా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మారుతి నగర్ లో గల పంచముఖ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) చైర్మన్ పొనగంటి సంపత్ - శ్రీలత ల ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా స్వామివారి కళ్యాణం జరిపించడం జరిగింది. కళ్యాణం అనంతరం భక్తులందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆలయ అర్చకులు శ్రీధర్ శర్మ, కిషోర్ శర్మలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారు మోగింది. మాజీ కౌన్సిలర్ పోనగంటి రాము, డాక్టర్ ఉడుగుల సురేష్, డాక్టర్ కంశెట్టి కిషోర్, మరి అవినాష్, ఊడుగుల సంపత్, వట్టేపల్లి ప్రకాష్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాములోరి కళ్యాణంలో మాజీ ఎమ్మెల్యే



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 06:** మంథని నియోజకవర్గంలోని శ్రీరామనవమి సందర్భంగా ఆయా ఆలయాల్లో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. మంథని మున్సిపల్ పరిధిలోని హనుమాన్‌నగర్, శ్రీరామ్ నగర్, మంథని మండలం మైదుపల్లి గ్రామంలో మరియు ముత్తారం మండలం లక్కారం గ్రామంలో మరియు రామగిరి మండలం రామయ్య పల్లె గ్రామాల్లోని హనుమాన్, కోదండ రామాలయాల్లో సీతారాముల కళ్యాణం వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పాల్గొని సీతారాముల కళ్యాణం తిలకించారు.

# బోగ్ బండార్ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబుని ఆహ్వానించిన గుగులోత్ ప్రవీణ్ కుమార్



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 06:** రామగిరి మండలంలోని వకీల్ పల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుగులోత్ ప్రవీణ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబుని ధన్వాడ శ్రీ దత్తాత్రేయాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపి అనంతరం వకీల్ పల్లెలో జరగబోయే ఎస్టి ల బోగ్ బండార్ 08-04-2025 మంగళవారం రోజున కార్యక్రమానికి రావాలని గుగులోత్ ప్రవీణ్ కుమార్ ఆహ్వానించిన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొప్పుల గణపతి,రామగిరి మండల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు మోత్కూరి నవీన్ గౌడ్, బానోత్ చందు, మరియు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న శ్రీ దుద్దిల్ల శ్రీను బాబు

- ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన శ్రీను బాబు



**మంథని, (ది క్రైమ్ న్యూస్):** ఈ రోజు మంథని పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో మరియు శ్రీరాంనగర్‌లో శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి సీతారామ చంద్రస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న దుద్దిల్ల శ్రీను బాబు ఆ భగవంతున్ని ప్రాంతా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, పాడిపంటలతో సంతోషంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు.

# స్పోర్ట్స్

# బుమ్రా మరో ఘనత..
# దిగ్గజాల సరసన యార్కర్ కింగ్

యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా మరో ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో వేగంగా 150 వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా బుమ్రా రికార్డు నెలకొల్పాడు. అతడి కంటే ముందు లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్(%బఓజవఅనతీఝ జష్ట్రుఘ్రుశ్రీ%) ఈ మైలురాయికి చేరుకున్నాడు. చాహల్ 118 మ్యాచుల్లోనే 150 వికెట్లు తీయగా.. బుమ్రాకు 125 మ్యాచ్‌లు పట్టింది. మొత్తంగా ఈ క్లబ్‌లో చేరిన మూడో బౌలర్‌గా, రెండో పేసర్‌గా ముంబై స్పీడ్‌స్టర్ చరిత్ర సృష్టించాడు. ముంబై మాజీ పేసర్, ప్రస్తుత బౌలింగ్ కోచ్ లసిత్ మలింగ(%ఝుంత్ప్ర మీఝశ్రీఅఅస్త్రుఝ%) 105 మ్యాచుల్లోనే 150 వికెట్లు పడగొట్టాడు. సీఎస్కే మాజీ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో 137 మ్యాచుల్లో, సన్‌రైజర్స్ హైదరాబాద్ పేసర్ భువనేశ్వర్ కుమార్ 138 మ్యాచుల్లో ఈ ఘనత సాధించారు. వాంఖడే స్టేడియంలో ఆదివారం తొలుత ముంబై రోహిత్ శర్మ(49), టిమ్ డేవిడ్(45నాటౌట్), రొమారియో షెపర్డ్(39 నాటౌట్) వీరబాదుడుతో 234 రన్స్ కొట్టింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్‌పై బుమ్రా నిప్పులు చెరిగాడు. హాఫ్ సెంచరీతో ముంబైకి ప్రమాదకరంగా మారిన ఓపెనర్ పృథ్వీ షా(66)ను యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత అభిషేక్ పోరెల్(41)ను వెనక్కి పంపి 150 వికెట్ల క్లబ్‌లో చేరాడు. కొయెట్జీ 4 వికెట్లు తీయడంతో ఢిల్లీ 29 పరుగులతో గెలిచింది. సొంతగడ్డపై విజయంతో ఈ సీజన్‌లో హార్దిక్ పాండ్యా సేన బోణీ కొట్టింది.









## వన్డేల్లో వేగంగా 2 వేల పరుగులు..

### తొలి న్యూజిలాండ్ బ్యాటర్‌గా మిచెల్ రికార్డు

న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్ రికార్డు సృష్టించాడు. గత కొంతకాలంగా కివీస్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న అతడు వన్డేల్లో 2 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో నిలకడగా రాణిస్తున్న మిచెల్.. స్వదేశంలో పాకిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో 43 పరుగులు చేసి 2 వేల క్లబ్‌లో చేరాడు. తద్వారా ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా ఈ మైలురా యికి చేరిన తొలి కివీస్ బ్యాటర్‌గా గుర్తింపు సాధించాడు. 47వ ఇన్నింగ్స్‌లో మిచెల్ ఈ ఘనతకు చేరువయ్యాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఆండ్రూ జోన్స్ పేరిట ఉంది. అతడు 1991 ఫిబ్రవరిలో 52వ ఇన్నింగ్స్‌లో 2,000 రన్స్ సాధించాడు. 2014లో ఆ జట్టు మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ 54 ఇన్నింగ్స్‌ల్లో 2 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. అంతర్జాతీయంగా చూస్తే.. తక్కువ ఇన్నింగ్స్‌ల్లో 2%ఖ% క్లబ్‌లో చేరిన ఎనిమిదో ఆటగాడిగా మిచెల్ రికార్డు లిఖించాడు. టాప్‌లో శుభ్‌మన్ గిల్.. వన్డే క్రికెట్‌లో వేగంగా 2వేల పరుగులు సాధించిన బ్యాటర్లు చాలామందే ఉన్నారు. అయితే.. ఈ జాబితాలో భారత జట్టు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానంలో నిలిచాడు. రెండేళ్ల క్రితం సెంచరీల మీద సెంచరీలు బాదిన గిల్ 38 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మైలురాయికి చేరుకున్నాడు. 40 ఇన్నింగ్స్‌ల్లో 2వేల క్లబ్‌లో చేరిన దక్షిణాఫ్రికా వెటరన్ హాషీమ్ ఆమ్లా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. పాకిస్థాన్ ఆటగాడు జహీర్ అబ్బాస్, ఇంగ్లండ్ మాజీ సారథి కెవిన్ పీటర్సన్, పాక్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజంలు.. 45 ఇన్నింగ్స్‌ల్లో 2 వేల పరుగులు సాధించారు.



## 15 ఏండ్ల తర్వాత.. చెన్నైలో చెన్నైపై ఢిల్లీ విజయం

### మెరిసిన కేఎల్ రాహుల్.. విజయ్ శంకర్ పోరాటం వృథా


ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపు ధమాకా కొనసాగుతున్నది. గత సీజన్లకు భిన్నంగా నిలకడ ప్రదర్శిస్తూ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతున్నది. చెన్నై సూపర్‌కింగ్స్‌ను వారి సొంత ఇలాఖాలో మట్టికరిపించిన ఢిల్లీ హ్యాట్రిక్ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. తద్వారా 15 ఏండ్ల తర్వాత చెన్నైలో చెన్నైని ఢిల్లీ ఓడించి తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకుంది. కేఎల్ రాహుల్, ఇషాన్ పోరెల్ విజృంభణతో పోరాడే స్కోరు అందుకున్న ఢిల్లీ..చెన్నైని కట్టడి చేయడంలో సఫలమైంది. భారీ ఆశల మధ్య బరిలోకి దిగిన ధోనీ..మరోమారు అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాడు. చెన్నై: ఢిల్లీ క్యాపిటల్స్ సుదీర్ఘ కల సాకారమైంది. ఏండ్లుగా కొరకరాని కొయ్యగా మారిన చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఎట్టకేలకు ఢిల్లీ చెక్ పెట్టింది. శనివారం చెపాక్‌లో జరిగిన పోరులో ఢిల్లీ 25 పరుగుల తేడాతో చెన్నైపై విజయం సాధించింది. 2010 తర్వాత చెపాక్‌లో చెన్నైపై ఢిల్లీకి ఇదే తొలి విజయం కావడం విశేషం. తొలుత కేఎల్ రాహుల్(51 బంతుల్లో 77, 6ఫోర్లు, 3సిక్స్‌లు) సాధికారిక ఇన్నింగ్స్‌కు తోడు ఇషాన్ పోరెల్(33) ఇన్నింగ్స్‌తో ఢిల్లీ 20 ఓవర్లలో 183/6 స్కోరు చేసింది. ఖలీల్ అహ్మద్(2/25) రెండు వికెట్లు తీశాడు. లక్ష్యఛేదనకు దిగిన చెన్నై 20 ఓవర్లలో 158/5 స్కోరు చేసింది. టాపార్డర్ ఘోరంగా విఫలం కాగా, విజయ్ శంకర్(54 బంతుల్లో 69 నాటౌట్, 5ఫోర్లు, సిక్స్) అజేయ అర్ధసెంచరీతో పోరాడినా లాభం లేకపోయింది. ఆఖర్లో ధోనీ(26 బంతుల్లో 30 నాటౌట్, ఫోర్, సిక్స్) మెరుపులు మెరిపించడంలో విఫలమయ్యాడు. విప్రాజ్ నిగమ్(2/27) రెండు వికెట్లు తీశాడు. రాహుల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఈ సీజన్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచిన ఢిల్లీ అజేయంగా దూసుకెళుతున్నది. రాహుల్ రాణించగా: ఢిల్లీకి ఆదిలోనే ఓపెనర్ జేక్ ఫ్రేజర్(0) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. ఖలీల్ అహ్మద్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ ఆఖరి బంతికి ఫ్రేజర్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత ఇన్నింగ్స్ బాధ్యతను రాహుల్, పోరెల్ పంచుకున్నారు. మంచి ఫామ్‌మీదున్న రాహుల్..చెన్నై బౌలింగ్ దీటుగా తిప్పికొడుతూ అద్భుతమైన షాట్లతో అలరించాడు. ఇన్నింగ్స్ గాడిలో పడుతుందన్న తరుణంలో పోరెల్‌ను జడేజా ఔట్ చేయడంతో రెండో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆఖర్లో స్టబ్స్(12 బంతుల్లో 24 నాటౌట్, 2ఫోర్లు, సిక్స్) విజృంభణతో ఢిల్లీ మెరుగైన స్కోరు అందుకుంది. చెన్నై పడుతూ లేస్తూ: లక్ష్యఛేదనలో చెన్నై ఇన్నింగ్స్ పడుతూ లేస్తూ సాగింది. టాప్-3 బ్యాటర్లు రవీంద్ర(3), కాన్వె(13), కెప్టెన్ రుతురాజ్(5) ఘోరంగా విఫలమయ్యారు. దీంతో 41 పరుగులకే చెన్నై 3 కీలక వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో శంక ర్ ఒంటరిపోరాటం చేసినా లాభం లేకపోయిం ది. ధోనీ మెరుపులు మెరిపించలేకపోయాడు. మ్యాచ్‌కు ధోనీ తల్లిదండ్రులు చెన్నై సూపర్‌కింగ్స్ దిగ్గజ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ తల్లిదండ్రులు తొలిసారి ఐపీఎల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. శనివారం ఢిల్లీతో చెపాక్‌లో జరిగిన పోరుకు దేవికాదేవి, పాన్‌సింగ్ హాజరయ్యారు. వీరితో పాటు ధోనీ భార్య సాక్షి, కూతురు జివా కూడా స్టాండ్స్‌లో కనిపించారు. తల్లిదండ్రులు మ్యాచ్‌కు రావడంపై ధోనీ రిటైర్మెంట్‌పై మళ్లీ ఊహాగానాలు మొదలయ్యాయి. ఐపీఎల్‌కు ఇక వీడ్కోలు పలికేందుకు ధోనీ సిద్ధమయ్యాడంటూ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

## ధోనీ రిటైర్మెంట్‌పై స్పందించిన సీఎస్‌కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్..!

ఐపీఎల్ 2025లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా మూడోసారి ఓటమిపాలైంది. 25 పరుగుల తేడాతో సీఎస్‌కేని ఓడించింది. ఈ మ్యాచ్ తర్వాత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ గురించే ఎక్కువగా చర్చ సాగుతున్నది. 43 ఏళ్ల ధోని ఢిల్లీతో జరిగిన 11వ ఓవర్‌లో ఏడో నంబర్‌కు బ్యాటింగ్‌కు వచ్చాడు. చెన్నై 74 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి విజయానికి 56 బంతుల్లో 110 పరుగులు చేయాల్సింది. అయితే, మహి 26 బంతుల్లో కేవలం 30 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచినా జట్టును గెలిపించలేకపోయాడు. దాంతో ధోనీపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో.. ఆ జట్టు హెడ్‌కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మద్దతుగా నిలిచాడు. ఐపీఎల్‌లో ధోనీ ఇప్పటికే బలంగానే ఆడుతున్నాడని చెప్పాడు. చెన్నై సూపర్ కింగ్స్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో శనివారం చెపాక్ స్టేడియంలో ధోనీ తల్లిదండ్రులు కనిపించడంతో రిటైర్మెంట్‌పై ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. రిటైర్మెంట్ వ్యాఖ్యలను ఫ్లెమింగ్ సైతం ఖండించాడు. ధోనీ క్రికెట్‌కు వీడ్కోలు పలుకవడం లేదని.. ఇప్పటికీ ధోనీ అద్భుతంగా ఆడుతున్నాడని.. అతని భవిష్యత్‌పై మాట్లాడడం మానేశామని పేర్కొన్నారు. ఇంతకు ముందు ధోనీ తొమ్మిదో నంబర్‌లో పంపడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. శనివారం మ్యాచ్‌లో ఏడో నెంబర్‌లో బ్యాటింగ్‌కు రాగా.. గతంలో బ్యాటింగ్ చేయలేకపోయాడు. వరుసగా మూడో ఓటమి నుంచి గట్టెక్కించ లేకపోయాడు. ధోనీని ఫ్లెమింగ్ సమర్థిస్తూ.. ఆ సమయంలో బ్యాటింగ్ చేయడం నిజంగా కష్టమని తెలిపారు. ధోనీ అభిరుచిని ప్రదర్శించారు. క్రీజులోకి వచ్చేసరికి బంతి కాస్త స్లోగా వస్తోందని అనుకుంటున్నానని.. ఫస్ట్ హాఫ్‌లో బావుంటుందన్నారు. విజయ్ శంకర్ తన ఇన్నింగ్స్ సమయంలో టైమింగ్‌ని తిరిగి పొందేందుకేనని.. అక్కడ ఆడటం కచ్చితంగా కష్టమేనని.. ప్రయత్నించినప్పటికీ మ్యాచ్ మా చేతుల్లోంచి జారిపోయిందన్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ సీనియర్ బ్యాట్స్‌మెన్ లోకేష్ రాహుల్ చెన్నైకి చెందిన ఎడమచేతి వాటం మణికట్టు స్పిన్నర్ నూర్ అహ్మద్‌ను లయలోకి రానివ్వలేదని.. దాంతోనే తమ జట్టు విజయంలో పెద్ద పాత్ర పోషించిందని ఢిల్లీ ప్రధాన కోచ్ హేమంగ్ బదానీ తెలిపాడు.








## ఐపీఎల్ పాయింట్ల పట్టికలో అట్టడుగున మాజీ చాంపియన్స్..!

ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో డీసీ..!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో భాగంగా శనివారం రెండు మ్యాచులు జరిగాయి. ఈ రెండు మ్యాచులు దాదాపు ఏకపక్షంగానే సాగాయి. తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ ఓడించింది. ఇక రెండో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌ను రాజస్థాన్ రాయల్స్ మట్టికరిపించింది. రెండు మ్యాచుల తర్వాత పాయింట్ల పట్టికలో భారీగానే మార్పులు జరిగాయి. రాజస్థాన్‌పై ఓటమితో పంజాబ్ జట్టు పాయింట్ల పట్టికలో మూడు స్థానాలు దిగజారింది. మాజీ చాంపియన్స్ జట్లు పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరాయి. ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌పై ఓసారి లుక్కేద్దాం రండి..! మూడు విజయాలతో టాప్ ప్లేస్‌లో ఢిల్లీ

ఢిల్లీపై చెన్నై 25 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఇది ఢిల్లీకి వరుసగా మూడో విజయం. ఆరు పాయింట్లు, ం1.257 నికర రన్ రేట్‌తో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఐదుసార్లు ఛాంపియన్‌గా చెన్నై జట్టు రెండు పాయింట్లతో టేబుల్‌లో తొమ్మిదో స్థానంలో ఉన్నది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో రెండు పాయింట్లు, రన్‌రేట్ -0.891గా ఉన్నది. పంజాబ్‌పై విజయంతో రాజస్థాన్ సైతం పాయింట్ల పట్టికలో పైకి చేరింది. ఇప్పటి వరకు నాలుగు మ్యాచులు ఆడిన ఆ జట్టు రెండు విజయాలు, రెండు ఓటములతో ఏడో స్థానంలో ఉంది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో నాలుగు పాయింట్లు, -0.185 రన్‌రేట్ ఉన్నది. ఇక పంజాబ్ జట్టు మూడు స్థానాలు కోల్పోయింది. ఢిల్లీ-చెన్నై మ్యాచ్ తర్వాత, పంజాబ్ కింగ్స్ మొదటి స్థానం నుంచి నాలుగో స్థానానికి చేరుకుంది. పంజాబ్ మూడు మ్యాచులు ఉండగా.. రెండు విజయాలతో నాలుగు పాయింట్లు, ం0.074 రన్‌రేట్‌గా ఉన్నది.

రెండోస్థానంలో ఆర్‌సీబీ.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, నాలుగు పాయింట్లతో రెండవ స్థానంలో ఉంది. ప్రస్తుతం ఆ జట్టు రన్‌రేట్ ం1.149గా ఉన్నది. గుజరాత్ టైటాన్స్ మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, ఒక ఓటమితో మూడో స్థానంలో ఉండగా.. రన్ రేట్ ం0.807గా ఉన్నది. ఆ తర్వాత స్థానంలో పంజాబ్ ఉన్నది. కోల్‌కతా నైట్ రైడర్స్ ఐదోస్థానంలో ఉంది. కేకేఆర్ నాలుగు మ్యాచ్‌ల్లో రెండు గెలిచి రెండు ఓడిపోయింది. నాలుగు పాయింట్లు, నెట్ రన్ రేట్ ం0.070 వద్ద ఉన్నది. లక్నో నాలుగు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, రెండు ఓటములతో ఆరో స్థానంలో ఉండగా.. నాలుగు పాయింట్లు, నెట్ రన్ రేట్ ం0.048గా ఉన్నది.

పాయింట్ల పట్టికలో అట్టడుగున మాజీ చాంపియన్స్.. ఐపీఎల్‌లో నాలుగు మాజీ ఛాంపియన్ జట్లు చివరి స్థానాల్లో నిలిచాయి. రాజస్థాన్ ఏడో స్థానంలో, ముంబై ఇండియన్స్ ఎనిమిదవ స్థానంలో ఉన్నాయి. ముంబయి నాలుగు మ్యాచుల్లో ఒక మ్యాచ్ గెలిచి మూడు ఓటములు, రెండు పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది. రన్ రేట్ ం0.108గా ఉన్నది. అదే సమయంలో చెన్నై సూపర్ కింగ్స్ తొమ్మిదవ స్థానంలో.. సన్‌రైజర్స్ హైదరాబాద్ 10వ స్థానంలో ఉన్నాయి. సన్‌రైజర్స్ ఇప్పటివరకు నాలుగు మ్యాచుల్లో ఒక మ్యాచ్ గెలిచింది. మూడు మ్యాచ్‌లలో ఓడిపోయింది. ఆ జట్టు రెండు పాయింట్లు, -1.612 నికర రన్ రేట్‌తో చివరి స్థానంలో ఉంది.

ఆరెంజ్ క్యాప్ రేసులో పురాన్ ముందంజ..

ఐపీఎల్ 2025లో ఏప్రిల్ 5 వరకు జరిగిన మ్యాచ్‌ల తర్వాత.. లక్నో సూపర్ జెయింట్స్ బ్యాట్స్‌మన్ నికోలస్ పురాన్ ఆరెంజ్ క్యాప్ రేసులో ముందంజలో ఉన్నాడు. పురాన్ నాలుగు మ్యాచ్‌ల్లో 218.48 స్ట్రయిక్ రేట్‌తో 201 పరుగులు చేశాడు. గుజరాత్ టైటాన్స్‌కు చెందిన సాయి సుదర్శన్ రెండో స్థానంలో ఉన్నాడు. మూడు ఇన్నింగ్స్‌లలో 62 సగటు, 157.63 స్ట్రయిక్ రేట్‌తో 186 పరుగులు చేశాడు. లక్నో సూపర్ జెయింట్స్‌కు చెందిన మిచెల్ మార్ష్ మూడవ స్థానంలో ఉండగా.. నాలుగు ఇన్నింగ్స్‌లలో 46 సగటు.. 185.86 స్ట్రయిక్ రేట్‌తో 184 పరుగులు చేశాడు. ముంబయికి చెందిన సూర్యకుమార్ యాదవ్ నాల్గవ ప్లేస్‌లో ఉన్నాడు. సూర్యకుమార్ నాలుగు ఇన్నింగ్స్‌లలో 57 సగటు, 161.32 స్ట్రయిక్ రేట్‌తో రేట్‌తో 171 పరుగులు చేశాడు.

పర్పుల్ క్యాప్‌లో నూర్ అహ్మద్

చెన్నై సూపర్ కింగ్స్ స్పిన్నర్ నూర్ అహ్మద్ ప్రస్తుతం పర్పుల్ క్యాప్ రేసులో ముందున్నాడు. నూర్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లలో పది వికెట్లు పడగొట్టాడు. రెండవ స్థానంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ మూడు మ్యాచ్‌లలో తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్యా, చెన్నైకి చెందిన ఖలీల్ అహ్మద్ ఉన్నారు. ఇద్దరూ చెరో ఎనిమిది వికెట్లు పడగొట్టారు. లక్నో నుంచి ఆడుతున్న శార్దూల్ ఏడు వికెట్లతో ఐదోస్థానంలో ఉన్నాడు.

# విశ్వజి



## ఎండాకాలం ఫ్రిడ్జ్‌లో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ పెట్టేవారికి షాకింగ్ న్యూస్..

### వారికైతే మరణం గ్యారెంటీ!

ఈ రోజుల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వాడకం విపరీతంగా పెరిగింది. సీసా బాటిళ్లతో కూడిన వాటర్ బాటిళ్లు మార్కెట్లో చాలా రకాలుగా అందుబాటులో ఉన్నప్పటికీ, ఎక్కువమందీ ఇంట్లో ఫ్రిజ్‌లో ప్లాస్టిక్ బాటిళ్లనే ఎక్కువగా వాడతారు. దీనికి కారణం, సీసా బాటిళ్లను తీసుకోవడం చాలా ఖరీదైనది. అలాగే వాటిని తీసుకున్న తరువాత కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే అవి పగిలిపోతాయి. కానీ ప్లాస్టిక్ బాటిళ్ల ధర చౌకగా ఉంటుంది. కింద పడ్డ కూడా అంత సులభంగా పగలవు. అందుకే ఎక్కువ మంది వీటిని వినియోగించడానికి ట్రై చేస్తుంటారు. కానీ ఈ ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం కొన్ని ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తుంది. అవి మన ఆరోగ్యంపై ప్రతికూలమైన ప్రభావాన్ని చూపిస్తాయి. అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం రండి. ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం వల్ల వచ్చే ప్రమాదాలు ప్లాస్టిక్ బాటిళ్లను ప్రస్తుత కాలంలో ఎన్నో రసాయనాలు వాడి తయారు చేస్తున్నారు. వాటి మనం ప్రతిరోజూ వాడే విధానం, వాటిలోని రసాయనాలు కరిగి మన శరీరంలోకి చేరే అవకాశం ఉంటుంది. అలాగే అందులోని బ్యాక్టీరియా, ప్రమాదకరమైన ప్లాస్టిక్ కణాలు అంతా మన శరీరంలోకి చేరి.. ప్రమాదకరమైన క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడే అవకాశాన్ని సృష్టిస్తాయి. అందుకే ప్లాస్టిక్ బాటిళ్లను వాడడం అనేది అత్యంత జాగ్రత్తగా చేయాల్సిన ప్రక్రియ. ఈ రెండు తప్పులు చేయకుండా ఉంటే, మట్టి కుండలోని నీళ్లు చల్లగా మారుతాయి!" ప్లాస్టిక్ బాటిళ్లను వాడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: బాటిళ్లను తరచూ మార్చడం: ఫ్రిజ్‌లోని ప్లాస్టిక్ బాటిళ్లను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. ఒకే బాటిల్‌ను చాలా కాలం వాడడం వల్ల, అది మురికితో నిండిపోతుంది. అలాగే అందులో బక్టీరియా పెరుగుతుంది. అలాగే, ప్లాస్టిక్ బాటిళ్లలోని రసాయనాలు నీటిలోకి లీక్ అవటం వల్ల.. అందులోని ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు శరీరంలోకి ప్రవేశించవచ్చు. "తరచుగా శృంగారంలో పాల్గొంటే ఈ అరుదైన వ్యాధి వస్తుందట.. లక్షణాలు ఎలా ఉంటాయంటే?" ఎన్ని రోజుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు మార్చాలంటే సాధారణంగా, ప్లాస్టిక్ బాటిళ్లను 6 నెలలలోపు మార్చడం మంచిది. కొన్ని అధిక నాణ్యత కలిగిన ప్లాస్టిక్ బాటిళ్లు 12 నెలల వరకు వాడొచ్చు. అయితే, బాటిల్ పగిలిపోయినట్లయితే, దుర్వాసన వచ్చిందని గమనిస్తే వెంటనే మార్చాలి. గ్లాస్ మరియు స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు గ్లాస్ వాటర్ బాటిళు ,, సాధారణంగా, 2-3 సంవత్సరాల పాటు ఉపయోగించవచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు కూడా 2 సంవత్సరాల తర్వాత కచ్చితంగా మార్చాల్సిన అవసరమైతే ఉంటుంది. ఇవి స్థిరమైన పదార్థాలతో తయారు కావడంతో పాటు తొందరగా పాడవకపోవడంతో వాటిని ఎక్కువగా కాలం వినియోగించుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రతిరోజూ శుభ్రం చేయడం బాటిళ్లను సరైన పద్ధతిలో శుభ్రం చేయడం చాలా ముఖ్యం. ప్రతి రోజు వాటిని వేడి నీటి మరియు సబ్బుతో శుభ్రం చేయడం వల్ల అందులో బక్టీరియా పెరుగుదలను నివారించవచ్చు. శుభ్రతను పాటించడం వలన బాటిల్ శుభ్రంగా ఉండడంతో పాటు అందులో పోసే నీరు కూడా పరిశుభ్రంగా ఉంటుంది. ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయాలు: గ్లాస్ బాటిళ్లు: గ్లాస్ బాటిళ్లను ఉపయోగించడం చాలా మంచి ప్రత్యామ్నాయం. ఇవి లీకేజి సమస్య లేకుండా, ఆరోగ్యానికి ప్రమాదకరం కాని పదార్థాలను విడుదల చేయవు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు: ఇవి కూడా మంచి ఆప్షన్. ఇవి దృఢంగా ఉండి, ఎక్కువ కాలం వాడటానికి సరైనవి. ఇవి పగిలిపోవడం లేదా లీక్ అవడం చాలా అరుదు. తగిన జాగ్రత్తలు ప్లాస్టిక్ బాటిళ్లలో నీటి నిల్వ చేయడానికి, మంచి నాణ్యత కలిగిన బాటిళ్లను మాత్రమే తీసుకోవడం మంచిది. బాటిళ్లను మూసివేసి ఉంచుకోవడం వల్ల బయట జంతువులు, ధూళి, కురుపులు వాటిలో చేరకుండా ఉంటాయి. సీసా లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లలోనే నీటి నిల్వ చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

## రంగురంగుల ఆహారాలతో ఆరోగ్యం పదిలం..!

మనం తినే ఆహారంలో వివిధ రకాల పోషకాలు సమతుల్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా జీవించగలుగుతాం. అందుకే పోషకాహార నిపుణులు మనం తినే ఆహారంలో అన్ని రంగుల్లోని పండ్లు, కూరగాయలు ఉండాలంటున్నారు. ముఖ్యంగా రెయిన్‌బో(ఇంద్ర ధనుస్సు) డైట్ ఫాలో అవ్వాలని చెబుతున్నారు. ఏంటీది అనేకదా..!. ఏం లేదండీ ఇంద్రధనుస్సులోని ఏడు రంగుల్లో ఉండే కూరగాయాలు, పండ్లు తీసుకుంటే అన్ని రకాల పోషకాలు శరీరానికి అందడమే గాక చక్కటి ఆరోగ్యం కూడా మన సొంతం అవుతుందని చెబుతున్నారు. ఈ డైట్ వల్ల జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చని అంటున్నారు. అలాంటి ఈ రెయిన్‌బో డైట్‌లో రంగుల వారీగా ఉండే కూరగాయాలు, పండ్లు వర్గీకరణ, వాటి ప్రయోజనాలు గురించి సవివరంగా తెలుసుకుందామా..! ఇంద్రధనుస్సులో ఏడు రంగులు ఉంటాయని మనకు తెలుసు. అలాగే రెయిన్‌బో డైట్ అంటే ఎరుపు, పసుపు, ఊదా, ఆకుపచ్చ, నారింజ వంటి వివిధ రంగుల్లో పండ్లు, కూరగాయలను కలిగి ఉంటుంది. అందులోని ప్రతి రంగుతో కూడిన కూరగాయాలు, పండ్లు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అవేంటో చూద్దామా..! రెడ్ ఫుడ్స్: ఇవి లైకోపీన్ వంటి యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. అందువల్ల ఇవి గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహించడమే గాక కేన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఈ రంగు కూరగాయలు, పండ్లు ప్రోస్టేట్, మూత్ర నాళం, డీఎన్ఏ ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి. అందువల్ల ఎరుపు రంగులో ఉండే యాపిల్స్, చెర్రీస్, నారింజ, బెర్రీలు, పుచ్చకాయలు, ఎర్ర ద్రాక్ష, బీట్‌రూట్‌లు, టమోటాలు మొదలైనవి తప్పక తినమని నిపుణులు చెబుతున్నారు. గ్రీన్ ఫుడ్స్: క్లోరోఫిల్ పుష్కలంగా ఉండటం వల్ల అవి శరీరాన్ని నిర్విషీకరణ చేసి జీర్ణక్రియకు తోడ్పడతాయి. అలాగే శరీరానికి కావాల్సిన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఈ ఆహారాలు కంటి, ఊపిరితిత్తులు, కాలేయం, కణాల ఆరోగ్యానికి తోడ్పడతాయి. త్వరగా గాయాలు నయం అవ్వడంలో, చిగుళ్ల ఆరోగ్యంలో సహాయపడతాయి.

## మైగ్రేన్ తలనొప్పి వేధిస్తుందా?

# అయితే ఈ జాగ్రత్తలు తీసుకోండి



మైగ్రేన్ ఇది ఒక విపరీతమైన తలనొప్పి. మైగ్రేన్ తో బాధ పడేవారు మరే ఇతర పనులపైనా ఫోకస్ పెట్టి పని చెయ్యలేరు. అసలు మైగ్రేన్ తలనొప్పి ఎందుకు వస్తుంది? మైగ్రేన్ తలనొప్పి సాధారణంగా ఒకవైపున గుచ్చుకున్నట్టు, కొట్టుకున్నట్టు ఒక రకమైన బాధను కలిగిస్తూ వచ్చే తలనొప్పి. ఏదైనా కాంతిని చూసినా, శబ్దాన్ని విన్నా భరించలేని సున్నితత్వం తో కూడిన తలనొప్పి. వికారం, వాంతులు వంటి లక్షణాలతో కూడినటువంటి తలనొప్పి. మైగ్రేన్ తలనొప్పికి కారణాలు ఎన్నో మైగ్రేన్ తలనొప్పి తో బాధపడే వారికి కళ్ళ చుట్టూ నొప్పి, దృష్టిలో మార్పులు కూడా చోటు చేసుకుంటాయి. ఒత్తిడి వల్ల, నిద్రలేమి సమస్యల వల్ల, హార్మోన్లలో జరిగే మార్పుల వల్ల, జన్యుపరమైన అంశాల వల్ల కూడా మైగ్రేన్ వచ్చే అవకాశం ఉంది. మైగ్రేన్ రావడానికి ఇది అని పర్టిక్యులర్ గా కారణాన్ని చెప్పలేము. మైగ్రేన్ దీర్ఘకాలంగా ఉంటే, అది మానసిక ఒత్తిడిని పెంచి పనిసామర్థ్యాన్ని తగ్గిస్తుంది. మైగ్రేన్ నియంత్రించకపోతే నరాల సమస్యగా మారే అవకాశం దీర్ఘకాలిక మైగ్రేన్ గల వ్యక్తులు తరచుగా మానసిక, శారీరక అనారోగ్యానికి గురవుతారు. మైగ్రేన్ నియంత్రించకపోతే, అది నరాల సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉంటుంది. ఈ తలనొప్పికి తగినంత నీరు తాగకపోవడం, అనారోగ్యకరమైన ఆహారం, మితిమీరిన కాఫీ లేదా ఆల్కహాల్ తీసుకోవడం వంటి అనేక కారణాలు కూడా ఉంటాయి. స్మోకింగ్, బహుళ రకాల రసాయనాలతో తయారైన ప్రాసెస్డ్ ఫుడ్ కూడా మైగ్రేన్ తలనొప్పికి కారణం అవుతుంది. ఆహారపు జాగ్రత్తలు మైగ్రేన్ ఉన్నవారు గ్లుటెన్, ప్రాసెస్డ్ ఫుడ్, ఆల్కహాల్, కాఫీ, చాక్లెట్, ఎక్కువ ఉప్పు, కారంగా ఉండే ఆహారం ఎక్కువ తినకూడదు. బదులుగా ఆకుకూరలు, పండ్లు,కూరగాయలు తీసుకోవాలి తగినంత నీరు, పొటాషియం అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం మంచిది. తరచుగా ఆహారాన్ని మానేయకుండా ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్ ,అలాగే రాత్రికి పళ్ళు తింటే మైగ్రేన్‌ను తగ్గించే అవకాశం ఉంది. మైగ్రేన్ నివారణ మార్గాలు నియంత్రిత జీవనశైలి, ఆరోగ్యకరమైన ఆహారం, సమయానికి నిద్రపోవడం, ఒత్తిడిని తగ్గించడం వంటి మార్పులు మైగ్రేన్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. ప్రతిరోజూ యోగాసనాలు, ధ్యానం చేయడం వల్ల మైగ్రేన్ తీవ్రత తగ్గే అవకాశం ఉంది. ఎక్కువ నీరు తాగడం,తొందరగా జీర్ణం అయ్యే తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిది , రాత్రి సమయంలో ఆలస్యం చేయకుండా తొందరగా భోజనం చేసే తగినంత విశ్రాంతి తీసుకోవడం కూడా మైగ్రేన్ ను తగ్గించడానికి దోహదం చేస్తుంది.

## లెమన్‌గ్రాస్ టీతో ఎన్ని లాభాలో తెలుసా..!



మనం ఎన్నో రకాల టీల గురించి విన్నాం. వాటిలో కొన్ని ఆరోగ్యకరమైన గ్రీన్ టీ వంటి పలు పానీయాలు గురించి కూడా విన్నారు. అలాంటి కోవకు చెందిన నిమ్మగడ్డి టీ గురించి విన్నారా. దీని వల్ల కూడా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబతున్నారు నిపుణులు. జీర్ణక్రియ దగ్గర నుంచి బరువు తగ్గడం, రోగ నిరోధక శక్తి వరకు ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందించగలదు ఈ టీ. అలాంటి ఈ లెమన్‌గ్రాస్ టీని ఎలా తయారు చేస్తారు? దీని వల్ల కలిగే లాభలేంటో సవివరంగా తెలుసుకుందామా..! లెమన్ గ్రాస్ టీ తయారీ విధానం..కావాల్సినవి:నీళ్లు: నాలుగు కప్పులు, నిమ్మగడ్డి: మూడు కాడలు (పచ్చివి), తేనె: మూడు చెంచాలు (బెల్లం కూడా వేసుకోవచ్చు) తయారీ: ముందుగా గిన్నెలో నీళ్లు పోసి స్టౌ మీద ఉంచి బాగా మరిగించుకోవాలి. అందులో నిమ్మగడ్డి వేసి మరో పది నిమిషాలు మరిగించి, ఆవిరి బయటికి రాకుండా మూతపెట్టేయాలి. కప్పులో తేనె వేసుకొని, తేనీటిని అందులోకి వడకట్టుకోవాలి. చక్కటి పరిమళంతో పసందైన నిమ్మగడ్డి టీ రెడీ!. మధుమేగ్రస్తులు బెల్లం ఉపయోగించొచ్చు లేదా వేయకుండా తీసుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాలు..దీనిలో ఉండే సిట్రల్ జెరేనియల్ గుండె జబ్బులు, స్ట్రోక్‌లు వంటివి రాకుండా కాపాడుతుంది. యాంటీ కేన్సర్ సామర్థ్యాలను కలిగి ఉంది. లెమన్ గ్రాస్‌లో ఉండే ఔషధ గుణాలు కేన్సర్‌తో పోరాడటంలో సహాయపడతాయి. సెల్ డెత్‌కు కారణమయ్యే వాటిని నివారించేలా రోగ నిరోధక శక్తిని పెంచి కేన్సర్‌తో పోరాడగలిగే శక్తిని ఇస్తుంది. గ్యాస్ట్రిక్ అల్సర్లకు వ్యతిరేకంగా ప్రభావవంతంగా ఉంటుంది. రక్తపోటుని తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేగాదు ఇందులో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల నిమ్మరసం మూత్ర ఉత్పత్తిని పెంచి రక్తపోటును తగ్గిస్తుంది.కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడుతుందిబరువు తగ్గడంలో సహాయపడుతుంది, జీవక్రియను నియంత్రిస్తుంది. శరీరం నుంచి అదనపు వ్యర్థాలను తొలగించి జీవక్రియను వేగవంతం చేస్తుంది. రుతుక్రమంలో ఎదురయ్యే అధిక రక్తస్రావం వంటి అసౌకర్యాలను తగ్గిస్తుంది. ఇది ఎంత సురక్షితమైనదైనప్పటికీ అతిగా తాగితే దుష్ప్రభావాలను ఎదుర్కొనక తప్పదు. అవేంటంటే..తల తిరగడం, ఆకలి పెరగటం, నోరు పొడిబారడం, తరుచుగా మూత్రవిసర్జన, అలసట, దద్దుర్లు, దురద, శ్వాస ఆడకపోవడం, వేగవంతమైన హృదయ స్పందన వంటి అలర్జీలు వచ్చే అవకాశాలు ఉంటాయి. ఒకవేళ గర్భవతిగా ఉన్నట్లయితే, వాళ్లలో తక్కువ హృదయ స్పందన రేటు లేదా తక్కువ పొటాషియం స్థాయిని కలిగి ఉంటే ఎట్టిపరిస్థితుల్లో లెమన్‌గ్రాస్ టీని తాగకూడదు.

### రాజసాన్ని ఒలకబోస్తున్న క్రిస్టల్.. మార్బుల్ టీ పాట్ సెట్లు

నూరిన పచ్చడి తీసి పెట్టాలన్నా, పులుసు కాచిపెట్టాలన్నా ఒకప్పుడు రాతిచిప్ప ఉండేది. గల్లుప్పు ఇల్లూ అదే. ఈ తరం మరిచిపోయిన ఆ రాతి వస్తువు తరహాలోనే క్రిస్టల్, మార్బుల్ టీ పాట్ సెట్లు వస్తున్నాయిప్పుడు. రకరకాల రాళ్లతో చేసిన ఇవి రంగుల్లో, ఆకర్షణీయంగా కనిపించడమే కాదు%ో% ఘనంగా రాజసాన్నీ ఒలకబోస్తున్నాయి. వీటిలో టీ తాగడం మనసుకు ఉత్సాహాన్నే కాదు, సాంత్వననీ ఇస్తుందని నమ్మేవాళ్లూ ఉన్నారు. ఆ సంగతులేంటో మనమూ చూద్దాం. కొత్తతరం ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకుంటూనే ఉంటుంది. అయితే నేల విడిచి సాము చేయకుండా, పాత కొత్తల మేళవింపుగా ముందుకు వెళ్లడం అన్నది ఇంటీరియర్ నుంచి ఇంట్లో వస్తువుల దాకా అన్నింటా ట్రెండుగా మారింది. ఆ కోవలోనే క్రిస్టల్, మార్బుల్ టీ పాట్ సెట్‌లని చెప్పుకోవచ్చు. సహజ రాళ్లతో తయారైన ఇవి మామూలు పింగాణీ కప్పులతో పోలిస్తే చూసేందుకు భిన్నంగా, అందంగా కనిపిస్తాయి. నేలలో దొరికే విభిన్న రంగుల రాళ్లూ, ఉపరత్నాలతో ఈ టీ పాట్‌లు, కప్పు సాసర్ సెట్‌లను తయారు చేస్తున్నారు. తెలుపు, లేత గులాబీ మొదలు నారింజ, నీలంలాంటి నిండైన రంగుల దాకా ఉంటున్నాయిందులో. రాయి అంతా గీతలు ఉన్నట్టు కనిపించి, వివిధ వర్ణాల్లో దొరికే ఒక రకం సహజ రాయి ఆనిక్స్ కూడా ఈ కోవలో ఉంది. అంతేకాదు, క్వార్ట్ క్రిస్టల్లతోనూ, గ్రీన్ మార్బుల్‌తోనూ కూడా ఈ టీ సెట్లను తయారు చేస్తున్నారు.

# బీ గుడ్.. డూ గుడ్!

మనదేశంలో ఏడాదికి 9,400 టన్నుల ప్లాస్టిక్ వేస్ట్ కాలువలు, నదుల్లోకి చేరుతోంది. ఇందులో ఎక్కువ భాగం ప్యాకింగ్‌కు ఉపయోగించినదే ఉంటోంది. ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నాం. ఓ చిన్న హెయిర్ ఆయిల్ బాటిల్‌ని ప్యాక్ చేయడానికి దానికంటే నాలుగురెట్లు బరువున్న ప్యాకింగ్ మెటీరియల్‌ని ఉపయోగిస్తారు. అందులో కాగితంతో చేసిన అట్టపెట్టె ఉంటుంది. బాటిల్ పగలకుండా ప్లాస్టిక్ బబుల్ రేపర్ ఉంటుంది. కాగితం ఇట్టే మట్టిలో కలిసిపోతుంది. దాంతో ఇబ్బంది ఉండదు. మరి ప్లాస్టిక్ బబుల్ ర్యాపర్ ఎన్నేళ్లకు మట్టిలో కలుస్తుంది. 'వస్తువులు రవాణాలో పగలకుండా ఉండాలంటే బబుల్ ర్యాపర్ ప్లాస్లిక్‌తోనే చేయాలా? కొబ్బరిపీచుతో బబుల్ ర్యాప్ చేసాను చూడండి' అంటూ కుషన్‌ను పోలిన కాయిర్ పౌచ్‌ను చూపించింది ఖుష్బూ గాంధీ. అలాగే కాయిర్ బోర్డ్‌లో ఒక పొరలోకి గాలిని చొప్పించి బుడగలు తెప్పించింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఖుష్బూ గాంధీ నిఫ్ట్‌లో మెటీరియల్ డెవలప్‌మెంట్ కోర్సు చేసింది.'గో డూ గుడ్' స్టార్టప్ ద్వారా ఎకో ఫ్రెండ్లీ ప్యాకింగ్ మెటీరియల్‌ని తయారు చేస్తోంది. ప్లాస్టిక్‌కి వ్యతిరేకంగా తనదైన శైలిలో ఉద్యమిస్తోన్న ఖుష్బూ... 'ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి' అని మైకులో గొంతుచించుకుంటే సరిపోదు, ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయం చూపిస్తే ఆటోమేటిగ్గా ప్లాస్టిక్‌ని దూరం పెట్టేస్తారు' అంటోంది. ఇంకా...'నా ప్రయోగాలు నాకు లాభాలను తెచ్చిపెడతాయో లేదో తెలియదు, కానీ సస్టెయినబుల్ లైఫ్ స్టయిల్ వైపు సమాజాన్ని నడిపించడంలో మాత్రం విజయవంతం అవుతాను' అంటోంది ఖుష్బూ గాంధీ. ఎకో ఫ్రెండ్లీ సిరా! "ప్లాస్టిక్ బబుల్ ర్యాపరే కాదు, పేపర్ మీద ప్రింటింగ్ కోసం ఉపయోగించే ఇంక్ కూడా అంత త్వరగా నేలలో ఇంకదు. పైగా మట్టిని కలుషితం చేస్తుంది. సీ వీడ్ (సముద్ర నాచు), నాచురల్ కలర్ పిగ్మెంట్స్‌తో ఇంకు తయారు చేశాం. ఒకసారి ఉపయోగించి పారేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్‌కు బదులు వ్యవసాయ వ్యర్థాలతో ప్లేట్లు తయారు చేస్తున్నాం. ఇక్కడ మరో విషయం చెప్పాలి. ఒకసారి వాడిపారేసే పేపర్ ప్లేట్‌లు, గ్లాసులకు ల్యామినేషన్‌తో కోటింగ్ వేస్తుంటారు. నేను దానికి కూడా ప్రత్యామ్నాయం కనుక్కున్నాను. ఎకో ఫ్రెండ్లీ కోటింగ్ చేస్తున్నాం. 'గో డూ గుడ్' ద్వారా మేము పది టన్నుల ప్లాస్టిక్ వాడకాన్ని నివారించగలిగాం. అలాగే ఎకో ఫ్రెండ్లీ ఇంక్‌తో ఒకటిన్నర లక్షల ఉత్పత్తులు అక్షరాలద్దుకున్నాయి. ఏడు టన్నుల బయో డీగ్రేడబుల్ బబుల్ ర్యాపర్‌లను వాడుకలోకి తెచ్చాం. ఈ ప్రయత్నంలో ఐదు టన్నుల వ్యవసాయ వ్యర్థాలు వినియోగంలోకి వచ్చాయి. లధాక్‌లో ప్లాస్టిక్ వేస్ట్! నేను ఈ రంగలోకి అడుగు పెట్టడానికి కారణం పదేళ్ల కిందటి లధాక్ పర్యటన. మారుమూల ప్రదేశాలు ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి ఉన్నాయి. షాంపూ సాషే నుంచి లేస్ ర్యాపర్ వరకు అవీ ఇవీ అనే తేడా లేకుండా ప్రతి పదార్థమూ ప్లాస్టిక్‌లోనే ప్యాక్ అవుతోందని నాకు తెలిసిందప్పుడే. ఆ చెత్త కాలువల్లోకి చేరకుండా అంతటినీ ఒకచోట పోగు చేసి తగలబెడుతున్నారు. వాళ్లకు చేతనైన పరిష్కారం అది. ఇంతకంటే పెద్ద పరిష్కారమార్గాన్ని కనుక్కోవాలని అప్పుడు అనిపించింది. ఆ తర్వాత నేను మెటీరియల్ డెవలప్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం స్పెయిన్‌కెళ్లాను. బయోడీగ్రేడబుల్ వస్తువులతో ప్లాస్టిక్‌కి సమాధానం చెప్పవచ్చనే ధైర్యం వచ్చింది. పీజీ పూర్తయి తిరిగి ఇండియాకి రాగానే మా తమ్ముడు, మా వారితో కలిసి పూణేలో నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'గో డూ గుడ్'కు శ్రీకారం చుట్టాను. ఇది విజయవంతంగా నడుస్తోంది" అని వివరించిందామె. ఖుష్బూ పేరుకు తగినట్లు పరిమళభరితంగా తన విజయ ప్రస్థానాన్ని రాసుకుంటోంది. మరి... మనం మన చరిత్రను ఏ సిరాతో రాసుకుందాం... మట్టిని కలుషితం చేసే ఇంకుతోనా లేక మట్టిలో కలిసిపోయే ఇంకుతోనా. మనమే నిర్ణయించుకోవాలి.



# గ్రీన్ హౌస్ దిశగా 'సాగు'దాం!

మన దేశ జనాభా శరవేగంగా పెరుగుతోంది. దీనికి అనుగుణంగా ఆహారోత్పత్తి పెరగవలసిన అవసరం ఉంది. అయితే దేశంలో 90% మంది సాంప్రదాయ వ్యవసాయం చేస్తున్నారు. ఈ సంప్రదాయ వ్యవసాయంలో అనిశ్చిత వర్షాలు, కరువులు, వరదలు, ఇతర వాతావరణ వైపరీత్యాలు వలన పంటలను నాశనం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం వలన పంటల దిగుబడి తగ్గిపోతుంది. వ్యవసాయానికి అవసరమైన నీరు తగ్గిపోవడం వలన పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు తగ్గిపోవడం వలన లోతుగా బోర్లు వేస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులను అధికంగా ఉపయోగించడం వలన నేల సారం తగ్గిపోతుంది. పర్యావరణం కలుషితం అవుతున్నది. నేల కోత వలన, పంటలను తెగుళ్ళు, వ్యాధులు ఆశించడం వలన పంటల దిగుబడి తగ్గిపోతున్నది. కార్మికుల వేతనాలు పెరగడం వలన ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయి. ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు తగినంత అవగాహన ఉండదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వలన దిగుబడి పెరుగుతుందని రైతులకు తెలియదు. ఈ సవాళ్లను అధిగమించడానికి, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి. ఇందులో గ్రీన్ హౌస్ వ్యవసాయం చెప్పుకోదగినది. గ్రీన్‌హౌస్ వ్యవసాయం అంటే నియంత్రిత వాతావరణంలో పంటలను పండించడం. గ్రీన్‌హౌస్‌లు ఉష్ణోగ్రత, తేమ, ఇతర అంశాలను నియంత్రించడానికి సాంకేతికతను ఉపయోగించి ఆదర్శవంతమైన పరిస్థితులను సృష్టించడం. ప్రత్యేకంగా తయారు చేసిన ఒక కట్టడంలో పంటలను పండిస్తారు. ఇది సాధారణంగా గాజు లేదా ప్లాస్టిక్ వంటి పారదర్శక పదార్థాలతో నిర్మించబడి ఉంటుంది. దీని వలన సూర్యరశ్మి లోపలికి ప్రసరించి లోపల వేడిని నిలుపుతుంది. ఈ వేడి వలన మొక్కలు వేగంగా, ఆరోగ్యంగా పెరుగుతాయి. గ్రీన్‌హౌస్ వ్యవసాయ ముఖ్య ఉద్దేశం పంటలకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులను సృష్టించడం. సూర్యుని కాంతి పైకప్పు ద్వారా లోపలికి ప్రవేశించి భూమిని, మొక్కలను వేడి చేస్తుంది. ఈ వేడిని పైకప్పు బయటికి పోకుండా నిరోధించడం వలన లోపల ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఈ ప్రక్రియనే గ్రీన్‌హౌస్ ప్రభావం అంటారు. లోపల ఉష్ణోగ్రత, తేమ, కాంతి, గాలి ప్రసరణ వంటి వాతావరణ పరిస్థితులను నియంత్రించే అవకాశం ఉండడం మూలాన పంటలకు అనుకూలమైన పరిస్థితులను కల్పించి దిగుబడి పెరుగుతుంది. కాలానుగుణ వైవిధ్యాలతో సంబంధం లేకుండా, గ్రీన్‌హౌస్ వ్యవసాయం ఏడాది పొడవునా పంటల సాగును అనుమతిస్తుంది.



నియంత్రిత వాతావరణాన్ని అందించడం ద్వారా గ్రీన్ హౌస్‌లలో మొక్కల పెరుగుదలకు అనువైన పరిస్థితులను నిర్వహించవచ్చు. పెరుగుతున్న కాలాన్ని పొడిగించడం ద్వారా మరింత స్థిరమైన, ఊహించదగిన ఆహార సరఫరా నిర్ధారించబడుతుంది. ఇది వాతావరణ అంతరాయాలకు గురయ్యే అవకాశాన్ని తగ్గిస్తుంది. ఆఫ్-సీజన్‌లో కూడా రైతులు తమ పంటలను వైవిధ్యపరచగల, మార్కెట్ డిమాండ్‌లను తీర్చగల సామర్థ్యం ఫలితంగా మెరుగైన ఆహార భద్రత ఏర్పడుతుంది. ఈ పద్ధతిలో నేలకోతకు గురికాదు. పంటలను తెగుళ్ళు, వ్యాధులు, వాతావరణ వైపరీత్యాల నుండి రక్షించవచ్చు. తక్కువ భూమిలో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. గ్రీన్‌హౌస్ వ్యవసాయం పంట ఉత్పత్తిని పెంచుతుంది. బహిరంగ ప్రదేశంలో పంటలను పండించడం కంటే చదరపు అడుగుకు ఎక్కువ మొక్కలను పెంచవచ్చు. ఇది పంటలకు హాని కలిగించే పక్షులు, ఇతర జంతువుల నుండి పంటలను దూరం ఉంచుతుంది. అధిక విలువైన, వాతావరణ నియంత్రణ అవసరమయ్యే పంటలకు అనుకూలంగా ఉంటుంది. కొన్ని పంటలు గ్రీన్ హౌస్ వాతావరణంలో బాగా పెరుగుతాయి. టమోటాలు, దోసకాయలు, మిరపకాయలు, కరివేపాకు, గులాబీలు, లిల్లీలు, స్ట్రాబెర్రీలు, ద్రాక్ష, పుచ్చకాయలు, ఔషధ మొక్కలు, నారు మొక్కలకు గ్రీన్ హౌస్ వ్యవసాయం మరింత అనుకూలంగా ఉంటుంది. ఎక్కువ నీరు అవసరమైన వరి పంటకు, ఎక్కువ స్థలం, సూర్యరశ్మి అవసరమైన చెరకు, పత్తి పంటలకు, లోతైన నేల అవసరమైన వేరుశనగ, క్యారెట్ వంటి వాటికి, తక్కువ విలువైన పంటలను గ్రీన్‌హౌస్‌లో పండించడం లాభదాయకం కాదు. ఇటువంటి వాటికి గ్రీన్ హౌస్ వ్యవసాయం అంత ఆచరణీయం కాదు. అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి. గ్రీన్ హౌస్ నిర్మాణం, పరికరాల నిర్వహణకు అధిక పెట్టుబడి అవసరం. చిన్న, సన్నకారు రైతులకు ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది. రైతులకు తగిన సాంకేతిక నైపుణ్యాలు లేవు. ఈ రంగానికి సంబంధించి మన దేశంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. గ్రీన్ హౌస్ లోపల ఉష్ణోగ్రత, తేమ, కాంతిని నియంత్రించడానికి విద్యుత్, నీరు అవసరం. లోపల తేమ, వెచ్చని వాతావరణం వలన తెగుళ్ళు, వ్యాధులు త్వరగా వ్యాప్తి చెందుతాయి. కావలసిన ఉష్ణోగ్రతలను నిర్వహించడానికి, కాంతిని అందించడానికి వెంటిలేషన్ కోసం చాలా విద్యుత్తు అవసరం. ఇది శక్తి వినియోగాన్ని పెంచుతుంది. ఇది పర్యావరణానికి హానికి దారి తీయవచ్చు. ఈ సవాళ్లను అధిగమించడానికి, ప్రభుత్వాలు, రైతులు, పరిశోధకులు కలిసి పనిచేయాలి. మన దేశంలో గ్రీన్‌హౌస్ వ్యవసాయం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ అగ్రదేశాలతో పోల్చితే మన దేశ వాటా ఇంకా పరిమితంగానే ఉంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. గ్రీన్‌హౌస్ వ్యవసాయ విస్తీర్ణం ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగా ఉంది. అధిక పెట్టుబడి పెట్టడం లేదు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీని వలన రైతులు పూర్తి స్థాయిలో లాభాలు పొందలేకపోతున్నారు. ప్రభుత్వం గ్రీన్ హౌస్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నప్పటికీ సహకారం మాత్రం అంతంత మాత్రమే ఉంది. పండించిన పంటలను మార్కెట్ చేయడం, విక్రయించడం ఒక సవాలుగా ఉంది. మన దేశంలో గ్రీన్ హౌస్ వ్యవసాయంలో తన వాటాను పెంచుకోవడానికి ఈ సవాళ్ళన్నీ అధిగమించాలి. ఈ పద్ధతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఇంకా అధికంగా ప్రభుత్వం రాయితీలు, సబ్సిడీ అందించాలి. ముఖ్యంగా, చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకొని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలి. ఈ చర్యల ద్వారా భారత దేశం గ్రీన్‌హౌస్ వ్యవసాయంలో తన వాటాను పెంచుకోవచ్చు. భారతదేశంలో గ్రీన్ హౌస్ వ్యవసాయం భవిష్యత్తు చాలా ఆశాజనకంగా ఉంది. గ్రీన్ హౌస్ వ్యవసాయం రానున్న రోజులలో విస్తృతంగా వ్యాప్తి చెందుతుందని అంచనా వేస్తున్నారు. గ్రీన్ హౌస్‌లలో సెన్సార్లు, ఆటోమేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించబడుతుంది. గ్రీన్ హౌస్ వ్యవసాయం నీటిని ఎరువులను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా సుస్థిర వ్యవసాయానికి దోహదం చేస్తుంది. తక్కువ స్థలంలో ఎక్కువ దిగుబడిని పొందడానికి వర్టికల్ ఫార్మింగ్ పద్ధతులు ఉపయోగించబడతాయి. నగరాల్లో గ్రీన్ హౌస్‌లను ఉపయోగించి పంటలను పండించడం పెరుగుతుంది. ఇప్పటికే గ్రీన్ హౌస్ వ్యవసాయం అనేక రాష్ట్రాలలో విస్తరిస్తోంది. కూరగాయలు, పువ్వులు, ఇతర విలువైన పంటలను పండిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది, ప్రభుత్వ సహకారం పెరిగితే ఈ రంగం మరింత వృద్ధి చెందుతుంది. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సమర్థవంతమైన నీటి యాజమాన్యంపై దృష్టి సారించడం ద్వారా పర్యావరణ ప్రభావాలను తగ్గించవచ్చు.

## 30వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తాం

### కొత్తగా 20 వేల జీవనోపాధి యూనిట్ల ఏర్పాటు

### మెప్మా వెబ్ సైట్, మెప్మా మొబైల్ యాప్ ప్రారంభించిన మంత్రి

విజయవాడ : ఈ ఆర్థిక సంవత్సరంలో 30వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేయడమే లక్ష్యంగా మెప్మా ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం ఉన్న పదివేల జీవనోపాధి యూనిట్లతో పాటు కొత్తగా 20 వేల జీవనోపాధి యూనిట్లను ఏర్పాటు చేసేందుకు మెప్మా ప్రణాళిక రూపొందించింది. తొమ్మిది రకాల జీవనోపాధి యూనిట్లను రూపొందించింది. విజయవాడలో మెప్మా వన్ డే వర్క్ షాప్ నిర్వహించారు. మహిళాకాశం పేరిట మెప్మా వెబ్ సైట్, మెప్మా మొబైల్ యాప్ ను మంత్రి నారాయణ ప్రారంభించారు. మహిళా వ్యాపారుల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక లక్ష్యంతో వర్క్ షాప్ నిర్వహించారు. వన్ డే వర్క్ షాప్ కి మెప్మా డైరెక్టర్ తేజ భరత్, మంత్రి నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. ఇన్ని సంవత్సరాల తరువాత కూడా డ్వాక్రా సంఘాలు, మెప్మా డేటాను పర్ఫెక్ట్ గా ఉంచుకున్నారు.. ప్రభుత్వం నుంచి ఏం ఇవ్వాలన్నా డేటా పర్ఫెక్ట్ గా ఉండాలి.. ఈ రోజు ఐదు వెబ్‌సైట్ లు ప్రారంభించాం.. 2047 నాటికి ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త వుండాలని సీఎం చంద్రబాబు లక్ష్యం.. గతంలో ఇసుక కాంట్రాక్టులు డ్వాక్రా గ్రూపులకు ఇచ్చారు.. కొన్ని అనివార్య కారణాలవల్ల అది అమలు జరుగలేదు.. 80 వేల సంఘాలకు 8 కోట్లు ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నాం.. 26 జిల్లాలలో మీటింగ్‌లు పెట్టాలని అనుకుంటున్నాం.. 2029 నాటికి సాధ్యమైనంత మేరకు మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు. 2029 నాటికి సాధ్యమైనంత మేరకు పారిశ్రామిక వేత్తలను చేస్తామని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా మెప్మా అధికారులు ఏపీ సచివాలయంలో ఘనంగా సన్మానించారు.

## ఒక్క డాలర్‌కు 10 లక్షల రియాళ్లు

### ట్రంప్ దెబ్బకు ఇరాన్ కరెన్సీ కుదేలు

టెహరాన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలతో ఇరాన్ ఆర్థికంగా కుదేలు అవుతోంది. ఇరాన్ కరెన్సీ రియాల భారీగా పతనమైంద. డాలర్‌తో పోలిస్తే రియాల్ విలువ ఏకంగా 1043000కు పడిపోయింది. మున్ముందు ఇది మరింత క్షీణించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ట్రంప్ రెండవ సారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రియాల్‌పై ఒత్తిడి విపరీతంగా పెరుగుతోంది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలే ఇందుకు కారణం. ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు విధించారు. అంతే కాదు. బరాక్ ఒబామా హయాంలో కుదిరిన అణు ఒప్పందం నుంచి కూడా ట్రంప్ వైదొలిగారు. ట్రంప్ రెండవ విడత అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే విధమైన ఒత్తిడి కొనసాగిస్తున్నారు. ఆయన ఇటీవల ఇరాన్‌పై భారీగా ఆంక్షలు విధించారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేస్తున్న సంస్థలను ట్రంప్ లక్ష్యంగా చేసుకున్నారు. అణు ఒప్పందంపై నేరుగా చర్చలకు రావాలని కోరుతూ ట్రంప్ ఇటీవల రాసిన లేఖపై ఇరాన్ సానుకూలంగా స్పందించలేదు. దీనితో ఇరాన్‌పై బాంబులు వేస్తామని ట్రంప్ ఒక ఇంటర్వ్యూలో హెచ్చరించారు.



## కాంగ్రెస్, బిఆర్ఎస్‌లది ఫెవికాల్ బంధం

### అనేక సందర్భాల్లో బట్టబయలైన దోస్తీ

హైదరాబాద్ : తెలంగాణలో బీజేపీ ఒక్కటే ప్రజా సమస్యలపై పోరాటం చేస్తోందని, మిగతా పార్టీలన్నీ కాంగ్రెస్‌తో చేతులు కలిపాయని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. పార్లమెంట్ వేదికగా ఆయా పార్టీల బంధం బయటపడిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ బయట తిట్టుకుంటూ ఎంఐఎంతో అంతర్గతంగా కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. చెన్నైలో ఆ రెండు పార్టీలూ ఒకే వేదిక పంచుకోవడంతోనే వారి మధ్య బంధం బయటపడిందని విమర్శనాస్త్రాలు సంధించారు. బీజేపీ అన్ని ఎన్నికల్లో విజయం సాధిస్తుండటంతో తమకు పుట్టగతులు ఉండవని కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏకమవుతున్నాయని మండిపడ్డారు. గ్రాడ్యుయేట్, టీ-చర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఇద్దరూ కలిసి కుట్రలు చేశారని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పోటీ- చేయకుండా పరోక్షంగా మజ్లిస్ గెలిచేందుకు తోడ్పాటు- అందించారని మండిపడ్డారు. ఈ మూడు పార్టీల కుట్రా రాజకీయాలను ప్రజలు తిప్పికొడతారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన అంశం పెద్దగా ప్రయోజనం ఇవ్వకపోవడంతో భాష పేరుతో వైషమ్యాలు సృష్టిస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. దానికి కుట్రదారులుగా సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కేటీ-ఆర్ పనిచేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ-రేసింగ్ విషయంలో ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ఆ అంశాలనే పక్కన పెట్టిందని ధ్వజమెత్తారు. వక్ఫ్ బోర్డు పేరుతో ఏళ్లపాటు- పేదల భూములు దోచుకున్నారని ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. అలాంటి వారి వల్ల పస్మంద, షియా, బోరా ముస్లిం సమాజాలు ఇంకా పేదరికంలో మగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని పేదరికం నుంచి బయటపడేందుకు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న పనులకు సహకరించాల్సింది పోయి ఆ పార్టీలన్ని కలిసి వ్యతిరేకించాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలతో ముస్లిం ప్రజలను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. పార్లమెంట్ పాస్ చేసిన వక్ఫ్ బిల్లుపై పేద ముస్లింలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇదో చారిత్రాత్మకమైన బిల్లన్నారు. తెలంగాణలో 77,538 ఎకరాల వక్ఫ్ భూములు ఉంటే ఇప్పుడు 57 వేల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని అధ్యయనంలో తేలిందని చెప్పుకొచ్చారు. ఎంఐఎం నేతలు వక్ఫ్ ఆస్తులను నోటరీ డాక్యుమెంట్లతో లీజులకు ఇచ్చి దోచుకున్నారనే విషయం సైతం బట్టబయలు అయ్యిందని అన్నారు. నూతన చట్టం అమలైన తర్వాత బడాబాబులు వక్ఫ్ ఆస్తులు ఎలా దోచుకున్నారో తెలుస్తుందని హెచ్చరించారు. ఎంత మంది అడ్డుపడినా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో చరిత్రాత్మక వక్ఫ్ బిల్లు ఆమోదం పొందిందని ఎంపీ లక్ష్మణ్ చెప్పుకొచ్చారు.

## మహిళల స్టాళ్లను పరిశీలించిన సిఎం చంద్రబాబు

### మహిళా పథకాలతో ఉన్నతంగా ఎదగాలని సూచన

అమరావతి : బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా చందర్లపాడు మండలం, ముప్పాళ్లలో శనివారం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమం సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ, ఎస్‌సీ కార్పొరేషన్, విభిన్న ప్రతిభావంతుల శాఖ తదితర శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందర్శించారు. ఎస్‌సీ కార్పొరేషన్ సబ్సిడీతో కూడిన సెర్ప్ ఉన్నతి వడ్డీలేని రుణాల మంజూరుకు సంబంధించిన స్టాల్‌ను సందర్శించి.. మహిళలతో మాట్లాడారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా వివిధ కేటగిరీలకు చెందిన పదిమంది లబ్ధిదారులకు రూ. 3,40,200 విలువైన ఉపకరణాలు అందించారు. ఒక్కో -ట్రై సైకిల్ రూ. 60 వేలు కాగా.. రూ. 1,80,000 విలువైన మూడు బ్యాటరీ -ట్రైసైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. డిగ్రీ కోర్సులు చేస్తున్న నలుగురు విభిన్న ప్రతిభావంతులకు ఒక్కొక్కటి రూ. 35 వేలు విలువైన ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. ఒక్కొక్కటి రూ. 8,500 విలువైన రెండు వీల్‌ఛైర్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా రూ. 3,200 విలువైన వినికిడి యంత్రాన్ని లబ్ధిదారునికి అందించారు. ఇకపోతే ముప్పాళ్లలోని బాలికల గురుకుల సంక్షేమ వసతి గృహాన్ని, పాఠశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొనడానికి ముప్పాళ్ల వెళ్లిన సీఎం చంద్రబాబు గురుకుల పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాల అంతా కలియదిరిగారు. వంటశాల, భోజనశాలలో పరిశుభ్రతను పరిశీలించారు. కోడిగుడ్లు, బియ్యం, కూరగాయలు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచిగా, నాణ్యతతో అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి సీఎం తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ధేశిరచిన మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా అని అడిగారు. అనంతరం డార్మెటరీని పరిశీలించారు.

## ఝరాసంగం కేతకి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శన

### జడ్జిలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు

ఝరాసంగం : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జిలు జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి, జస్టిస్ పి. శ్రీసుధ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా జడ్జిలకు ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాలు మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదాచారణ చేసి గర్భగుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారికి అభిషేకం, మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జడ్జీలకు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శివ రుద్రప్ప పూలమాల శాలువాతో సన్మానించి స్వామివారి ప్రసాదంతో పాటు చిత్రపటాన్ని అందజేశారు. జడ్జిల వెంట సంగారెడ్డి జిల్లా జడ్జి భవాని చంద్ర, జహీరాబాద్ జడ్జి శ్రీధర్, ఆర్డీవో రామ్ రెడ్డి, డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ తిరుమలరావు, ఆర్ఐ రామారావు, శేఖర్ పటేల్ లు ఉన్నారు.

## బీజేపీ, కాంగ్రెస్ చీకటి ఒప్పందాలు

### ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రోటోకాల్‌కు తిలోదకాలు : దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హైదరాబాద్ : ఆరు నెలలు అమెరికాలో ఆరు నెలలు భారత్‌లో ఉంటూ కాంగ్రెస్ పార్టీలో తన ఉనికిని కాపాడుకునేందుకు రాజకీయాలు చేయడం మధుయాష్కీకి పరిపాటిగా మారిందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మధుయాష్కీ తీరును సుధీర్‌రెడ్డి ఎండగట్టారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీల చీకటి పొత్తుతోనే ప్రోటోకాల్ రగడ సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. మధుయాష్కీ అవగాహన లేమితో బీజేపీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులను తప్పుదోవపట్టించి రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. సంవత్సర కాలంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రారంభించకుండా అటు అధికారులను, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని తప్పుదోవపట్టించే విధంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా మధుయాష్కీ వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఎన్నడూ లేని విధంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎస్‌ని విమర్శిస్తున్నారన్నారు. కనీస అవగాహన లేకుండా బీజేపీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నేతలు కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడవస్థానంలో నిలిపి ప్రజలు బుద్ధి చెప్పినా మధుయాష్కీ చిల్లర రాజకీయాలు మానుకోవడం లేదని మండిపడ్డారు. మధుయాష్కీ తనపై వ్యక్తిగత దూషణలకు దిగడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాజకీయాలలో హుందాతనం చాలా అవసరమన్నారు. రెండుసార్లు ఎంపీగా పనిచేసిన వ్యక్తి ఈ విధంగా ప్రవర్తించడం తగునా అని అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నదని కావునా తానేమి మాట్లాడనని ఆయన చెప్పారు. కోర్టుతీర్పు అనంతరం ఆ అంశంపై మాట్లాడుతానన్నారు.

## ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మిస్సింగ్

హైదరాబాద్ : సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులు అదృశ్యమయ్యారు. ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. న్యూ బోయిన్‌పల్లి ఏడుగుళ్ల సమీపంలో నివాసం ఉండే మహేశ్, ఉమా దంపతులుగా తెలుస్తోంది. వారి ముగ్గురు పిల్లలతోపాటు సంధ్యా అనే మరో కుటుంబ సభ్యురాలు కూడా కనిపించకుండా పోయారు. స్థానిక నీటి సరఫరా కేంద్రంలో ఆపరేటర్‌గా మహేష్ పనిచేస్తున్నాడు. గురువారం మహేష్ ఇంటికి సంధ్యా వెళ్లింది. సంధ్యాతో పాటు అదే రోజు బయటకు వెళ్లి మహేష్, భార్య పిల్లలు తిరిగిరాలేదు. ఇంటి యజమాని సమాచారంతో పోలీసులకు మహేష్ బావ భిక్షపతి ఫిర్యాదు చేశాడు. భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆరుగురు ఆటో బుక్ చేసుకుని బోయిన్‌పల్లి నుంచి ఎంజీబీఎస్ స్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి ఎటు వెళ్లారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆరుగురి ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను పోలీసులు విచారణ చేస్తున్నారు. వీరి మిస్సింగ్ సికింద్రాబాద్‌లో మిస్టరీగా మారింది.

## క్రికెట్ ఆడుతూ కూప్పకూలిన విద్యార్థి

### మేడ్చల్ సీఎంఆర్ కాలేజ్‌లో ఘటన

ఖమ్మం : "హార్ట్ ఎటాక్" ఒకప్పుడు వయస్సు మళ్లిన వారికే ఎక్కువగా వచ్చేది..కానీ ఇటీవల కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా..పిల్లల నుంచి పెద్దల వరకు హార్ట్ ఎటాక్ కారణంగా ప్రాణాలు వదిలేస్తున్నారు. ఇలా హార్ట్ ఎటాక్‌తో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. జిమ్‌లో వర్కౌట్ చేస్తూ పడిపోవడం, పెళ్లి భరత్‌లో డ్యాన్స్‌లు చేస్తూ గుండెపోటుతో ప్రాణాలు వదలడం వంటి ఘటనలు మనం చాలానే చూస్తున్నాం. అప్పటి వరకు అందరితో సరదాగా నవ్వుతూ గడిపిన వారు క్షణాల్లో నేల కూలి ప్రాణాలు వదిలేస్తున్నారు. ఇలాంటి ఘటనే తాజాగా మేడ్చల్ జిల్లాలోని కండ్లకోయలో ఉన్న సీఎంఆర్ కాలేజ్‌లో చోటుచేసుకుంది. సీఎంఆర్ కాలేజ్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఓ స్టూడెంట్ క్రికెట్ ఆడుతూ గుండె పోటుతో గ్రౌండ్‌లోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. ఖమ్మం జిల్లాకు చెందిన వినయ్.. మేడ్చల్ జిల్లా కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అయితే క్రికెట్ ఆడుదామని స్నేహితులతో కలిసి కాలేజీ గ్రౌండ్‌కు వెళ్లారు. అందరూ కలిసి సంతోషంగా క్రికెట్ ఆడుతూ ఉన్నారు. అయితే గ్రౌండ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న వినయ్.. ఒక్కసారిగా ఛాతీలో నొప్పితో కుప్పకూలిపోయాడు. వెంటనే గ్రౌండ్‌లో ఉన్న స్నేహితులంతా వినయ్ దగ్గరకు వచ్చారు. వినయ్‌కు సీపీఆర్ చేశారు. అయినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో.. వినయ్‌ను సమీపంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వినయ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. అప్పటిదాకా సరదాగా తమతో కిక్రెట్ ఆడిన ఫ్రెండ్ కళ్లముందే ప్రాణాలు కోల్పోవడంతో స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. క్రికెట్ ఆడుదామని వచ్చి..స్నేహితుడి చావు చూడాల్సి వచ్చిందేనని ఆవేదన వ్యక్తం చేశారు.

## మల్కాజిగిరి సమస్యలు పరిష్కరించండి

హైదరాబాద్ : మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సమస్యలను పరిష్కరించాలని మంత్రి శ్రీధర్‌బాబును.. భాజపా ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును ఈటల రాజేందర్ కలిశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, రోడ్లు సరిగా లేవని, చెరువులు మురికి కూపాలుగా మారాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైడ్రా పేరిట డబ్బులు వసూలు చేస్తున్న బ్లాక్‌మెయిలర్లపై దృష్టి సారించాలని కోరారు. నగరానికి నాలుగు వైపులా డంప్ యార్డులు ఉండాలని.. చెత్తంతా బాలాజీనగర్‌కు పంపిస్తే అక్కడి ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందన్నారు. అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని శ్రీధర్‌బాబును కోరారు.





## నటి శ్రీలీలకి చేదు అనుభవం.. శ్రీలీల చేయి పట్టుకుని లాగిన ఆకతాయిలు

టాలీవుడ్ నటికి శ్రీలీలకు చేదు అనుభవం ఎదురైంది. ఒక సినిమా ఈవెంట్‌లో భాగంగా బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో కలిసి వెళుతుండగా.. గుంపులో ఉన్న ఆకతాయిలు ఆమె చేయి పట్టుకుని లాగారు. దీంతో అప్రమత్తమైన ఆమె బాడీగార్డ్‌లు వారి నుంచి శ్రీలీలను కాపాడారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కార్తిక్ ఆర్యన్, శ్రీలీల జంటగా ఒక బాలీవుడ్ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. సంగీత నేపథ్యంలో రాబోతున్న సినిమాతోనే శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతుంది. ఈ సినిమాకు అనురాగ్ బసు(%ూఅబతీఘస్త్ర దీఘంబ%) దర్శకత్వం వహిస్తుండగా.. గుల్షన్ కుమార్ %డ% టి-సిరీస్ ప్రెజెంటేషన్, ఎ టి-సిరీస్ ఫిల్మ్స్ %డ% అనురాగ్ బసు ప్రొడక్షన్ బ్యానర్‌లపై భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మిస్తున్నారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాకు సంగీత దిగ్గజం ప్రీతమ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

## అచితూచి సంయుక్త మీనన్ సినిమాలు

ఇండస్ట్రీలో 90శాతం సక్సెస్ రేట్ ఉన్న కథానాయిక సంయుక్త మీనన్. రాశి కన్నా వాసి ముఖ్యమన్నట్లు ఆచితూచి సినిమాలను ఎంచుకుంటూ ముందుకెళ్తున్నది ఈ మలయాళ మందారం. ప్రస్తుతం సౌత్‌లో అన్ని భాషలూ కలిపి ఓ అరడజను సినిమాలు ఈ అమ్మాయి చేతిలో ఉన్నాయి. ఇదిలావుంటే.. ఇటీవలే ఓ తెలుగు సినిమాకు ఈ ముద్దుగుమ్మ పచ్చజెండా ఊపేసిందట. పైగా అది లేడీ ఓరియెంటెడ్ సినిమా అని సమాచారం. రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ చిత్రానికి యోగి దర్శకుడు. ఈ సినిమాకు 'రాక్షసి' అనే టైటిల్‌ని అనుకుంటున్నారట. ఫిల్మ్‌ఛాంబర్‌లో ఈ టైటిల్‌ని రిజిస్టర్ కూడా చేయించినట్లు తెలుస్తున్నది. ఇందులో సంయుక్త పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని వినికిడి. పేరుకు తగ్గట్టే వైల్డ్‌గా ఈ పాత్ర బిహేవ్ చేస్తుందట. అందుకే ఈ కథకు 'రాక్షసి' అనే టైటిల్ అనుకుంటున్నారు. ఈ సినిమా నిర్మాణంలో కూడా సంయుక్త భాగస్వామిగా ఉంటారని తెలుస్తున్నది.






## ఒజీలో డీజే టిల్లు భామ నేహాశెట్టి

టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న మోస్ట్ క్రేజీయెస్ట్ సినిమా ఓజీ. సుజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే షూటింగ్‌కు సంబంధించిన స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. ఈ చిత్రంలో స్పెషల్ సాంగ్ ఉండబోతుందట.. ఈ పాటలో డీజే టిల్లు భామ నేహాశెట్టి మెస్మరైజ్ చేయబోతుందట. పవన్ కల్యాణ్‌తో నేహాశెట్టి స్టెప్పులేయబోతుందన్న వార్తలపై ప్రస్తుతానికి అధికారిక ప్రకటన ఏం రాకున్నా.. ఈ అప్‌డేట్‌ను మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మూవీ లవర్స్ అండ్ ఫ్యాన్స్. ఈ చిత్రంలో గ్యాంగ్ లీడర్ ఫేం ప్రియాంకా ఆరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రియారెడ్డి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య తెరకెక్కిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన ఓజీ గ్లింప్స్.. పవన్ కల్యాణ్ పూర్తిగా నయా అవతార్‌లో చూపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. ఈ చిత్రంలో పాపులర్ జపనీస్ నటుడు కజుకి కిటముర, ప్రముఖ థాయ్ యాక్టర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## మెగా ప్రయోగం

చిరంజీవి సినిమా అంటే.. అందమైన ఇద్దరు హీరోయిన్లుండాలి. అదిరిపోయే బీట్ ఉన్న పాటలుండాలి. అదరహో అనిపించే స్టెప్పులుండాలి. మెగా టైమింగ్‌కి తగ్గట్టు డైలాగులుండాలి.. ఈవన్నీ ఉంటేనే అది చిరంజీవి సినిమా. కానీ మెగాస్టార్ ఇవేమీ లేకుండా ప్రయోగాత్మక సాహసానికి సిద్ధమవుతున్నారని సమాచారం. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా మే 9న విడుదల కానుంది. ఆ తర్వాత అనిల్ రావిపూడి సినిమా ఉంటుంది. ఆ తర్వాత 'దసరా'ఫేం శ్రీకాంత్ ఓదెల సినిమా చేస్తారు చిరంజీవి. ఈ సినిమా విషయంలోనే చిరంజీవి ప్రయోగం చేయనున్నారని తెలుస్తున్నది. ఈ సినిమా కమల్‌హాసన్ 'విక్రమ్' తరహాలో ఉంటుందట. ఇందులో ఫైట్లు తప్ప డాన్సులు, హీరోయిన్లతో ఆటపాటలు, కామెడీ ఇలాంటివేం ఉండవంట. చిరు క్యారెక్టర్ చాలా ఇంటెన్స్‌గా ఉంటుందని, మెగా అభిమానులు పండుగ చేసుకునేలా క్యారెక్టరైజేషన్ ఉంటుందని సమాచారం.



## రాజాసాబ్ షూటింగ్ పూర్తి

గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంపౌండ్ నుంచి హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న చిత్రం రాజాసాబ్. మారుతి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు ప్రకటించారని తెలిసిందే. సినిమా షూటింగ్‌కు సంబంధించి అభిమానుల్లో నెలకొన్న డైలామాకు చెక్ పెట్టాడు మారుతి. ఈ డైరెక్టర్ బచ్చలమల్లి ప్రమోషనల్ ఈవెంట్‌లో రాజాసాబ్ షూటింగ్ పూర్తయిందని క్లారిటీ ఇచ్చేశాడు. అయితే రాజాసాబ్ అనుకున్న సమయానికి రావడం లేదన్న వార్త ఒకటి మూవీ లవర్స్‌ను నిరాశ చెందేలా చేస్తుంది. రాజాసాబ్ విడుదల వాయిదా పడిందని వార్తలు వస్తుండగా.. మరోవైపు మీరు ఏ డేట్‌కు చూడాలనుకుంటే బాగుంటదో అదే తేదీన రాజాసాబ్ వస్తుందని మారుతి చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరి రాజాసాబ్ విడుదలపై మేకర్స్ నుంచి అధికారికంగా ఏదైనా ప్రకటన వస్తుందేమో చూడాలి. అంతేకాదు రాజాసాబ్ టీజర్ రన్‌టైం 2 నిమిషాల 15 సెకన్లు అని ఇన్‌సైడ్ టాక్. రాజాసాబ్ మోషన్ పోస్టర్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రంలో మలబారు సోయగం మాళవిక మోహనన్, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. బాలీవుడ్ యాక్టర్ సంజయ్ దత్ కీ రోల్ పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.




## జాక్‌తో ముందుకు వస్తున్న జొన్నలగడ్డ

టాలీవుడ్ యాక్టర్ సిద్దు జొన్నలగడ్డ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ క్రేజీ యాక్టర్ నటిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటి జాక్. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ 37గా వస్తోంది. మేకర్స్ తాజాగా విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చారు. ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్‌ను 2025 ఏప్రిల్ 10న విడుదల చేస్తున్నట్టు ప్రకటించగా.. రిలీజ్ వాయిదా పడుతుందంటూ వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాక్ సినిమాను ఇదే తేదీన విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. తాజా లుక్‌లో నిర్మానుష్య ప్రదేశంలో ఓ వైపు జీపు కనిపిస్తుండగా.. మరోవైపు గన్‌ను చూడొచ్చు. రాజాసాబ్ తేదీన వస్తుండటంతో సూపర్ బజ్ క్రియేట్ అవడం పక్కా అని అర్థమవుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సిద్దు జొన్నల గడ్డ దీంతోపాటు నీరజ కోన డైరెక్షన్‌లో తెలుసు కదా సినిమా చేస్తుండగా.. మరోవైపు టిల్లు 3 కూడా లైన్‌లో ఉంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com